

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 191 పేజీలు: 8+4 వెల: 6.50


## జెన్‌జడ్‌ను తప్పుదారి పట్టించారు: ధర్మేంద్ర ప్రధాన్
5లో

## పాక్‌లో లష్కర్ కమాండర్ అనుమానాస్పద మృతి

## దుశ్చర్యకు బలి..

# మృత్యువుతో పోరాడి ఓడిన మెడికో ప్రియాంక



### రాజమండ్రిలో కొందరు మద్యం మత్తులో కారుతో ఢీకొన్న ఘటన..

### హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ప్రియాంక మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు9,ప్రభాతవార్త:** అభంశుభంతెలియని ఓ యువవైద్యురాలు దుర్మార్గపు దుశ్చర్యకు బలైంది. మద్యం మత్తులో ఇరువురు యువకులు కారుతో ఢీ కొట్టి ఆమె ఉసురు తీసుకున్నారు. తీవ్ర గాయాలతో సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రియాంక. బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించిన వైద్యులు. ఏడు రోజులు మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచింది. ఆ కుటుంబం, తల్లిదండ్రుల ఆశలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి.ఏ విధంగానూ సంబంధం లేని వైద్యురాలి పట్ల కర్కశంగా వ్యవహరించి మూడుసార్లు కారుతో ఢీకొట్టిన ఆ మత్తు దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది.

ఈ నెలమూడవ తేదీన రాజమండ్రిలో కారు ఢీ కొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ డాక్టర్ ప్రియాంక(28) ఆదివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మృతి చెందారు. ఏడు రోజులుగా వైద్యం అందిస్తున్నా ఫలితంలేకపోయింది. ప్రమాదం జరిగిన రోజునే ప్రియాంక బ్రెయిన్‌డెడ్‌గా >>2

# ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

### వారి సమగ్రాభివృద్ధికి 5 అంశాలతో ప్రణాళిక
### స్వర్ణాంధ్రకోసం అంతా కలిసి పనిచేద్దాం
### పనిచేసే ప్రతి వ్యక్తి సమాజానికి మంచి ఆస్తి
### అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో సిఎం చంద్రబాబు



ఆదివారం విజయవాడలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశానికి, రాష్ట్రానికి విజన్ ఉన్నట్టే ప్రతీ పౌరుడికి ఓ విజన్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశం, రాష్ట్రం, గ్రామం, కుటుంబం అభివృద్ధికోసం అంతా సంకల్పం తీసుకోవాలని ఆయన అన్నారు. 2047 స్వర్ణాంధ్ర కోసం తాను సంకల్పం తీసుకున్నానని ముఖ్యమంత్రి అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి సిఎం హాజరయ్యారు. గిరిజన సంప్రదాయ నృత్యం ధింసా, డప్పు, వివిధ వాయిద్యాలతో గిరిజన మహిళలు, మంత్రి సంధ్యారాణి, ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ధింసా నృత్యం చేస్తున్న మహిళలతో ఆయన కూడా అడుగులు వేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి సిఎం నివాళిఅర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "ప్రకృతిని ఆరాధిస్తూ, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేయగల సామర్థం ఆదివాసీలకు ఉంది. ఓ సామాన్య ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ము ఒడిశాలో మంత్రిగా, గవర్నర్‌గా పనిచేసి నేడు రాష్ట్రపతిగా అత్యున్నత స్థానంలో ఉన్నారు. మన సంకల్పమే మనకు ఆత్మవిశ్వాసం కల్పించి అందలాలు ఎక్కిస్తుంది.

అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, ప్రధాని మోడీ ఇలా ప్రతి ఒక్కరూ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వారే. సంకల్పం ఒక్కటే మార్పు తెస్తుందని అంతా గుర్తించాలి. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా అంతా సంకల్పం తీసుకోవాలి. నేను, నా దేశం, నా రాష్ట్రం, నా ఊరు నా కుటుంబం అనే భావనతో సంకల్పం చేస్తేనే అభివృద్ధి సాధించగలం. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి, దేశానికి నేను ఏమివ్వాలనే లక్ష్యంతో పనిచేద్దాం. గిరిజన రైతులు తన పంటను మెరుగ్గా పండించి దేశంకోసం కృషి చేశారు. స్వయం ఉపాధితో సంపాదిస్తున్న మహిళ దేశం కోసం పనిచేసినట్టే. ఓ విద్యార్థి, ఓ ఉద్యోగి, ఓ వ్యాపారి, ఓ కూలి ఇలా ఎవరైనా నిష్ఠతో అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేస్తే దేశంకోసం పనిచేసి >>2



# 13 నుంచి 15 దాకా ప్రతి ఇంటిపై జాతీయ జెండా

### వికసిత్ భారత్ స్ఫూర్తి ప్రతిబింబించాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు9, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆగస్టు 15 నుంచి పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇంటింటా జాతీయ జెండా, ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తి నింపాలని సిఎం పిలుపునిచ్చారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని సిఎం స్పష్టం చేశారు. 'మై నేషన్‌నేషన్ ఫస్ట్' అనే భావన ప్రతి ఇంటికీ చేరాలని ఆకాంక్షించారు. 2047 లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేయాలన్నారు. వికసిత్ భారత్‌స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛంధ సేవా స్ఫూర్తిని పునరుద్ధరించాలని చంద్రబాబు నొక్కి చెప్పారు.



# 'త్రివర్ణ పతాకం మన గర్వకారణం'

### 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి
2లో

### దేశ ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు

## నేడు కలిదిండిలో సిఎం పర్యటన

**ఏలూరు, ఆగస్టు 9, ప్రభాత వార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 10వతేదీన ఏలూరు జిల్లాలోని కలిదిండిలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎదురు జిల్లా కలెక్టర్ సెల్వీ సీఎం పర్యటన షెడ్యూల్ విడుదల చేశారు. సిఎం చంద్రబాబు సోమవారం ఉదయం 10.30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కలిదిండిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. ఉదయం 11 గంటలకు కలిదిండి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రైతులతో మాట్లాడతారు. అనంతరం 11.45 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి బయలుదేరి పాత పోస్టాఫీసు వెనుక ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమానికిచేరుకుంటారు. మధ్యాహ్నం 2.05 గంటల వరకు ప్రజావేదికలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.55 గంటలకు కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకుని పార్టీ క్యాడర్ సమావేశంలోపాల్గొంటారు. సాయంత్రం 4.25 గంటలకు మార్కెట్ యార్డు నుంచి బయలుదేరి 4.35 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4.40 గంటలకు కలిదిండి నుంచి హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరి వెళతారు.

## భారత్ చట్టాలను పాటించాల్సిందే

### మెటాకు కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** మెటా ప్లాట్‌ఫారమ్‌లు భారత చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని ప్రభుత్వం ఆదివారం స్పష్టం చేసినట్లు సమాచారం. సోషల్ మీడియా దిగ్గజంతో ఇటీవల జరిగిన చర్చల ముఖ్య ఉద్దేశ్యం, కేవలం ఆ సంస్థ ప్రపంచ ప్రమాణాలను అనుసరించడం కాదని, దాని విధానాలు, కంటెంట్ నియంత్రణ పద్ధతులు దేశ చట్టపరమైన చట్రానికి అనుగుణంగా ఉండేలా చూడటమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. మెటా తన సిఫార్సు అల్గారిథమ్‌లను పూర్తిగా మార్చాలని అధికారులు ఆదేశించారని చెప్పడం వాస్తవానికి తప్పు అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దానికి బదులుగా, సంస్థ కంటెంట్ విధానాలు, అమలు యంత్రాంగాలు, ప్లాట్‌ఫారమ్ పాలన భారత చట్టపరమైన అవసరాలను తగినంతగా ప్రతిబింబించేలా చూడటమే కొనసాగుతున్న చర్చల ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొంది. >>2



ఆదివారం ప్రకాశం బ్యారేజీ వద్ద పట్టిసీమ నుంచి వచ్చిన నీటిని పరిశీలిస్తున్న చంద్రబాబు

# ఎంత నీరు! ఎంత జోరు!

### ప్రకాశం బ్యారేజ్‌వద్ద నీటి ఉధృతిని పరిశీలించిన సిఎం చంద్రబాబు

### పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 17 టిఎంసిల నీరు తరలింపు


**విజయవాడ,ఆగస్టు9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజ్‌లో గోదారమ్మ నీటి పరవళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. పట్టి సీమ ద్వారా కృష్ణమ్మకు వస్తున్న గోదావరి నీటిని ముఖ్యమంత్రి తిలకించారు. విజయవాడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని తిరిగి నివాసానికి వెళుతున్న సమయంలో బ్యారేజ్‌పై కొద్దిసేపు తన వాహన కాన్వాయ్ నిలిపిన ముఖ్యమంత్రి గోదావరి నీటితో నిండు కుండలా ఉన్న బ్యారేజ్‌ను పరిశీలించారు. గోదావరి నీటితో బ్యారేజ్ నిండుగా ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తోందని సిఎం ఈ సందర్భంగా అన్నారు. పట్టిసీమ ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 17.52 టిఎంసిల నీటిని కృష్ణా నదికి తరలించినట్లు అధికారులు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాల కారణంగా గోదావరి నది నుంచి ఇప్పటి వరకు 521 టిఎంసిల నీరు సముద్రంలో కలిసినట్లు అధికారులు తెలిపారు. పట్టి సీమ ప్రాజెక్టు ద్వారా సమృద్ధిగా గోదావరి జలాలు వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజి దిగువన వివిధ కాలువల ద్వారా డెల్టాలోని పంటలకు నీటిని విడుదల చేస్తున్నామని సిఎం అన్నారు.

కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి 3928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ నుంచి 3115 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌నుంచి 115 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు నీటి సరఫరా కోసం మొత్తం కాలువలకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పట్టిసీమ నీరు పంటలకు జీవం పోస్తోందని ఈ సందర్భంగా సిఎం అభిప్రాయపడ్డారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా ఎల్ నినో పరిస్థితుల్లో సాగునీటి ఇబ్బందుల్ని అధిగమించేందుకు అన్ని విధాలా పనిచేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

# ఇక అంతరిక్షంలో వ్యవసాయం!

### • వరి పంట పండించి కోత కోసిన చైనా • చంద్రుడు, అంగారకుడిపై ధాన్యం సాగు

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త :** రాబోయే రోజుల్లో అంతరిక్ష కేంద్రాల్లోనే పంటలు పండించి, వ్యోమగాములు అక్కడే భోజనం తయారు చేసుకునే రోజులు రాబోతున్నాయి. ఇందుకు ఊతమిచ్చేలా చైనా చేపట్టిన ప్రయోగం విజయవంతం అయింది. భూమికి వందల కిలోమీటర్ల ఎత్తులో ఉన్న చైనా తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు వరి పంటను తొలిసారి విజయవంతంగా పండించారు. విత్తనం వేసి ధాన్యాన్ని నూర్పే వరకు జీవిత చక్రాన్ని పూర్తిచేసి ప్రతిష్టాత్మక మైలురాయిని దాటారు. చైనా చేపట్టిన షెంజౌ23 మిషన్‌లో భాగంగా మే 24న వరి విత్తనాలను టియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. రెండు నెలలకు పైగా సూక్ష్మ గురుత్వాకర్షణ పరిస్థితుల్లో వాటిని పెంచిన అనంతరం వ్యోమగాములు జూ యాంగ్జు, జాంగ్ జియువాన్, లై కైయింగ్ తొలి వరి నమూనాలను సేకరించారు. అంతరిక్ష ఇక్యూబేటర్లలో ప్రత్యేక ఎల్ఈడీ కాంతి, ద్రవ పోషకాల ద్వారా నీరు, ఎరువులను అందించి వరి పంట పండించారు. సాధారణంగా భూమిపై గురుత్వాకర్షణ ప్రభావంతో మొక్కల వేళ్లు కిందికి, కాండం పైకి పెరుగుతాయి. అయితే, అంతరిక్షంలోని మైక్రోగ్రావిటీ (శూన్య గురుత్వాకర్షణ శక్తి)లో వాతావరణంలో మొక్కల పెరుగుదల శైలి మారినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. చైనా శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో రెండు రకాల జపోనికా వరి విత్తనాలను ఉపయోగించారు. ఒకటి అంతరిక్షానికి ఎప్పుడూ వెళ్లని సాధారణ విత్తనాలు కాగా, మరొకటి 2022లో టియాంగాంగ్‌లో పండించిన వరి నుంచి వచ్చిన విత్తనాలు. అంతరిక్ష వాతావరణానికి గతంలో అలవాటు పడిన విత్తనాలు తరువాతి తరాల్లో ఎలా స్పందిస్తాయో శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. 2022లో చైనా అంతరిక్షంలో తొలిసారిగా వరి పూర్తి జీవచక్ర ప్రయోగాన్ని నిర్వహించింది.




ఆ సమయంలో ఆరు వరి విత్తనాలను 120 రోజులపాటు కక్ష్యలో పెంచగా, 59 కొత్త విత్తనాలు లభించాయి. వాటిని భూమికి తీసుకువచ్చి తదుపరి పరిశోధనలు చేశారు. తాజా సంచలన ప్రయోగం ద్వారా రోదసీలోనే ఆహారాన్ని పండించటమే కాకుండా, వ్యోమగాములు విడుదల చేసే కార్బన్ డై అక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్ ను విడుదల చేయటానికి కూడా అవకాశం >>2

# అమరావతిలో భూగర్భ విద్యుత్ లైన్లు

### తాళ్లాయిపాలెం సబ్ స్టేషన్ నుంచి భారీ డక్ట్ ఏర్పాటు

### తుది దశలో టవర్ల నిర్మాణం

**విజయవాడ.ఆగస్టు9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపి రాజధాని అమరావతి ప్రాంతంలో భవిష్యత్తులో విద్యుత్ సరఫరా మొత్తం భూగర్భం ద్వారా జరిగేలా అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందుకు భారీ డక్ట్‌లు నిర్మిస్తున్నారు. రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ విద్యా సంస్థలు, కీలక భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాటన్నింటికీ విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా భూగర్భం ద్వారా విద్యుత్ లైన్లు మొత్తం వెళ్లేలా డిజైన్లు రూపొందించారు. అందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టారు.తాళ్లాయిపాలెం సబ్‌స్టేషన్ నుంచి భారీ డక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు 220 కేవీ విద్యుత్ సరఫరాకు వీలుగా సుమారు 24 లైన్లు వెళ్లే అవకాశముంది. 55 కి.మీ.మేర భూగర్భం నుంచే విద్యుత్ >>2



# డిఎస్సీ అక్రమాల్లో నిజమెంత?

### • నిరసన కార్యక్రమాల్లో కనిపించని నిరుద్యోగులు • ఆరోపణలు, కోర్టు కేసులు, ప్రభుత్వ వివరణల మధ్య కొనసాగుతున్న వివాదం • స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లపై హైకోర్టు విచారణకు ఆదేశం • పేపర్ లీక్ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం

**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, ఆగస్టు 9:** ఆంధ్రప్రదేశ్‌లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డిఎస్సీ-2025 నియామక ప్రక్రియపై వివాదంకొనసాగుతోంది. డిఎస్సీ నియామకాల్లో అక్రమాలు, మెరిట్ జాబితాలో అవకతవకలు, రిజర్వేషన్ అమలులో లోపాలు, స్పోర్ట్స్ కోటాకింద నకిలీ ధ్రువపత్రాల వినియోగం, ప్రశ్నపత్రం లీక్‌వంటి పలుఆరోపణలు రాజకీయంగానూ, న్యాయపరంగానూ చర్చకు వచ్చాయి. అయితే వీటిలో ప్రతి ఆరోపణ నిజమని ఇప్పటివరకు న్యాయస్థానం తుది నిర్ధారణ చేయలేదు. అదే సమయంలో వివాదాలకు సంబంధించి పలు కేసులు కోర్టుల ముందుకు వెళ్లడం మాత్రం వాస్తవం.

**335కు పైగా పిటిషన్లు.. అభ్యర్థుల అసంతృప్తి**

మెగా డిఎస్సీ నియామకాలకు సంబంధించి వివిధ అంశాలపై అభ్యర్థులు పెద్ద సంఖ్యలో న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఇటీవల హైకోర్టు విచారణలో 335 పిటిషన్లు దాఖలైనట్లు ప్రస్తావన వచ్చింది. వ్యక్తిగతంగా నష్టపోయామని భావిస్తున్న అభ్యర్థులు నేరుగా న్యాయపరమైన పరిష్కారం కోరుతున్న నేపథ్యంలో, మొత్తం డిఎస్సీ ప్రక్రియను ఒకే మాటతో అక్రమమనితేల్చడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డిఎస్సీలో కొంతమంది అభ్యర్థులు తమకు ఎక్కువ >>2

## పిడుగుపాటు: ఇద్దరు మహిళా కూలీలు మృతి

### మరో నలుగురికి తీవ్ర గాయాలు

**కాశీబుగ్గ (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 9 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా మందస మండలం బుడార్సింగి గ్రామ పంచాయితీ పాత కోట పెడంగో గిరిజన గ్రామాలకు చెందిన కె.సోముద్రి, సవర జోరలపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనలో మరో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలు పాలైన గిరిజన మహిళల్లో మజ్జి దేవకి, బుయా పోరోమి, కుమారో నీలా, కట్టువ సుస్మితలను చికిత్సకై 108 వాహనంలో హరిపురం ప్రభుత్వ సామా >>2



ఆదివారం భోపాల్‌లో తిరంగా యాత్రలో పాల్గొన్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్

# 'త్రివర్ణ పతాకం మన గర్వకారణం'

## 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో, ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం నాడు పౌరులకు ఒక పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకాన్ని 'గర్వకారణం', 'స్ఫూర్తిదాయకం'గా అభివర్ణిస్తూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ యేడాది ఈ కార్యక్రమాన్ని 'వందేమాతరం' ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'మన త్రివర్ణ పతాకం మన గర్వకారణం, అలాగే దేశం కోసం ఎల్లప్పుడూ మన అత్యుత్తమ సేవలను అందించేలా ప్రేరేపించే నిరంతర శక్తి వనరు' అని ఆయన పేర్కొన్నారు. జాతీయ గీతం 'వందేమాతరం' స్ఫూర్తితో ఈ కార్యక్రమం జరుగుతున్నందున, 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొందాం. అలాగే 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) నిర్మాణంలో మనవంతు కృషి చేసేందుకు సామూహిక సంకల్పాన్ని పునరుద్ధరించుకుందాం' అని ఆయన అన్నారు. "ఈ ఏడాది కార్యక్రమాలు 'వందేమాతరం'కు అంకితం కావడం, పైగా ఆ గీతం 150వ వార్షికోత్సవ వేళ ఇలా జరగడం సంతోషకరం' అని ప్రధాని పేర్కొన్నారు.



ఆదివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వారితో కలిసి డప్పు వాయిస్తున్న సిఎం చంద్రబాబు

# డా.ప్రియాంక మరణం బాధించింది: డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,ఆగస్టు 9.ప్రభాతవార్తప్రతినిధి:** రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో యువకులు కారును నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన పీజీ వైద్య విద్యార్థిని డా.ప్రియాంక మృతి కలచివేసిందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు డసిఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది. భవిష్యత్తులో వైద్యురాలిగా ఎంతో మందికి సేవలు అందించాల్సిన ఆమె ఇలా అర్థాంతరంగా కన్నుమూయడం బాధాకరం. నిర్లక్ష్యంగా కారు నడిపి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులకు కఠిన శిక్షలు పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. డా.ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

# మహిళా కూలీలు మృతి

>> జిక ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన ఇద్దరు గిరిజన మహిళల కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు. ఈ సంఘటన ఈ రెండు గ్రామాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. ఈ గిరిజన మహిళాకూలీలంతా పొలంలో వరినారు ఊడుపులుకోసం వెళ్లారు. పొలంలో పూర్పులు చేస్తుండగా హఠాత్తుగా పిడుగు పడి ఇద్దరు గిరిజన మహిళ కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచిపెట్టగా మిగతా నలుగురు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నారు.

# మెడికో ప్రియాంక

>> వైద్యులు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు.

ప్రసాదిత్య మాల్ వద్ద మద్యం మత్తులో ఇద్దరు యువకులు స్కూటీని వెనకరించి రెండుసార్లు ఢీ కొట్టి మరల మూడోసారి కూడా ఢీకొట్టడంతో కిందపడ్డ ప్రియాంక తీవ్రంగా గాయపడింది. ప్రియాంక స్నేహితుడు ఉమేష్‌తో కలిసి స్కూటీపై వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. ప్రియాంక జిఎస్ఎల్ మెడికల్ కళాశాలలో డెర్మటాలజీలో పీజీ ఫస్ట్ ఇయర్ చదువుతుంది.

ప్రియాంక సొంత ఊరు కర్నూలు కాగా ప్రస్తుతం కుటుంబ సభ్యులు హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. ముద్దాయిలు సూరవరపు దస్వంత్, ఆంద్రు జోసఫ్ ఎడ్వర్డ్స్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. ఈనెల ఆరవ తేదీన ఈ ఇద్దరినీ అరెస్ట్ చేసి ఏడవ తేదీన రాజమండ్రి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

**ప్రియాంకకు న్యాయం చేయాలని నిరసనలు:**

వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలని కోరుతూ రాజమహేంద్రవరంలో విద్యార్థులు నిరసన ర్యాలీలు చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రియాంకకు న్యాయం జరిగే విధంగా అండగా నిలబడతానని చెప్పారు. సోమవారం ప్రియాంక మృతి సంతాపంగా విద్యాసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ప్రియాంకకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు.

**'మెడికో ప్రియాంకపై హత్యాయత్నం..'**

మరింత లోతుగా విచారణకు కస్టడీ కి పిటీషన్: ఎస్పీ నరసింహ కిషోర్..

వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక కేసులో ముద్దాయిలపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రాజమండ్రిలో ప్రియాంక కేసుపై ఎస్పీ డి నరసింహ కిశోర్ మాట్లాడుతూ కావాలనే ఆమెను కారుతో ఢీకొట్టినట్లు వీడియోలు చూస్తే అర్థమవుతుందని నిందితులపై కఠిన సెక్షన్ల కింద కేసు పెట్టాం అని వెల్లడించారు.

అలాగే డాక్టర్ ప్రియాంక కేసులో ముద్దాయిలను కోర్టు అనుమతితో కస్టడికి తీసుకుని మరింత లోతుగా విచారిస్తామని ఎస్పీ నరసింహ కిషోర్ చెప్పారు. ముద్దాయిలు వెనక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో కూడా విచారిస్తున్నామని ఈ కేసులో ఎవరు ప్రమేయం ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముద్దాయిలు ప్రియాంకను ఉద్దేశం పూర్వకంగా చేసారా అని మరింత లోతుగా విచారణ చేయడం జరుగుతుందన్నారు.

యాక్సిడెంట్ జరిగిందని ఎస్ఐకి సమాచారం రావడంతో ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ సిఐ ఎస్ఐ సిబ్బంది వెంటనే ఘటన ప్రాంతానికి వెళ్లడం జరిగిందని అక్కడ యాక్సిడెంట్ అయిన ప్రియాంకను ఒక వ్యక్తి కారులో జిఎస్ఎల్ స్వతంత్ర హాస్పిటల్ కి తీసుకెళ్లారు. మాల్ వద్ద సిసి పుటేజీలు పరిశీలించి కార్ నెంబర్ను ఐడెంటిఫై చేశారని వెంటనే పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేసి ముద్దాయిలను కారు గురించి వెతకడం మొదలుపెట్టారు. నాలుగో తేదీన ప్రియాంక స్నేహితులు ఉమేష్ ఎంఎల్ సి స్టేట్మెంట్ ప్రకారం బి.ఎన్.ఎస్ గా వెంటనే కేసు నమోదు చేయడం జరిగింది. అదే రోజు ప్రత్యక్ష సాక్షులను స్థానికులను విచారించి బి ఎన్ ఎస్ సెక్షన్ నుండి 110 గా అటెంప్ట్ టు కమిట్ కల్పిబుల్ హోమీసైడ్ గా కేసు నమోదు చేయడం జరిగింది అన్నారు.

ఈనెల ఆరవ తేదీన బి ఎన్ ఎస్ కేసులో ముద్దాయిలు ఏ 1 సూరవరపు దస్వంత్, ఏ2 ఆంద్రు జోసఫ్ ఎడ్వర్డ్స్ లను అరెస్టు చేసినట్లు వివరించారు. ఇద్దరు ముద్దాయిలను ఏడవ తేదీన రాజమండ్రి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించడం జరిగిందని అనంతరం వారిని సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. దస్వంత్ చెన్నైలో బీటెక్ పూర్తి చేసి ఎంఎస్ వెళ్లడానికి ప్రిపేర్ అవుతున్నాడని ఆంద్రు జోసెఫ్ ఎడ్వర్డ్స్ లాలాచెరువులోని లారీ ఆఫీస్‌లో పనిచేస్తున్నాడని తెలిపారు.

# ఇక అంతరిక్షంలో వ్యవసాయం!

>> దొరికింది. నీటి వ్యవస్థ సహజ సిద్ధంగా శుద్ధి చేయటం కూడా సాధ్యమవుతుంది. అంతరిక్షంలో క్లోజ్డ్ లూప్ ఎకో సిస్టమ్ రూపుదిద్దుకోవడానికి ఇది ప్రాథమిక అడుగుగా భావిస్తున్నారు. భవిష్యత్తులో మార్స్, చంద్రుడిపై కాలనీలు నిర్మించే క్రమంలో భూమి నుంచి ప్రతీసారి ఆహారాన్ని మోసుకెళ్లే అవసరం లేకుండా, అక్కడే స్వయం పంటలు పండించేందుకు ఇక మీదట 100 శాతం సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతేకాదు.. ఈ అంతరిక్ష వరి విత్తనాల్లోని జన్యుపరమైన మార్పులను అధ్యయనం చేయడం ద్వారా భూమిపై తీవ్ర ప్రతికూల వాతావరణ మార్పులను ఎదుర్కొనే నూతన వరి రకాలను అభివృద్ధి చేయడానికి కూడా ఈ పరిశోధన దోహదపడుతుందని చెబుతున్నారు.

# డిఎస్సీ అక్రమాల్లో నిజమెంత?

>> మార్కులు వచ్చినప్పటికీ తక్కువ మార్కులు సాధించిన వారికి అవకాశం లభించిందని, ప్రాధాన్యతలు, రిజర్వేషన్ అమలుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం మాత్రం మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని, నిబంధనల ప్రకారం రిజర్వేషన్ల అమలును సమర్థిస్తోంది. హైకోర్టులో దాఖలైన కేసుల్లో కూడా అభ్యర్థుల ఎంపిక, నియామకం, రోస్టర్, ప్రాధాన్యతల అమలుకు సంబంధించిన ప్రశ్నలు పరిశీలనకు వచ్చాయి. కోర్టు ఇప్పటికే వ్యక్తిగత అభ్యంతరాలను పరిశీలించేందుకు గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేయడం వంటి చర్యలకు ఆదేశాలు ఇచ్చింది.

**కీలకంగా మారిన స్పోర్ట్స్ కోటా**

డిఎస్సీ వివాదంలో ప్రస్తుతం అత్యంత కీలకంగామారిన అంశాల్లో స్పోర్ట్స్ కోటాఒకటి. మెగా డిఎస్సీ- 2025లో మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్స్‌కోసం 3 శాతం హారిజాంటల్ రిజర్వేషన్ కింద 421 ఉపాధ్యాయ పోస్టులకు ప్రత్యేక ప్రక్రియ చేపట్టారు. ఈ కోటాలో నకిలీ లేదా అనుమానాస్పద క్రీడా ధ్రువపత్రాలను ఉపయోగించి ఉద్యోగాలు లేదా ఇతర ప్రయోజనాలు పొందారనే ఆరోపణలు తెరపైకివచ్చాయి. ఈ వ్యవ హారంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జులై 2026లో విచారణకు ఆదేశిస్తూ, నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ఆరోపణలపై ప్రభుత్వం దర్యాప్తు చేసి నాలుగు నెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ముఖ్యంగా జూడో విభాగానికి సంబంధించిన సర్టిఫికెట్లపై ఆరోపణలు ప్రస్తావనకు వచ్చాయి. ఈవ్యవహారంలో హైకోర్టు దర్యా ప్తుకు ఆదేశించింది. సరిగ్గా ఇక్కడే ప్రతిపక్షమైన వైసీపీ పార్టీ ఈఅంశాన్ని తనకు అనుకూలంగా మలుచు కుంది. డిఎస్సీ నియామకాలను కోర్టు కూడా తప్పు పట్టిందని వారి శైలిలో ప్రచారం చేస్తూ నిరసన కార్యక్రమాలు ప్రారంభించారు. దీనికి కౌంటర్‌గా అన్ని ప్రాంతాలలోనూ ఎమ్మెల్యే స్థాయి నుంచి మంత్రుల వరకు కోర్టు దర్యాప్తుకి ఆదేశించడం అంటే నకిలీ సర్టిఫికెట్లు ఉపయోగించినట్లు కోర్టు నిర్ధారించినట్లు కాదని వైసిపి ఆరోపణలను తిప్పికొడుతున్నారు. అయితే ఈ ఆరోపణలు నిజమా? ఎవరు బాధ్యులు? ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశాలు విచారణ అనంతరం తేలాల్సి ఉంది.

**పేపర్ లీక్ జరిగిందా?**

ఇదిలా ఉండగా విద్యాశాఖలో ఉన్న కొందరు ఉన్నతాధికారుల ద్వారా డిఎస్సీ పరీక్షల్లో ప్రశ్నపత్రం లీక్, డేటా మానిప్యులేషన్ జరిగిందని ప్రతిపక్షాలు, కొందరు అభ్యర్థులు ఆరోపించారు. కొందరు దీనిపై సిబిఐ విచారణకు కూడా డిమాండ్ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో, భద్రతా ప్రమాణాలతో నిర్వహించామని, ప్రశ్నపత్రం లీక్ లేదా డేటా మానిప్యులేషన్‌కు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈక్రమంలో పేపర్ లీక్ ఆరోపణ గానే మిగిలిపోయింది. దానికి సంబంధించి ఆధారాలు కోసం దర్యాప్తు కొనసాగుతోంది. రాష్ట్రమంతా వైసిపి నేతలు డిఎస్సీ అక్రమాలు అంటూ నిరసన కార్యక్రమాలు జోరుగా సాగుతున్న సమయంలో మరి అసలు నిజం ఏమిటనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. పేపర్ లీక్, పోస్టుల అమ్మకం, డేటా మానిప్యులేషన్ వంటి తీవ్రమైన ఆరోపణలు ప్రస్తుతం రాజకీయ, ప్రజా చర్చలో ఉన్నాయి. కానీ ఇవి న్యాయపరంగా తుది నిర్ధారణ కాలేదు. అయితే కొన్నిచోట్ల మెరిట్, రోస్టర్, రిజర్వేషన్, పోస్టుల కేటాయింపు, అభ్యర్థుల అర్హత వంటి అంశాలపై వాస్తవంగా కోర్టు కేసులుఉన్నాయి. ఏదిఏమైనా లక్షలాది మంది నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్న ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో చిన్న అనుమానం కూడా అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. అందువల్ల డిఎస్సీ మొత్తం అక్రమమని ముందుగానే తీర్పు ఇవ్వడం ఎంత తప్పో.. ఎలాంటి అక్రమాలు జరగలేదని దర్యాప్తు పూర్తికాకముందే క్లీన్‌చిట్ ఇవ్వడం కూడా అంతే తప్పు అనే భావన ఉపాధ్యాయ విద్యార్థుల వర్గాల్లో ఉంది. డిఎస్సీ అక్రమాలు అంటూ వైసీపీ మాత్రమే నిరసనలు చేస్తుంది కానీ వామపక్షాలు తగినంత మద్దతు ఇవ్వలేదని వాస్తవాన్ని ఒప్పుకుని తీరాలి.

# అమరావతిలో భూగర్భ విద్యుత్ లైన్లు

>> తీగలు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా కోసం వినియోగిస్తున్న లైన్లు, స్తంభాలు, తీగలను దశల వారీగా తొలగిస్తారు. రాజధాని ప్రాంతం మొత్తానికి 33 కేవీ/415 వోల్టుల లైన్లు ఏర్పాటు చేయనున్నారు. తుళ్లూరు, తాడేపల్లి, లింగాయపాలెం, నేలపాడు ప్రాంతాల్లో 220 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్లతో (జీఐఎస్) విద్యుత్ నెట్‌వర్క్‌ను అనుసంధానించనున్నారు. ఇప్పటికే నేలపాడు, లింగాయపాలెం వద్ద సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తాడేపల్లిలోని 132 కేవీ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. తర్వాతి దశలో తుళ్లూరు సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభించనున్నారు. ఇవన్నీ అందుబాటులోకి వస్తే సుమారు 500 మెగావాట్ల విద్యుత్ సరఫరా సామర్థ్యం ఉన్న నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తుంది. 400 కేవీ విటిపిఎస్‌సత్తెనపల్లి, పిజీసీఐఎల్‌నున్న నెల్లూరు మధ్య లైన్ల రీ రూటింగ్ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. రాజధానిలో నిర్మాణాలకు అడ్డుగా ఉన్న ట్రాన్స్‌కో, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌కు చెందిన లైన్లను కలిపి ఒకే టవర్ నుంచి తీసుకెళ్లేలా డిజైన్ చేశారు. ప్రస్తుతం టవర్ల నిర్మాణం చివరి అంకానికి చేరుకుంది. దీంతో రాజధాని ప్రాంతంలో భవిష్యత్తులో రోడ్లకు అడ్డంగా విద్యుత్ తీగలు వెళ్లే అవకాశం ఉండదు.

# సుప్రీం సిజెఐ రావొద్దు..

## హైదరాబాద్ 'నల్సార్' విద్యార్థుల నిరసన

### 450 మంది సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు9:** హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సిజెఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సిజెఐ, 'వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు, మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సిజెఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సిజెఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్ఎస్)లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదావేశారు. ఇప్పుడు నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

### సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పార్థసారథి

**ఏలూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 10న సోమవారం కలిదిండి మండలంలో నిర్వహించనున్న 'మీ భూమి - మీ హక్కు' పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి సిఎం చంద్రబాబు హాజరుకానున్నారు. ఈనేపథ్యంలో సిఎంఏర్పాట్లనుమంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. హెలిప్యాడ్, ప్రజావేదిక, క్యాడర్ సమావేశం, ట్రాన్స్‌పోర్ట్, భోజనాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గారు, ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, ముఖ్యమంత్రి కార్యక్రమం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొత్త నాగబాబు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### వారం - వర్జ్యం

10-08-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.ద్వాదశి రా.8.01, తి.త్రయోదశి తె.4.54
న.ఆరుద్ర మ.12.27,
వ.రా.11.18-రా.12.45
దు.1. మ.12.38-మ.1.29
దు.2. మ.3.11-సా.4.02
రాహు.ఉ.7.30-ఉ.9.00 శుభ లేదు.

### వార్తాఫలం

**మేషం :** స్థిరాస్తులను కొనుగోలు చేసే ఆలోచనలు ఫలిస్తాయి. వచ్చిన ధనమును పొదుపు చేయుటకు ప్రయత్నిస్తారు.

**వృషభం :** ఖర్చులను తగ్గించు విషయములో పూర్తిగా వైఫల్యమును పొందుతారు. సోదరి కలయిక. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**మిథునం :** కొన్ని దుబారా ఖర్చులు రహస్య ఋణములు, దానములు తప్పవు. విలువైన సమాచారం వింటారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**కర్కాటకం :** కరస్పాండెన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమములు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మందుల వ్యాపారము అనుకూలం.

**సింహం :** ఆర్థికపరమైన అంశాలు కొంత మేర ఆశాజనకంగా ఉంటాయి. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**కన్య :** మీకు న్యాయం చేయవలసిన వాళ్ళు సంపూర్ణంగా న్యాయం చేయరు. వృత్తిలో అనుకోని మార్పులు వుంటాయి.

**తుల :** కోర్ట్ సంబంధించిన భూవివాదాలు, స్థిరాస్తులకు సంబంధించిన వివాదాలు ఒక పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృశ్చికం :** కళా, సాంస్కృతిక, ఉద్యోగ రంగాలలోని వారికి పోటీ ఎదురవుతుంది. కళాత్మక వస్తువులను కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు :** ఒకరి జీవితానికి ఆధారం కల్పించి మనశ్శాంతి పొందుతారు. ఆరోగ్య పరంగా జాగ్రత్తలు పాటించాలి.

**మకరం :** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైల్ మీద అధికార ఆమోద ముద్రలు పడుతాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

**కుంభం :** వస్తు భద్రతకు ప్రాముఖ్యం ఇస్తారు. ఇతర భాష పట్ల విదేశాల పట్ల ఆకర్షణ కలుగుతుంది. వస్త్ర లాభం.

**మీనం :** వృత్తి విషయములో కొంత ఓర్పును పాటించుట అవసరం. కార్యాచరణ కోసం యోచన చేస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

>> నట్టే. సమాజానికి ఏమిచ్చాం, దేశానికి ఏం చేశాం అన్నదే లక్ష్యంగా పనిచేయాలి. ఒకరు ప్రకృతి కోసం, మరొకరు పర్యావరణం కోసం, ఇంకోకరు నీటి సంరక్షణ కోసం పనిచేయాలి. రాష్ట్రానికి, దేశానికి విజన్ ఉన్నట్టే వ్యక్తిగతం గానూ ప్రతి ఒక్కరికీ ఓ విజన్ ఉండాలి. వికసిత్ భారత్ విజన్‌ను ప్రధాని మోడీ చేస్తే, నేను 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన చేశాను. జాతీయ జెండా స్ఫూర్తితో కలసికట్టుగా ముందుకు అడుగేద్దాం. వ్యక్తిగతంగా విజయం సాధించటమూ నేషన్ బిల్డింగ్‌లో భాగమే. పనిచేసే ప్రతీ వ్యక్తీ సమాజానికి ఆస్తి. సమాజం కోసం పనిచేయటమే గొప్ప దేశభక్తి, అందరి గెలుపే దేశం గెలుపు' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**అరకు కాఫీని గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తాం**

"భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిరిజన బిడ్డలు ధింసా నృత్యం ఇప్పుడు గిన్నీస్ బుక్ రికార్డు సాధించింది. ఈ రికార్డు సాధించి మన సంస్కృతీ సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. పోడు వ్యవసాయం కాదు ఆర్గానిక్ వ్యవసాయంతో గిరిజనులు విలువైన పంటల్ని ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంలోని 27.39 లక్షల మంది గిరిజనుల సమగ్రాభివృద్ధికి రూ.4764 కోట్లను కేటాయించాం. ఐటిడిఎలతో గిరిజన అభివృద్ధి కోసం జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రత్యేకంగా దృష్టి సారించాం. మౌలిక వసతుల కల్పన, ఉపాధి, ఉద్యోగాలు, నైపుణ్య కల్పనపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాం. 2336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్డు కనెక్టివిటీ కల్పిస్తున్నాం. 2027 నాటికి ప్రతీ గిరిజన కుటుంబానికీ సురక్షితమైన తాగునీరు, ఆవాసం కల్పిస్తాం, సోలార్ రూఫ్ టాప్ కూడా ఏర్పాటు చేస్తాం. అడవి తల్లి బాట పేరుతో వెయ్యి కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు వేశాం. డోలీ మోతలు లేకుండా ఫీడర్ అంబులెన్సులు, 108,104 మొబైల్ మెడికల్ యూనిట్లు ఏర్పాటు చేశాం. అలాగే డిజిటల్ కనెక్టివిటీ కోసం సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. 25 యేళ్ల క్రితమే అరకు కాఫీకి నాంది పలికాం, ఇప్పుడు ప్రపంచ బ్రాండ్‌గా అరకు కాఫీ ఎదిగింది. మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. కాఫీ, మిరియాలు, పసుపు లాంటి వాణిజ్య పంటలకు బ్రాండ్‌గా ఏజెన్సీ ప్రాంతం మారాలి. ప్రధాని మోడీ కూడా ఆస్ట్రేలియా ప్రధానికి అరకు కాఫీనే బహుమతిగా ఇచ్చి ప్రమోట్ చేస్తున్నారు. రాష్ట్రానికి వచ్చిన ప్రతీ అతిథికి అరకు కాఫీని బహుమతిగా ఇస్తూ ప్రోత్సాహం కల్పిస్తున్నాం పార్లమెంటులోనూ అరకు కాఫీ స్టాల్‌ఏర్పాటు చేయించాం. బెస్ట్ గ్లోబల్ బ్రాండ్‌గా దీనిని మారుస్తాం. గిరిజనప్రాంతాల్లోని అటవీ ఉత్పత్తులకు విలువజోడించటం ద్వారా మంచిమార్కెటింగ్ కల్పిస్తాం. సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనా పిల్, తేనె, తాటి బెల్లం ఇలా ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్, బ్రాండింగ్ వరకూ ప్రభుత్వం అండగా ఉంటుంది' అని ముఖ్యమంత్రి వివరించారు.

**ఆదివాసీల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ**

"రహదారులు, సురక్షితమైన తాగునీరు లాంటి మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఆదాయ వనరుల పెంపు, నైపుణ్య శిక్షణ లాంటి ఐదు అంశాల్లో ఆదివాసీల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఒక్క ఆదివాసీల కోసమే 3 ప్రత్యేక జిల్లాలు ఏర్పాటు చేసి వారికి ప్రాధాన్యత కల్పించాం. ఎటు చూసినా పచ్చదనం కలిగిన ఈ ప్రాంతాల్లో పర్యాటకాన్ని కూడా గణనీయంగా ప్రోత్సహిస్తాం. నేడు చేసుకున్న 19 ఎంఓయుల ద్వారా 60 వేల మందికి లబ్ది కలుగుతుంది. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా 1.5 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందిస్తాం. ఐఐటి, నీట్ లాంటి పోటీ పరీక్షలకు కూడా వారిని సిద్ధం చేసి అందరితో పోటీ పడేలా ప్రోత్సహిస్తాం. జిఒ నెంబరు 3 ద్వారా గిరిజన ప్రాంతాల్లో స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా చేశాం. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ జీవోను కొట్టివేశారు. ప్రత్యామ్నాయం గురించి ఆలోచన చేస్తున్నాం. ఆదివాసీల హక్కులు కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. నాణ్యమైన వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో పార్వతీపురం, సీతంపేట, రంపచోడవరం, చింతూరు, కేఆర్ పురం, శ్రీశైలం లాంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మాణం పూర్తి చేస్తాం' అని సిఎం చంద్రబాబు వివరించారు.

**స్వర్ణాంధ్ర కోసం కలిసి పని చేద్దాం**

"2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధన కోసం మనం అంతా పనిచేయాలి. ఆర్థిక అసమానతలు తగ్గి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా ప్రణాళికలు చేశాం. సూపర్ సిక్స్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. పి4తో పాటు వివిధ కార్యక్రమాల ద్వారా పేదల్ని ఆదుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాం. చంద్రబాబు అనే నేను ప్రజల జీవితాలను మార్చి, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తే లక్ష్యం నెరవేరినట్టే. దేశం, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతీ పౌరుడూ భాగస్వామి కావాలి. విద్యార్థులకు ఇది అలవాటు చేసేలా ఓ మొక్కను నాటి సంరక్షించేలా గ్రీన్ పాస్‌పోర్టు కార్యక్రమం తెచ్చాం. మన పర్యావరణం కోసం మొక్కలు నాటటంతో పాటు వాటిని సంరక్షించటం కూడా మన బాధ్యత. 80 స్వతంత్ర దినోత్సవంలోగా ప్రతీ పౌరుడూ ఓ సంకల్పం తీసుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నా. వచ్చే 21 యేళ్లలో దేశం, రాష్ట్రం అభివృద్ధికి చిరునామాగా మారతాయి' అని పిఎం అన్నారు. అనంతరం అంబేద్కర్ కళావేదికవద్ద ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల స్టాళ్లను సిఎం పరిశీలించారు. పాడేరు, రంపచోడవరం, నల్లమల, అరకు, చింతపల్లి, పార్వతీపురం మన్యం తదితర ప్రాంతాల నుంచి ఉత్పత్తులు తయారు చేసి ప్రదర్శించిన గిరిజన మహిళల్ని సిఎం అభినందించారు. గిరిజన ప్రాంతాల్లో తయారు చేస్తున్న ఉత్పత్తులకు బ్రాండ్ రూపొందించి మార్కెటింగ్ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడిసంధ్యారాణి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# భారత్ చట్టాలను పాటించాల్సిందే

>> అధికార వర్గాల ప్రకారం, ప్రభుత్వం లేవనెత్తిన ప్రధాన ఆందోళనలలో ఒకటి, దేశం వెలుపల ఉన్న బృందాలకు భారతదేశ సాంస్కృతిక, భాషా వైవిధ్యంపై పరిమిత అవగాహన ఉండటం. కంటెంట్ నియంత్రణ నిర్ణయాల సామర్థ్యాన్ని, కచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి, భారతీయ భాషలు, సాంస్కృతికసూ నైపుణ్యాలపై మెరుగైన అవగాహనతో సహా, మెటాకు బలమైన స్థానిక నైపుణ్యం అవసరమని అధికారులు తెలిపారు.

డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై బాలల లైంగిక వేధింపుల కంటెంట్ (సిఎస్ఎఎం)ను ఏమాత్రం సహించబోమని ప్రభుత్వం పునరుద్ఘాటిస్తూ, దానిపై కూడా గట్టి వైఖరిని అవలంబించింది. సిఎస్ఎఎం ఉనికి అనేది వర్తించే నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని, అటువంటి కంటెంట్‌ను గుర్తించి తొలగించడానికి మెటా మరింత పటిష్టమైన, చురుకైన భద్రతా చర్యలను అమలు చేస్తుందని భావిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో కేవలం హామీలు కాకుండా, కచ్చితమైన చర్యలు అవసరమవుతాయని అధికారులు స్పష్టం చేశారు. చర్చలలో డీప్‌ఫేక్‌కంటెంట్ కూడా ప్రముఖంగా ప్రస్తావనకువచ్చింది. అధీకృత లేదా ధ్రువీకరించబడిన ఖాతాల నుండి ప్రచురించబడిన కంటెంట్‌ను ఆటోమేటెడ్ సిస్టమ్‌ల ద్వారా తప్పుగా డీప్‌ఫేక్‌లుగా వర్గీకరించకూడదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇలాంటి కేసుల సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, కంటెంట్‌ను తొలగించే నిర్ణయం తీసుకునే ముందు దానిని సరిగ్గా పరిశీలించేలా చూసేందుకు "మానవ ప్రమేయం'తో కూడిన సమీక్షా ప్రక్రియను అధికారులు సమర్థించారు. డీప్‌ఫేక్‌గా గుర్తించి, తొలగించిన తర్వాత కూడా ప్లాట్‌ఫారమ్‌పై తిరిగి కనిపించే కృత్రిమంగా రూపొందించిన కంటెంట్ గురించి కూడా ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. తొలగించిన తర్వాత అటువంటి కంటెంట్ పునరావృతం కాకుండా, పునఃపంపిణీ కాకుండా నిరోధించడానికి తీసుకుంటున్న చర్యలను వివరించాలని కోరినట్లు వర్గాలు తెలిపాయి.

# మెడికో ప్రియాంక మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు

## బాధిత కుటుంబానికి రూ. 20 లక్షల ఆర్థిక సాయం

### జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడిన సిఎం

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజమండ్రిలో ఈ నెల 3వ తేదీన యువకులు కారుతో ఢీ కొట్టిన ఘటనలో మెడికో ప్రియాంక ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నాటి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి చెందిందనే వార్త తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న ఒక వైద్య విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రియాంక ప్రాణాలు కోల్పోయిన ఘటనపై జిల్లా అధికారులతో గతంలోనే ఓసారి జిల్లా అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి, ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మరోసారి సిఎం చంద్రబాబు మాట్లాడారు. ప్రియాంక మృతికి కారణమైన నిందితులు ఇప్పటికే అరెస్టై జైల్లో ఉన్నారని ఎస్పీ వివరించగా, నిర్లక్ష్యంతో నిండు ప్రాణం తీసిన వారిపై కఠిన సెక్షన్లతో శిక్షలు పడేలా చూడాలని సిఎం ఆదేశించారు. ప్రియాంకకు ప్రమాదం జరిగిన అనంతరం రాజమండ్రిలో చికిత్స అందించడం, తరువాత కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించిన విషయాన్ని అధికారులు వివరించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించాలని సిఎం అధికారులను ఆదేశించారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు సిఎం శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన సోదర సోదరీమణులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అడవితో, ప్రకృతితో ముడిపడి ఉన్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, వారి విశిష్టమైన జీవన విధానం మన సమాజానికి ఎంతో గర్వకారణమన్నారు. అందుకే ఆదివాసీల విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలు మెరుగుపరిచి వారి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తూ, వారి స్వయం సమృద్ధి, ప్రగతే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందన్నారు.

### గిరిజనుల సంస్కృతిని అందరూ గౌరవించాలి: పవన్ కల్యాణ్

అంతర్జాతీయ గిరిజన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గిరిజనులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. తరతరాలుగా అడవులను ఆవాసంగా చేసుకుని, వాటిని కాపాడుతున్న గిరిజనుల సంస్కృతిని అందరూ గౌరవించాలని కోరారు. ముఖ్యంగా సమాజ సంక్షేమంలో, సంప్రదాయ వైద్యంలో గిరిజన మహిళల సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ గిరిజన దినోత్సవ ఇతివృత్తం ప్రాచీన వైద్య విధానాలు, సంప్రదాయ జ్ఞానం కలిగిన గిరిజన మహిళల ప్రాముఖ్యతను గుర్తుచేస్తోందన్నారు. మాతా శిశు ఆరోగ్యం, సమాజ సంక్షేమంలో గిరిజన మహిళల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. గిరిజన సమాజంతో తనకు ఉన్న బంధం చాలా ప్రత్యేకమైనదని, వారి ప్రేమ, నమ్మకమే తనను వారి సంక్షేమం వైపు మరింత బాధ్యతగా నడిపిస్తున్నాయని పవన్ కల్యాణ్ తెలిపారు. రిజనుల వికాసానికి 'అడవి తల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్డు వసతి పెంచడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించామన్నారు. గిరిజనుల ప్రత్యేక జీవన విధానం, సంస్కృతి దెబ్బతినకుండానే అభివృద్ధి ఫలాలు ప్రతి గిరిజన కుటుంబానికి అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

### ఆదివాసీల హక్కుల రక్షణ మన బాధ్యత: మంత్రి లోకేష్

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి అంటే ప్రకృతితో కలిసి జీవించే ఒక జీవన తత్వమని లోకేశ్ అన్నారు. పరస్పర సహకారం, మంచితనం, మానవత్వ రూపాలు ఆదివాసీలని లోకేష్ కొనియాడారు. ఆదివాసీల సమగ్ర అభ్యున్నతి తోపాటు వారి సంస్కృతి, హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యతన్నారు.

### నీరు, అడవి, భూమి ఆదివాసీలకు దేవాలయంతో సమానం: మంత్రి సంధ్యారాణి

భూమిపై ఆది నుంచి జీవిస్తున్నది ఆదివాసీలేనని, వారి హక్కులు, విశిష్ట సంస్కృతిని గుర్తుచేసుకునే రోజు ఆగస్టు 9 అని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆమె గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీల జీవిత సూత్రం 'జల్, జంగల్, జమీన్' అని ఆమె అభివర్ణించారు. గిరిజనులకు లబ్ధి చేకూర్చేందుకే నాడు చంద్రబాబు జిఒ 3 తీసుకువచ్చారని మంత్రి గుర్తుచేశారు. వైఎస్సార్సీపీ హయాంలో ఆ జిఒ రద్దయితే, గిరిజనుల ప్రయోజనాల కోసం కనీసం రివ్యూ పిటిషన్ కూడా వేయలేదని మండిపడ్డారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే గిరిజన యువకులను గొడ్డలి పార్టీ రెచ్చగొడుతోందని సంధ్యారాణి ధ్వజమెత్తారు. నీరు, అడవి, భూమి ఆదివాసీలకు దేవాలయంతో సమానమని, అడవిని కాపాడే ఆదివాసీల అభివృద్ధే దేశ అభివృద్ధని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. గిరిజనుల విద్య, ఉద్యోగ వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## మహేశ్ బాబుకు సిఎం, డి.సిఎం బర్త్‌డే విషెస్




**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** చలనచిత్ర కథానాయకుడు మహేశ్ బాబు 51వ పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని, ఆయన చేపట్టే అన్ని కార్యక్రమాల్లో విజయం సాధించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ ఏడాది ఆయనకు అద్భుతంగా సాగాలని కోరుకుంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. డిసిఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ అందిస్తున్న సేవా కార్యక్రమాలు, ముఖ్యంగా పిల్లలకు సహాయం చేయడం స్ఫూర్తిదాయకమని పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ ప్రశంసించింది. టాలీవుడ్ సినీ ప్రముఖుల నుంచి కూడా మహేశ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ వంటి అగ్ర తారలు ఆయనకు విషెస్ తెలియజేశారు. భారతీయ సినిమాలో అత్యంత అభిమానం పొందిన నటులలో ఒకరిగా మహేశ్ ఎదగడం గర్వంగా ఉందని చిరంజీవి అన్నారు. వెంకటేశ్ అయితే నా చిన్నోడు మహేశ అంటూ ఆప్యాయంగా సంబోధిస్తూ, రాబోయే 'వారణాసి' చిత్రంలోని 'రుద్ర' లుక్‌లో మహేశ్ అదరగొడుతున్నాడని కితాబిచ్చారు. ఈ సినిమాతో మహేశ్ వచ్చే ఏడాది ప్రపంచాన్ని ఏలడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

మహేష్ బాబుకు మంత్రి లోకేష్ బర్త్‌డే విషెస్: సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదినం సందర్భంగా మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఖీశ్రీఖీ వేదికగా స్పందించిన మంత్రి లోకేష్, 'సూపర్ స్టార్ మహేష్ బాబుకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీకు ఆనందం, మంచి ఆరోగ్యం, కొనసాగే విజయాలు ఉండాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహేష్ బాబు నవ్వుతున్న ఫోటోను కూడా లోకేష్ షేర్ చేశారు.

# గిరిజనుల ఆత్మగౌరవం, అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం

- 18గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరిచాం
- ఐటిడిఎలను బలోపేతం చేస్తున్నాం
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి



**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ డా. బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఆదివారం గిరిజన సంక్షేమశాఖ నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజనులు ఆత్మగౌరవంతో జీవించేలా వారి సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఒక పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించేందుకు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. సుమారు రెండు లక్షల మంది గిరిజన విద్యార్థులకు వసతి గృహాల ద్వారా ఉచిత విద్య అందిస్తున్నామని, మెగా డీఎస్సీ ద్వారా పెద్ద సంఖ్యలో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని చెప్పారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 18 గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి ఐటిడిఎలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో భారీగా నిధులు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. డోలీ మోతల సమస్యను నివారించేందుకు రహదారులు, ఫీడర్ అంబులెన్సులు, గర్భిణుల వసతి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు గిరిజనుల సంస్కృతి, కళలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు రావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతో ఉందన్నారు.

గిరిజన కళ అయిన థింసా నృత్యానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు ద్వారా అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే నిజమైన 'స్వర్ణాంధ్ర' సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

విజయవాడ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులకు గురుకులాలు, నాణ్యమైన భోజనం, నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఐఏఎస్, గ్రూప్1, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ, వైద్య సదుపాయాలు, మొబైల్ ఆస్పత్రులు, టూవీలర్ అంబులెన్సులు, ఉచిత రేషన్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. భవిష్యత్తులో లక్ష ఎకరాల్లో కాఫీ సాగును విస్తరించి గిరిజనుల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ, గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలను మెరుగుపరిచినట్లు తెలిపారు. గిరిజన యువత ఉద్యోగ అవకాశాలకు సంబంధించి ప్రభుత్వం న్యాయ నిపుణులతో చర్చించి చట్టబద్ధమైన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ, గిరిజన విద్య కోసం రూ.1,353 కోట్లు కేటాయించి 1.63 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. డీఎస్సీ ద్వారా 1,916 మంది కొత్త ఉపాధ్యాయులను నియమించి గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామన్నారు. గిరిజన యువతకు ఉచిత సివిల్స్ కోచింగ్, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని, రాబోయే ఐదేళ్లలో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు విస్తరణతో పాటు పసుపు, రబ్బర్ హబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర ప్రజా ప్రతినిధులు కలిసి అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గిరిజనుల అభివృద్ధికి, గిరిజన ప్రాంతాల్లో చేపట్టే పలు అభివృద్ధి పనులకు అనేక కార్యక్రమాలు నిర్వహించేలా పలు ఒప్పందాలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో కుదుర్చుకున్నారు. కాఫీ పంటను పండిస్తున్న గిరిజన రైతు కొర్రా రాంబాబు, డ్వాక్రా గిరిజన మహిళ రావూరి గాయత్రి ముఖ్యమంత్రి సమక్షంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్, ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్ల సునీత, జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీ శ, గిరిజన నాయకులు ఇద్దేశ్రీ, ధన్ను దొర, దారా నాయక్, శ్రీనివాసరెడ్డి, మోజోరి తేజావతి, గంగులయ్య, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

## 163 ఎకరాలలో గిరిజనులకు పట్టాలు పంపిణీ

- గిరిజన ఆశ్రమ పాఠశాలలో 94శాతం ఉత్తీర్ణత
- శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్
- గిరిజన గ్రామాలను అభివృద్ధి చేశాం: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలు



**కాశీబుగ్గ (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 9 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తుందని, 163 ఎకరాలలో గిరిజనులకు పట్టాలు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కాశీబుగ్గ రైల్వే గ్రౌండ్‌లో ఆదివారం ఐటిడిఏ సీతంపేట ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ప్రకృతి వనరులను పర్యాటకంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 20 మండలాలు ఐటిడిఏ పరిధిలో ఉండగా 291 గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రూ. 179 కోట్లు వ్యయంతో 249 గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఐటిడిఏ పరిధిలో 268 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, సుమారు 20 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, ఇటీవల పరీక్షా ఫలితాల్లో ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలు 94.77 శాతం ఉత్తీర్ణత సాధించారని ఇది గొప్ప విషయమన్నారు. అటవీ హక్కుల చట్టం కింద సుమారు 163 ఎకరాల భూమిని గిరిజనులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారన్నారు. గిరిజన హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. టెక్కలి జిల్లా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. యువతను అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు విఠల్ రావు, సీతంపేట ఐటిడిఏ ఎపిఓ చిన్నబాబు, పలాస ఆర్‌డిఓ ఆర్. అప్పలరాజు, డిఆర్‌డిఏ సంచాలకులు ఎన్. కిరణ్‌కుమార్, డిడి. అన్నా దొర, డిప్యూటీ విద్యాశాఖాధికారి పి. నాయుడు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అమెరికాలో మంత్రి లోకేష్.. ఎన్ఆర్ఐ డాక్టర్ రాజా కుమారుడి వివాహానికి హాజరు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, తన అర్ధాంగి నారా బ్రహ్మణితో కలిసి అమెరికాలో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరయ్యారు. గ్లోబల్ ఎన్నారై చీఫ్ డాక్టర్ రాజా కుమారుడి వివాహం అమెరికాలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి లోకేశ్ దంపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరుల వద్దకు వెళ్లి మంత్రి లోకేశ్, నారా బ్రహ్మణి వారిని మనసారా ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో లోకేశ్ దంపతులు సంప్రదాయ దుస్తులలో కనిపించారు. కార్యక్రమానికి వచ్చిన పలువురితో వారు కాసేపు ముచ్చటించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## వీఆర్ఏల సమస్యలపై స్పందించకుంటే ఉద్యమిస్తాం

- ఎపి వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను సెప్టెంబర్ 15 లోపల పరిష్కారానికి చొరవ చూపాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ఎపి వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీసెస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వానికి అల్టిమేట్ జారీ చేసారు. ఆదివారం దాసరిభవన్‌లో వీఆర్ఏ అసోసియేషన్ రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపు వీఆర్ఏలకు అనేక హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను పట్టించుకునే స్థితి లేదని అన్నారు. వీఆర్ఏలకు తక్షణం పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకీ వీఆర్ఓలుగా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీ వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. గ్రామాలలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే చిరుద్యోగులను ఆదుకోకపోవడం అన్యాయం అన్నారు. దాదాపు 54 శాఖలకు సంబంధించి విధులను ఫుల్ టైం నిర్వహిస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'వేతనం ఇచ్చేది తక్కువ.. పని భారం ఎక్కువ' అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించక పోతే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి నెల్లూరు అంకయ్య, భోగేశ్వరయ్య, కోడూరు పుల్లయ్య, బొట్ల నాగసుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పోలీసుల కృషి



**తిరుపతి, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'మాన్సూన్ ప్లాంటేషన్ ప్రోగ్రామ్-2026'లో భాగంగా తిరుపతి జిల్లా పోలీసులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆదేశాలతో తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవకోన జీవలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం మార్గదర్శకత్వంలో అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీవాణి, పోలీసు సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజల సమన్వయంతో 250 మొక్కలను నాటారు. ఇకఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతలచేను రోడ్డులో పోలీసు సిబ్బంది వంద మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మొత్తం 350 మొక్కలను నాటారు. నాటిన మొక్కలను స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది సమన్వయంతో సంరక్షిస్తూ, వాటి ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## 'తిరంగ్గా మన గౌరవం.. దేశభక్తికి ప్రతీక

- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపు



**గుంటూరు(విద్య), ఆగస్టు 9 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గుంటూరులో బిజెపి జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర 200 మీటర్ల జాతీయ జెండాతో విజ్ఞాన్ మందిరం దగ్గర నుంచి మార్కెట్ సెంటర్ మీదగా లిబర్టీ, కృష్ణమహల్ థియేటర్ రోడ్డులో నుంచి నాజ్ సెంటర్ వరకు జాతీయ జెండాలతో 'భారత్ మాతాకీ జై, వందేమాతరమ్' నినాదలతో శోభయాత్ర సాగింది. ఈ తిరంగా ర్యాలీలో ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ జాతీయ జెండా ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశభక్తికి, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని తెలిపారు. తిరంగా కేవలం ఒక జెండా కాదు ఇది మన స్వాతంత్ర్య పోరాటానికి, మన సైనికుల త్యాగాలకు ప్రతీక, 140 కోట్ల భారతీయుల ఐక్యతకు ప్రతీక అని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి 'హర్ ఘర్ తిరంగా - హర్ దిల్ తిరంగా' స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు.

రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ తిరంగా కేవలం ఒక జెండా కాదు ఇది భారతదేశ ఆత్మగౌరవానికి ప్రతీక అని ఈ జెండా కోసం లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను అర్పించారు. ప్రతి భారతీయుడి ఇంటిపై తిరంగా ఎగరాలి, ప్రతి గుండెలో దేశభక్తి వెలగాలి. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, ప్రతి పౌరుడి జాతీయ బాధ్యతగా స్వీకరించాలి. మన మధ్య భాషలు వేరు కావచ్చు, ప్రాంతాలు వేరు కావచ్చు, సంప్రదాయాలు వేరు కావచ్చు కానీ మనందరినీ కలిపేది జాతీయ పతాకం మాత్రమే అని కులం, మతం, ప్రాంతం, రాజకీయ భేదాలకు అతీతంగా దేశం కోసం ఒక్కటిగా నిలబడాలి అని అన్నారు. తూర్పు ఎమ్మెల్యే నజీర్ మహమ్మద్ మాట్లాడుతూ యువత చేతిలో జాతీయ పతాకం ఉంటే దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. సోషల్ మీడియాలో దేశభక్తి సందేశాలు పంచుకోవడం మాత్రమే కాదు, సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, విద్యా ప్రోత్సాహం, అవినీతి వ్యతిరేక పోరాటం వంటి కార్యక్రమాల్లోనూ యువత ముందుండాలి అని అన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ దేశాన్ని విమర్శించడం సులభం దేశాన్ని నిర్మించడం కష్టం అని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించినప్పుడే నిజమైన దేశభక్తి నిరూపితమవుతుంది. మన ఇల్లు శుభ్రంగా ఉంచడం నుంచి, ప్రజా ఆస్తులను కాపాడటం వరకు ప్రతి మంచి పని కూడా దేశ సేవే అని అన్నారు. ఈతిరంగా ర్యాలీలో ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, తిరంగా ర్యాలీ రాష్ట్ర కన్వీనర్ గుడిసె దేవానంద్, కో కన్వీనర్లు శివారెడ్డి, సాయి లోకేష్, డాక్టర్ మందూరి వెంకటరమణ, బిట్ర శివన్నారాయణ, కొత్తూరు వెంకట సుబ్బారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, వెలగలేటి గంగాధర్, పాలపాటి రవికుమార్, ఆవుల నాగేంద్ర యాదవ్, డాక్టర్.గి.జు. రావు తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ డాక్టర్ చరక కుమార్ గౌడ్, కో కన్వీనర్లు క్రిష్టిపాటి నారాయణరెడ్డి, మేడూరి యశ్వంత్, నాయకులు వై.వి.సుబ్బారావు, షేక్ పైరోజ్, నడ్డి నాగమల్లేశ్వరి, హరి పావని, భజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, సాధు రామకృష్ణ, కఠారి వాసుదేవ నాయుడు, సురేష్ జైన్, మంత్రి సుగుణ, మేరీ సరోజిని, విమలాదేవి, విజయలక్ష్మి, దానబోయిన శివయ్య, వీర మణింద్ర, ఆమతి వెంకట రమణ, డాక్టర్ రాధా మాధవి, తుంగ యశ్వంత్, తురక రామారావు, షేక్ రఫీ, అబ్దుల్ ఖుద్దుస్, గౌస్ పీరా, షేక్ ఫర్హానా, అబ్దుల్ రషీద్, కాయితీ ప్రదీప్, కంతేటి బ్రహ్మయ్య, మేకల లక్ష్మణ్, రావుల రాజశేఖర్, మొవ్వ నరేష్, మల్లాల లక్ష్మణ్, చింతల పూడి సురేష్, మలిశెట్టి పవన్, పెసల వెంకటేష్, బెహర గాయత్రి, గొర్ల నాగమల్లేశ్వరి, చిరతన గండ్ల భూలక్ష్మి, లంక రవి, గాలేటి బాబు, సిద్దే సురేష్, నంద కిషోర్, కనసాని శ్రీనివాస రావు, రాజేష్ నాయుడు, అప్పిశెట్టి రంగా, రాచముల్లు భాస్కర్, పోతురాజు వేంకటేశ్వర్లు, శేషగిరి, కామేపల్లి వెంకటేశ్వర్లు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తిరుపతిలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'



**తిరుపతి, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిరుపతిలో 'హర్ ఘర్ తిరంగ్గా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని టాటానగర్, పీకే లేఔట్‌తో పాటు పలు ప్రాంతాల్లో బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జాతీయ జెండాలను అందజేసి, తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయించారు. ఈ సందర్భంగా గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ జెండా దేశ సమైక్యతకు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి భారతీయుడు త్రివర్ణ పతాకాన్ని అత్యంత గౌరవంతో ఎగురవేసి, స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశభక్తి భావనతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో 'హర్ ఘర్ తిరంగ్గా' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడేలా ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపినాథ్, పెరియస్వామి రామ్‌కుమార్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, బిజెపి నాయకులు, స్థానికులు విగ్రహాల కళ్యాణి, సిద్ధమ్మ, కవిత, శారదా, లక్ష్మయ్య, లోకనాథం, వాసు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వార్త

విజయం సాధించగలమనే విశ్వాసం ఉన్నవాళ్లు విజయం సాధించి తీరుతారు.

- డబ్ల్యు. ఎమర్సన్

# సాగీ సాగని 'సాగు'!

కాస్త ఆలస్యంగానైనా వర్షాలు పడ్డాయి కానీ ఖరీఫ్ సాగుకు అవసరమైన తరుణంలో వానలు కురవకపోవడమొక్కటే తెలుగు రాష్ట్రాల రైతాంగాన్ని వేధిస్తున్న ఒకే ఒక బెంగ. ఎల్‌నినో, దానివెంట సూపర్ ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్‌లో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో హెచ్చరించి, ఎలా ఎదుర్కోవాలో చెప్పి రైతును ముందస్తు సన్నద్ధ చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందు చూపుతోనే వ్యవహరించారని చెప్పాలి. అంతేకాదు రైతాంగాన్ని ఆదుకునే విషయంలో ప్రభుత్వాలు ఏ ఆప్షన్‌ను వదులుకోలేదు. దేవాలయాల్లో వరుణ యాగాలు కూడా మొదలెట్టేశాయి. ఏమైతేనేం ఈసారి వర్షాలు కురిసాయి. వీటితో పంటలు నిలబడతాయానే అనుకోవాలి. 'వరి'కి తగినంత నీరు అందించలేమనే ఉద్దేశంతో ఉభయ రాష్ట్రాలు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించాలని హితబోధ కూడా చేసింది. మార్కెటింగ్‌లో కూడా వీలైన పరిస్థితులు ప్రత్యామ్నాయపంటకే సానుకూలమని నచ్చచెప్పినా సాంప్రదాయ రైతు 'వరి'కే మొగ్గుచూపాడు. తాజా గణాంకాల ప్రకారం 'వరి' విషయంలో రైతు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. దేవుని మీద భారం పెట్టేసి విత్తునాటేసాడు. ఇప్పుడు కొనసాగుతున్న వానలువరదలై రైతును ఆనందోత్సాహాల మధ్య ముంచుతున్నా, పంటల యాజమాన్యంలో ఎన్నిసమస్యలు ఎదురు చూస్తారో ఇప్పుడిప్పుడే అంచనా వేయలేం. ప్రస్తుతానికైతే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైతులు వర్షానందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడొస్తున్న వర్షాలతో పూర్తిస్థాయి సాగు నడుస్తుందో లేదో పంట ఉత్పత్తులు సజావుగా బయటపడతాయో లేదో చెప్పేందుకు ఎదురు చూడాల్సిందే. ఈ వర్షాలు ప్రస్తుతానికైతే ఊరటనిస్తున్నాయి. అలా అని 'ఎల్‌నినో' ముప్పు ఉండదని, గట్టెక్కేసినట్లేనని చెప్పే పరిస్థితులు మృగ్యం. వచ్చే రబీ సీజన్‌లో కూడా ఎల్‌నినో ముప్పు ఉంటుందని ఏనాడో శాస్త్రజ్ఞులు విశ్లేషించి చెప్పారు. సకాలంలో నీరు రాక ఎండిపోయిన నేలలు తడిసి ముద్దయ్యాయి. ప్రస్తుతం కళ్లెదుట కనిపిస్తున్న వాన పరిస్థితులతో తెలుగు రాష్ట్రాల రైతుల్లో ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. అయినా వర్షాల అనిశ్చితితో ఎదుర్కోవాల్సిన కష్టాలు ముందున్నాయి. 2026లో దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం చెప్పుకోదగినట్లుగానే ఉంటుందని భారత్ వాతావరణ సంస్థ ముందుగానే హెచ్చరించినందున రైతు వర్షాల కోసం ఎదురు చూశాడు. అవి రానే వచ్చాయి. అన్ని చోట్లా సరిపడే వర్షాలు కురిసినట్లు చెప్పుకుంటున్నా నీటి పంపిణీలో ఎగుడుదిగుడుల కారణంగా సాగు పరిస్థితులపై అప్పుడే ఓ నిర్ణయానికి రాలేం. అంటే ఓ ప్రాంతానికి వానవెల్లువ, అదే ప్రాంతంలోని మరో చోట వర్షాభావం ఉంటే సాగు బహుకష్టమే. ఆంధ్రప్రదేశ్‌లో జలాశయాల్లో నీటి నిల్వలను బట్టి ఖరీఫ్‌సాగు పురోగతి ఉంటుంది. జులై చివరి నాటికి ఈ రాష్ట్రంలో వర్షపాత లోటు గణనీయంగా ఉంది. అదే సమయంలో తెలంగాణలో వర్షపాతం లోటుతో సాగు ఆలస్యమైంది. తాజాగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో వర్షాల పరిస్థితిని బట్టే తెలంగాణ జలవనరులు దాదాపు అందుబాటులోకి వచ్చాయి. ఉభయ రాష్ట్రాలలో తక్కువ నీటితో సాగయ్యే పంటల మీద కూడా రైతాంగం శ్రద్ధ పెట్టినందుననేలలో తేమను కాపాడుకోవడం, వాననీటిని పొలాల్లో నిల్వ చేసుకోవడంలో రైతు అప్రమత్తంగా ఉండడం అవసరం. ఎన్ని హెచ్చరికలు చేసినా పంటల వైవిధ్యీకరణ నేపథ్యంలో పంటల సాగులో 10శాతంరైతులు అధిక విస్తీర్ణంలో విత్తారు. వరి సేద్యాన్ని ఎవరూ వదిలిపెట్టలేదు. ఉభయ రాష్ట్రాల్లోనూ ప్రస్తుతం ఖరీఫ్ నాట్లు బాగానే పడ్డాయి. కాస్త అటూఇటూగా నాటినా పంటల పెరుగుదలలో ఉన్నాయి. తాజా వర్షాలలో ఉభయ రాష్ట్రాలో సాగులోటు బాగా తగ్గింది. తెలంగాణలో గత ఖరీఫ్ సీజన్ కంటే ఈసారి రాష్ట్రంలో సాగు విస్తీర్ణమైతే పెరిగింది. ఇప్పటి వరకు సాగు విస్తీర్ణంలో అధిక భాగం వరి,పత్తి, మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గుచూపారు. గతంతో పోల్చి చూస్తే పప్పుధాన్యాలు, నూనెగింజలు పంటల విస్తీర్ణం పెరుగుదల చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం సాగు 32.05 లక్షల హెక్టార్లు తెలంగాణ ఖరీఫ్ సాగు సాధారణ విస్తీర్ణం 31.16 లక్షలు. దీర్ఘకాలిక పంట నమూనాలో పత్తి, వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు,వేరుసెనగ, ప్రధానంగా ఉన్నాయి. ఇకపై సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు పంట ఉత్పత్తులు మార్కెట్‌కి చేరే వరకు జాగ్రత్తగా కంటికిరెప్పలా చూసుకోవాలి. ఈసారి నైరుతి రుతుపవనాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాధారణం కంటే 8శాతం నుంచి 12 శాతం అధిక వర్షాలు పడినట్లే. ఉద్యాన పంటలకు అతివృష్టి దెబ్బ తగ్గింది.తొలుత ఎల్‌నినో ప్రభావంతో కరవువస్తుందని కంగారు పడ్డాం.కానీ జులైనెలలో అతివృష్టితోఆంధ్రప్రదేశ్‌లో గోదావరి కృష్ణా డెల్టా సాగు సంతృప్తికరమే. రాయలసీమలో చెరువులు నిండక 30 శాతం ఆయకట్టు తగ్గింది. మిర్చికి తొలిరోజుల్లో పూతరాలిపోయి 25శాతం దిగుబడి తగ్గే అవకాశం ఉంది. కోస్తా జిల్లాల్లో విరివిగా పండే అరటి, మామిడి ఈదురుగాలులు కారణంగా చెట్లు నేల కొరిగాయి. ఇక తెలంగాణలో కూరగాయల తోటలు నీట మునిగాయి. ఇవన్నీ అనుకోకుండా వచ్చిన నష్టాలే. వీటన్నిటి నుండి రైతుతేరుకోవడం ఎంతో కష్టం.వర్షాధార పంటలకు భూగర్భజలాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు ఈ వర్షాలు ఏమూలకీ సరిపోవు.నీటి వినియోగ అవసరాలను గుర్తించి నీటి మళ్లింపు ప్రక్రియకు వ్యవసాయ శాఖ మార్గదర్శనం చేయాలి. ప్రస్తుతం నడుస్తున్న పంటల భీమా పథకాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి. అప్పుడే రైతు మనసు తేలికపడుతుంది.

విద్య అనేది శాస్త్రాలను వివరించేందుకే పరిమితం కారాదు. ఒక పరిపూర్ణమైన మానవుని తీర్చిదిద్దే అసలైన విద్య.



రవీంద్రనాథ్ ఠాగూర్

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



## సమగ్ర కార్యాచరణ అవసరం

భారత్‌లో సైబర్ నేరాలు రోజురోజుకూ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. సుప్రీంకోర్టు ఇటీవల సైబర్ నేరాలనియంత్రణ ప్రభుత్వాలరాజ్యాంగబద్ధమైన బాధ్యత అని స్పష్టంగా పేర్కొనడం అత్యంత సమయోచితమైన పరిణామం. 2024లో దేశవ్యాప్తంగా 65.9లక్షల సైబర్ ఫిర్యాదులు, సుమారు రూ.55,493 కోట్ల ఆర్థిక నష్టం నమోదవడంసమస్య తీవ్రతను తెలియజేస్తోంది. డిజిటల్ పేమెంట్లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు విస్తరిస్తున్న వేళ, భద్రతావ్యవస్థలు కూడా అదే స్థాయిలో బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మోసగాళ్లు ఫేక్ లింకులు, ఫిషింగ్ సందేశాలు, నకిలీ ఫోన్ కాల్స్, వాట్సాప్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి ఆఫర్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీడబ్బు తిరిగిపొందడం,కేసుల దర్యాప్తు పూర్తవడం చాలా సందర్భాల్లో ఆలస్యమవుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## వరుణ యాగాలు సిగ్గుచేటు!

తెలంగాణలో వర్షాభావం ఏర్పడిందనీ ఈ నెల పదవ తేదీ నాగర్జున సాగర్ వద్ద వరుణ యాగం తల పెట్టడం రేవంత్ రెడ్డి ఇజ్జత్‌ను తగ్గిస్తుంది. పోరాట యోధుడిగా రేవంత్‌కు మంచి పేరుంది. వర్షం పడకపోవటానికి శాస్త్రీయ కారణం చూడాలి.మేఘ మదనం వలన మేఘాలను రప్పించి వాటికి చల్లదనం కలిగిస్తే వర్షం పడుతుంది. అది శాస్త్రీయం.ఈ యాగాలు అన్ని కొంతమంది పూజారులు,పురోహితులకు జీవనాధారమైపోయింది.వాళ్ళుఏది చెబితే దాన్ని నమ్మి ప్రజాధనం దుర్వినియోగం చేయటం తగదు.ఆర్టికల్ 51 హెచ్‌లో వ్రాసుకున్నట్లుగా శాస్త్రీయ భావాలను ప్రభుత్వాలు పెంచాలి. అనాగరికమైన యజ్ఞాలు, యాగాలు చేయటం ప్రభుత్వాలు మానుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం

## తస్మాత్ జాగ్రత్త

రెండున్నరేళ్ల క్రితం తెలంగాణలో కెసిఆర్ ఆ వెంటనే ఎపిలో జగన్ ఢిల్లీలో కేజ్రీవాల్, ఈ మధ్య పినరయి విజయ్,మమత,స్టాలిన్‌ఎన్నికల్లో పరాజయంపాలై పదవీచ్యుతులు అయ్యారు.వారుచేసిన అవినీతిపనులు, అహంకార ప్రవర్తనే వారి ఈ ఘోర పరాజయానికి కారణం. ఇప్పుడుపాలన చేస్తున్నముఖ్యమంత్రులు తమకి అలాంటి పరాజయ పరిస్థితులు రాకుండా చూసుకోవాలి.

-మిథునం, హైదరాబాద్

## ఉత్తర్వులు సమంజసంగా లేవు!

దశాబ్దాలుగా మనం కావేరీ సంక్షోభాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వేసవిలో, తమిళనాడులో పంటలకు నీరు లేదని చెబుతూ, కావేరీ జలనిర్వహణ అథారిటీ లేదా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తున్నారు. మా మూడో పంట కూడా ఎండిపోతోంది,నీటిని విడుదల చేయమని చెప్పే తమిళనాడు ప్రభుత్వానికి, కర్ణాటకలో రెండే పంటలు పండినా అవి ఎండిపోయినా పర్వాలేదనే మనస్తత్వంలా కనిపిస్తుంది. ప్రస్తుతం, వర్షాలు లేకపోవడం వల్ల కర్ణాటక పై కరవు నీడ పడింది.రాబోయేరోజుల్లో ప్రజలు,పశువులు తాగునీటి కొరతను ఎదుర్కొనే అవకాశం ఉంది. ముఖ్యంగా బెంగుళూరు నగరం కూడా రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఎదురుక్కునే పరిస్థితులురావచ్చు అనేకథనాలు పత్రికల్లో వస్తున్నాయి. రెండు రాష్ట్రాల జలవనరుల పరిస్థితి గురించి అథారిటీ కి తెలుసు. అయినప్పటికీ, జలాశయాలలో ఉన్న కొద్దిపాటి నీటి నుండి తమిళనాడుకు నీటిని విడుదలచేయమని ఆదేశించడం సమంజసం కాదు. ఈ ఉత్తర్వులను పునః పరిశీలించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## భారత్, బంగ్లా స్నేహసంబంధం

ఫ్రాన్స్ మీడియా సంస్థతో ఇచ్చిన ఇంటర్వ్యూ లో బంగ్లా మాజీ ప్రధానిషేక్ హసీనాతిరిగి వెళ్లడం ఒక చర్చనీయాంశం. ఆశ్రిత పక్షపాతం ఉండడం, అవినీతి ఆరోపణలు మూలంగా విద్యార్థుల నిరసన ఎదుర్కోవడం వల్ల భారత్‌కు ఆశ్రయానికి వచ్చిన హసీనాకు భారత్ ఆపన్న హస్తం చాచింది. అయితే దీనివెనుక భారత్, బంగ్లా మధ్య ఉన్న స్నేహ సంబంధాలతో పాటు పాకిస్థాన్ దాష్టికాలకు వ్యతిరేకంగా భారత్ బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం సంపాదించడంలో 1971లో పాకిస్థాన్‌కి వ్యతిరేకంగా యుద్ధం కూడా చేసింది మర్చిపోకూడదు. భారత్ బంగ్లామధ్య స్నేహ సంబంధాలను ఎంతమాత్రం చెడగొట్టాలేకపోయాయి.భారత్,బంగ్లాదేశ్ మధ్యఉన్నది కేవలం స్నేహ సంబంధాలు మాత్రమే కాదు. ఈ రెండుదేశాల మధ్య ఉన్నది మిశ్రమ సంస్కృతి, లౌకికసంస్కృతి, అని గుర్తుపెట్టుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

## మార్పులు జరగటం సహజం

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, చట్టసభ సభ్యులు ఎప్పుడూ ఒకరే ఉండరు. ఐదు సంవత్సరాలు కాకపోతే 10 సంవత్సరాలు. అదీకాకపోతే 20సంవత్సరాలు. మరి కొందరు 30 సంవత్సరాలు కూడా పదవుల్లో ఉంటారు. ఆ తరువాత మరొకరు వారి స్థానంలోకి వస్తారు. తప్పదు. దీన్ని అర్థం చేసుకుని హుందాగా వ్యవహరించాలి.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పేరు మారితే మహిళల 'దిశ' మారుతుందా?

**చట్టాలను మార్చడం కంటే అమలు వ్యవస్థను మార్చడం కష్టమైనపని. అందుకే ప్రభుత్వాలు వాస్తవాలను పక్కనపెట్టి చట్టాల పేర్లు మాత్రమే మార్చడంసమస్యకు మూలపరిష్కారం కాదు. దిశబిల్లు వెనక్కి వెళ్లింది. రేపు మరో ప్రభుత్వం మరో పేరుతో ఇంకోచట్టం తీసుకురావచ్చు. కానీ మహిళల జీవితాల్లో భయం తగ్గకపోతే, పోలీస్‌స్టేషన్‌లో అవమానం ఆగకపోతే, కోర్టుల్లో న్యాయం సంవత్సరాల తరబడి నిరీక్షించాల్సివస్తే, దళిత,ఆదివాసీ, బీసీ,మైనారిటీ, పేదమహిళలపై జరిగేహింస జాతీయ చర్చగా మారకపోతే,ఈ దేశానికి సమస్య చట్టాల కొరత కాదు. రాజకీయ చిత్తశుద్ధి కొరత. పరిపాలనా సంకల్పం కొరత. సామాజిక న్యాయం కొరత. దిశబిల్లు వెనక్కి వెళ్లిందా లేదా అనేది రేపు ఒక పరిపాలనా నమోదుగా మాత్రమే మిగిలిపోవచ్చు. కానీ మహిళల దశ మారిందా లేదా అనేదే ఈ కాలానికి చరిత్ర తీర్పు చెబుతుంది.**



పాపని నాగరాజు

ప్రతి అత్యాచారం తర్వాత ఒక కొత్త చట్టం వస్తోంది. ప్రతికొత్త చట్టం తర్వాత మరో అత్యాచారం కూడా జరుగుతోంది. మారేది చట్టాల పేర్లు మాత్రమే. మహిళల జీవితం కాదు. ప్రజల్లో ఆగ్రహం చెలరేగితే ప్రభుత్వాలు కొత్త చట్టాలను ప్రకటిస్తాయి. మీడియా వాటిని సంచలనంగా చూపిస్తుంది. రాజకీయ పార్టీలుమహిళల భద్రతపై పోటీగా ప్రకటనలు చేస్తాయి. కొద్దిరోజులకు ఆ ఆగ్రహం చల్లారిపోతుంది. చట్టం ఫైళ్లలో పడిపోతుంది. ఇదే చక్రం మళ్లీ తిరుగుతుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిశ బిల్లును ఉపసంహరించుకుంది. ఇది ఒక పరిపాలనా నిర్ణయంగా కనిపించవచ్చు. కానీ లోతుగా చూస్తే, అధికార కేంద్రీకరణ, పితృస్వామిక, నిర్లక్ష్యం సామాజిక అసమానతలు ఒకే చోట కలిసిన నిర్ణయంగా కనిపిస్తుంది. అసలు ప్రశ్న దిశ బిల్లు గురించికాదు. దిశ బిల్లు వెనక్కి వెళ్లింది. మహిళల దశ మారిందా? 2019లో హైదరాబాద్‌లో ఒక యువ పశువైద్యురాలిపై జరిగిన సామూహిక అత్యాచారం, హత్య దేశాన్ని కుదిపేసింది. ఆ ఘటనపై వెల్లువెత్తిన ప్రజాఆగ్రహానికి రాజకీయ ప్రతిస్పందనగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకొచ్చింది.అత్యాచార కేసులదర్యాప్తు, విచారణను వేగవంతం చేయడం, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడం, కఠిన శిక్షలు అమలు చేయడం వంటి లక్ష్యాలతో ఈ చట్టాన్ని రూపొందించింది. అయితే ఇది ఒక్కసారిగా పుట్టిన ఆలోచన కాదు. 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. దాని ఫలితంగా 2013లో నేరచట్టాల్లో కీలక సవరణలుజరిగాయి. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టేందుకు పోక్సో చట్టం అమల్లోకి వచ్చింది. ప్రతి దారుణ ఘటన తర్వాత ఒక కొత్త చట్టం వచ్చింది. కానీ ఒక్కసారి కూడా మనం ఒక ప్రశ్నను గంభీరంగా అడగలేదు. ఇప్పటికే ఉన్న చట్టాలు ఎందుకు విఫలమయ్యాయి? చట్టాలు మారాయి. శిక్షలు కఠినమయ్యాయి. నేరాల నిర్వచనాలు విస్తరించాయి.అయినప్పటికీ మహిళలపై హింస తగ్గలేదు. దీనర్థం సమస్య చట్టాల కొరతలో లేదని, చట్టాలను అమలు చేసే వ్యవస్థలోనే ఉందని స్పష్టమవుతోంది. ఇక్కడ మరో వాస్తవాన్ని కూడా గుర్తించాలి. ప్రతి మహిళపై జరిగిన దారుణం ఒకేస్థాయిలో ప్రజాస్పందన పొందదు. ప్రతి బాధితురాలికి ఒకే స్థాయిలో రాజకీయ అండ, మీడియా దృష్టి, సామాజిక సంఘీభావం దక్కదు. నిర్భయ ఘటన దేశ రాజధానిలో జరిగింది.కానీ గ్రామాల్లో, అట్టడుగు వర్గాల్లో, శ్రామిక కుటుంబాల్లో, దళిత, ఆదివాసీ, బీసీ, మైనారిటీ మహిళలపై నిత్యం జరిగే హింసలో ఎక్కువ భాగం జాతీయ చర్చగామారదు. చట్టాలు ప్రజాఆగ్రహం నుంచి పుడతాయి. కానీ ఏఆగ్రహం చట్టంగా మారుతుంది? ఏ బాధ మౌనంగా మిగిలిపోతుంది? అనే ప్రశ్నకు సమాధానం మన సామాజిక నిర్మాణంలోనే దాగి ఉంది. ప్రియాంక రెడ్డి ఒక మహిళ కనుక దేశమంతా స్పందించింది. అదే తీవ్రతతో, అదే వేగంతో, అదే రాజకీయ సంకల్పంతో దళిత,ఆదివాసీ, బీసీ, మైనారిటీ,పేద మహిళలపై జరిగే అత్యాచారాల విషయంలో ఎందుకు స్పందించరు? ఈప్రశ్న తర్వాత అనేక దళిత, బహుజన సంఘాలుకూడా ఇదే అంశాన్ని బహిరంగంగా చర్చించాయి. హత్రాస్‌లో దళిత యువతిపై జరిగిన అత్యాచారం, బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన నిందితుల విడుదల చుట్టూచెలరేగిన వివాదం, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన ఒకే విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. చట్టం అంద రికీ ఒకటే కావచ్చు. కానీ న్యాయం అందరికీ ఒకే వేగంతో, ఒకే తీవ్రతతో అందడం లేదు. బాధితురాలి కులం, వర్గం, ప్రాంతం, రాజకీయ పరిస్థితి కూడా న్యాయవ్యవస్థ స్పంద నను ప్రభావితం చేస్తున్నాయనే విమర్శలు యాదృచ్ఛికంగా రావడం లేదు. 2019



డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన దిశ చట్టం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపబడింది. అక్కడే అది ఐదేళ్లకు పైగా నిలిచిపోయింది. నేర చట్టాలు ఉమ్మడి జాబితాకు చెందిన అంశం కావడంతో రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. కేంద్ర హోంశాఖ పలు నిబంధనలపై వివరణలుకోరింది. ఫైళ్ల కదిలాయి.కానీ చట్టం ముందుకు కదల్లేదు. ఈ ఐదేళ్లలో ఎంతమంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు?ఎన్ని కుటుంబాలు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగాయి? ఎంతమంది బాధితులు పోలీస్ స్టేషన్ గుమ్మం దాటలేకపోయారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ప్రభుత్వాలు లేవు. చట్టం పెండింగ్‌లో ఉన్నంతకాలం ప్రజలకు ఇచ్చినహామీ కూడా పెండింగ్‌లోనే ఉంది.వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేయడం వరకు తన బాధ్యతను నిర్వర్తించింది. కానీ రాష్ట్రపతి ఆమోదం కోసం అవసరమైన రాజకీయ, న్యాయ పోరాటాన్ని కొనసాగించ లేకపోయింది. మరోవైపు కేంద్రప్రభుత్వం వివరణల పేరుతో ఫైళ్లను నిలిపివేసింది. ఫలితంగా రాజకీయాలు సాగాయి. పరిపాలనా ప్రక్రియ కొనసాగింది.కానీ న్యాయం మాత్రం వేచిచూసింది. ఇప్పుడు ఎందుకు ఉపసంహరించుకున్నారు? భారతీయ శిక్షాస్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత అమల్లోకి వచ్చాయని, మహిళలు, చిన్నారుల రక్షణకు అవసరమైన అనేక నిబంధనలు కొత్త కేంద్ర చట్టాల్లోనే ఉన్నాయని చెబుతూ దిశ బిల్లును ఉపసంహరించుకుంది. కానీ ఇక్కడితో చర్చముగియదు. అదే మంత్రివర్గ సమావేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చట్టం, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం, అమరావతి ఐ ప్రాజెక్టు వంటి పెట్టుబడులకు సంబంధించిన నిర్ణయాలు వేగంగా ఆమోదం పొందాయి. మహిళల భద్రతకు సంబంధించిన చట్టంమాత్రం ఐదేళ్ల ఫైళ్లలో తిరిగి చివరకు ఉప సంహరణకు గురైంది. మహిళల భద్రతకు సంబంధించిన చట్టం సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటుంది. కానీ పెట్టుబడిదారులకు సంబంధించిన నిర్ణయాలు ఒకే సమావేశంలో ఆమోదం పొందుతాయి. ఇది యాదృచ్ఛికం కాదు. పాలక వ్యవస్థకు ఏఅంశాలు అత్యవసరమో, ఏ అంశాలు వేచి ఉండవచ్చో తెలిపే రాజకీయ ప్రాధాన్యతల క్రమం.అభివృద్ధి అంటే పెట్టుబడుల ప్రవాహమేనా? లేక మహిళలు భయం లేకుండా జీవించగల సమాజాన్ని నిర్మించడమూ అభివృద్ధేనా? అనే ప్రశ్నకు ప్రభుత్వం తన నిర్ణయాలతోనే సమాధానం చెబుతోంది. దిశబిల్లును ఉపసంహరించుకున్న ప్రభుత్వం, రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా మరింత సమగ్రంగా రూపొందించిన ప్రత్యామ్నాయ చట్టాన్ని ఇప్పటివరకు తీసుకురాలేదు. 'కొత్త కేంద్ర చట్టాలే సరిపోతాయి' అనడం పరిపాలనా సమాధా నం కావచ్చు. కానీ మహిళల భద్రత విషయంలో రాష్ట్రానికి ఉన్న రాజ్యాంగబద్ధమైన బాధ్యత అక్కడితో ముగిసిపోదు. ప్రతిదారుణ ఘటన తర్వాత చట్టాలను మరింత కఠినత రం చేయాలనే డిమాండ్ వస్తుంది. ప్రతి ప్రభుత్వం కూడా అదే మార్గాన్ని ఎంచుకుంటుంది. కానీ చరిత్రమరో వాస్తవాన్ని చెబుతోంది. నేరాలను ఆపేది శిక్ష తీవ్రతకాదు. నేరం చేసినవాడు తప్పకుండా పట్టుబడతాడనే భయం. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతుందనే విశ్వాసం. విచారణఆలస్యం కాదనే నమ్మకం.శిక్ష తప్పదనే పరిపాలనా సామర్థ్యం. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడానికే రోజులు పట్టినా, ఫోరెన్సిక్ నివేదికలు నెలలతరబడి ఆలస్యమైనా, ప్రత్యేక కోర్టులు తగినంత లేక కేసులు సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉన్నా, అత్యంత కఠినమైన చట్టం కూడా పుస్తకాలకే పరిమితమవుతుంది. చట్టాలను మార్చడం కంటే అమలు వ్యవస్థను మార్చడం కష్టమైనపని. అందుకే ప్రభుత్వాలు వాస్తవాలను పక్కనపెట్టి చట్టాల పేర్లు మాత్రమే మార్చడం సమస్యకు మూలపరిష్కారం కాదు. దిశ బిల్లు వెనక్కివెళ్లింది. రేపుమరో ప్రభుత్వం మరోపేరుతో ఇంకోచట్టం తీసుకురావచ్చు.కానీ మహిళల జీవితాల్లోభయం తగ్గకపోతే, పోలీస్‌స్టేషన్‌లో అవమానం ఆగకపోతే, కోర్టుల్లో న్యాయం సంవత్సరాల తరబడి నిరీక్షించాల్సివస్తే, దళిత, ఆదివాసీ, బీసీ, మైనారిటీ, పేద మహిళలపై జరిగే హింస జాతీయ చర్చగా మారకపోతే, ఈ దేశానికి సమస్య చట్టాల కొరతకాదు.రాజకీయ చిత్తశుద్ధి కొరత, పరిపాలనా సంకల్పం కొరత, సామాజిక న్యాయం కొరత. దిశ బిల్లు వెనక్కి వెళ్లిందా లేదాఅనేది రేపు ఒక పరిపాలనా నమోదుగా మాత్రమే మిగిలిపోవచ్చు. కానీ మహిళల దశ మారిందా లేదా అనేదే ఈ కాలానికి చరిత్ర తీర్పు చెబుతుంది. ●

# మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలకు అంతం లేదా?

కామిడి సతీష్ రెడ్డి

ఉభయ తెలుగు రాష్ట్రాలలో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలు ఉశృతి మించిపోతున్నాయి. గతంలో పలువురు పేద మహిళల ప్రాణాలు బలిగొన్న మైక్రో ఫైనాన్స్‌లు మళ్లీ విజృంభిస్తున్నాయి. పేద కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా పతనం చేస్తూ వారి పాలిట శాపంగా మారిన మైక్రో ఫైనాన్స్‌లను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. తిరిగి పుంజుకున్న మైక్రో ఫైనాన్స్‌లు ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటూ పడగ విప్పుతున్నాయి. తీసుకున్న రుణాన్ని ప్రతీవారం చెల్లించాల్సిన మైక్రోఫైనాన్స్‌ల ఊబిలో పేదవర్గాలు కూరుకుపోతున్నాయి. మరోసారి పాత దుర్ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు. సమభావన సంఘాలు, స్త్రీనిధి, ముద్ర తదితర రూపకాలలో ప్రభుత్వం రుణాలను అందిస్తున్నప్పటికీ పలువురు మహిళలు తక్షణ ఆర్థిక అవసరాల కోసం మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. కానీ తిరిగి చెల్లింపులో ఇబ్బందులకు గురవుతూ మానసిక, ఆర్థిక క్షోభకు గురవుతుండగా నెలవారీగా చెల్లించాల్సిన బ్యాంకు లింకేజీ రుణాలను చెల్లించలేకపోతున్నారు. దీంతో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలను ప్రారంభంలోనే నియంత్రించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల చెల్లింపులో మహిళా సంఘాలే అగ్రగామిగాఉంటున్నాయి. ఏ ఒక్క సభ్యురాలు రుణ వాయిదాల చెల్లింపులో ఆలస్యం చేసినా మిగతా సభ్యులు బాధ్యత వహిస్తూ ఆ మహిళతో రుణ వాయిదా చెల్లింపచేయడమో లేదా తామే భరించడమో చేస్తున్నారు. దీంతో మహిళా సంఘాల రికవరి సుమారు 100 శాతంగా ఉంటోంది. దీంతో మహిళల ఆర్థిక అవసరాలు, రుణాల చెల్లింపులో నిజాయితీని ఆసరాగా చేసుకుంటూ పలు మైక్రోఫైనాన్స్‌లు విజృంభిస్తున్నాయి. ఆర్‌బీఐ అనుమతులు, నిబంధనల మేరకే మైక్రో రుణాల మంజూరు ప్రక్రియను నిర్వహిస్తున్నామంటూ మైక్రోఫైనాన్స్‌ల ఏజెంట్లు పట్టణాలలోని బస్తీలు, గ్రామాల్లో ఇల్లిల్లు తిరుగుతున్నారు. 10మందితో సంఘాలు ఏర్పాటు చేయిం చి రుణ మంజూరు తంతును పూర్తిచేసి వారంవారం రుణ వాయిదాలను వసూలు చేస్తున్నారు. మొదటి విడతగా ఒక్కో సభ్యురాలికి రూ.30వేల మైక్రోరుణం మంజూరు చేస్తూ క్రమేపీ రుణ పరపతిని పెంచుతున్నారు. అంతేకాక ఆస్తులపై మార్టిగేజీ లోన్‌లు కూడా ఇస్తున్నారు.దీంతోపలు వురు మహిళలు సంఘాలుగా ఏర్పడిన స్తోమతకు మించి మైక్రో రుణాలను స్వీకరిస్తూ చెల్లించలేక చతకిలా పడుతున్నారు. రుణ వాయిదా చెల్లించే రోజున ఇంటికి తాళం పెట్టి వెళ్తున్న సందర్భాలు, ఫోన్‌లో అందుబాటులోఉండని పరిస్థితులు పెరుగుతున్నాయి. దీంతో సంఘం మిగతా సభ్యులు, మైక్రో ఫైనాన్స్ ప్రతినిధులు సభ్యురాళ్ల ఇంటి ముందు గొడవలు చేస్తున్నారు. గతంలో రుణగ్రహితలు అయిన సభ్యురాళ్లు మరణిస్తే రుణచెల్లింపు జరిపే వరకు అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకున్న పరిస్థితులు ఉండేవి. మహిళలతో పాటు పురుషులు కూడా సంఘాలుగా ఏర్పడి మైక్రోరుణాలు పొందుతుండటంతో ఆయా కుటుంబాలపై ఆర్థికభారం మరింత పెరుగుతోంది. ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో లింకేజీ రుణాల బకాయిలు పెరగడంతో పాటు పలువురు మహిళల జీవితాల్లో మైక్రో రుణాలు తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు వీని మీద ఆంక్షలు విధించాలి. ●

# పాదచారుల భద్రత అభివృద్ధికి సంకేతం



డాక్టర్ ఎ. భాగ్యరాజ్

ఒక దేశం, ఒక నాగరిక సమాజం, ఒక నగరం ఎంత వెడల్పైన రోడ్లు కలిగి ఉందో కాదు, పాదచారులు ఎంత సురక్షితంగా, గౌరవంగా నడవగలుగుతున్నారో అదే నిజమైన అభివృద్ధికి కొలమానం. దానిలో భాగంగా పాదచారులభద్రత అనేది ఒక అభివృద్ధి చెందిన దేశానికి అత్యంత ముఖ్యమైన ప్రమాణాల్లో ఒకటి. రహదారులు కేవలం వాహనాల కోసం కాదు, నడిచే ప్రజల కోసం కూడా సమానంగా ఉండాలి. సుప్రీంకోర్టు కూడా సురక్షితమైన ఫుట్పాత్పై నడవడం అనేది జీవించే హక్కు (ఆర్టికల్ 21)లో భాగమని పేర్కొంటూ కేంద్ర, రాష్ట్రాలు పాదచారుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పాదచారుల మార్గం లేని ప్రాంతంలో పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తుండగా ట్యాంకర్ ఢీకొని మరణించిన ఐదేళ్ల బాలుడికి సంబంధించిన ఒక కేసులో జూన్ 19, 2026 న తీర్పు నుండి ఉద్భవించింది. ఆగస్టు 3న, 2026, జస్టిస్ పి.ఎస్. నరసింహా, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం, అదనపు సొలిసిటర్‌జనరల్ ఆదేశాలను పాటించేలా చూడాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఒక ఉత్తర్వు జారీచేసింది. ఆక్రమణలకు గురికాని, పూర్తిగా వేరుచేసిన స్థలాన్ని ప్రతి రహదారి ప్రక్కన పాదచారుల కోసం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. రహదారి ఉందంటే పాదచారుల నడకదారి కూడా అందులో ఉన్నట్టే కదా, దీనికోసం పెద్దఎత్తున డబ్బులు ఖర్చుపెట్టి, భారీగా నిర్మాణాలు ఏమి చేయనక్కర్లేదు కదా, రహదారి నుంచి నడకస్థలాన్ని వేరుచేసే ఏర్పాటు ఉంటేసరిపోతుంది, ఆ స్థలం దురాక్రమణకు గురి కాలేదని చెప్పడానికి చిన్న తాడు అక్కడ కట్టినా సరిపోతుంది కదా అని బెంచ్ (జస్టిస్‌పి.ఎస్. నరసింహా,జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం) వ్యాఖ్యానించడం శుభపరిణామం. పాదచారులు కదిలేవాహనాల మధ్య చిక్కుకుపోతామనే భయం లేకుండా నిర్భయంగా నడిచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో పట్టణాభివృద్ధి విభాగాలు, మునిసిపల్ కార్పొరేషన్లు,మునిసిపాలిటీలు,పంచాయతీల యంత్రాంగాలదే బాధ్యత అని,బాధితులకు ఈ వ్యవస్థల నుంచి పరిహారం కోరే పూర్తి హక్కు ఉందని స్పష్టం చేసింది. పాదచారుల మార్గాలపై నడిచే ప్రాథమిక హక్కు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు,వ్యక్తిగత స్వేచ్ఛ) ఆర్టికల్ 19(1)(డి) (భారతదేశ భూభాగం అంతటా స్వేచ్ఛగాసంచరించే హక్కు) లో అంతర్లీనంగా ఉంది.నడవడం అనేది ఈ స్వేచ్ఛలలో అంతర్భాగం కాబట్టి, ఈ హక్కు ఆర్టికల్ 19(1)(ఎ) (భావ ప్రకటనా స్వేచ్ఛ), ఆర్టికల్ 19(1)(బి) (సమావేశం),ఆర్టికల్ 19(1)(సి) (సంఘం ఏర్పాటు) అంశాలను కూడా తనలో ఇముడ్చుకుంది అని వెలువరించింది. ఈ తీర్పు పట్టణాభివృద్ధి సంస్థలు, పురపాలక సంఘాలు,పురపాలక సంఘాలు పంచాయతీలపై పాదచారుల మౌలిక సదుపాయాలను



సృష్టించడం, నిర్వహించడం పరిరక్షించడం అనే అనుబంధ బాధ్యతను విధిస్తుంది. పాదచారుల హక్కులను పరిరక్షించడానికి, జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి ఒక నిర్దిష్ట చట్టాన్ని రూపొందించాలని, అలాగే ఒక నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని కోరింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాదాచారుల భద్రత, సార్వత్రిక ప్రాప్యత పాలసీ2026 అనే విధానంతో రోడ్లపై నడిచే ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులను రక్షించడానికి వారి భద్రతను నిర్ధారించడానికి తీసుకువచ్చిన ఒక చారిత్రాత్మక పాలసీకి ఆమోదం తెలిపింది. ఈ పాలసీ ముఖ్య ప్రాముఖ్యత, ఉద్దేశాలు భారతదేశంలో ఏటా వేలాది మంది పాదాచారులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పాలసీ ద్వారా వాహనదారుల కంటే రోడ్డుపై నడిచే వారికే మొదటి ప్రాధాన్యత లభిస్తుంది.రోడ్డు ప్రమాదాల నివారణ భద్రతకు ప్రాధాన్యతనిస్తుంది. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడానికి రోడ్లపై శాస్త్రీయంగా భద్రతా తనిఖీలు నిర్వహిస్తారు. ఆక్రమణలు లేని ఫుట్పాత్లు స్పష్టమైన విభజనకు అవకాశముంటుంది. ఫుట్పాత్లను ఆక్రమించి దుకాణాలు పెట్టడం, వాహనాలు పార్కింగ్ చేయడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటారు. నడిచే దారి ఎల్లప్పుడూ ఖాళీగా ఉండేలా చూస్తారు.ఈ పాలసీ కేవలం సాధారణ ప్రజలకే కాకుండా దివ్యాంగులు, వృద్ధులు గర్భిణీ స్త్రీలకు కూడా సురక్షితంగా నడిచేలా అందరికీ వీలు కల్పిస్తుంది. ఫుట్పాత్లపై వీల్చైర్లు వెళ్లేందుకు వీలుగా రాంప్స్, అంధులు నడవడానికి వీలుగా స్పర్శ మార్గాలు ఏర్పాటు చేయబడతాయి. స్థానిక మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలు తమ పరిధిలోని ఫుట్పాత్లను సంరక్షించాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగితే పౌరులు కోర్టుల ద్వారా నష్టపరిహారం పొందే హక్కు ఉంటుంది. కాబట్టి నిఘా, జవాబుదారీతనం అధికారులదే బాధ్యత. పాదాచారుల మార్గాల్లో భద్రత కోసం నిఘా కెమెరాలు, స్మార్ట్ క్రాసింగ్లను ఏర్పాటు చేస్తారు. సురక్షితమైన దారులు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలు స్వల్ప దూరాలకు నడవడానికి ఇష్టపడతారు. నడక పెరగడం వల్ల వాహనాల వాడకం తగ్గి, పట్టణాలలో వాయుకాలుష్యం,ట్రాఫిక్ జాములు తగ్గుతాయి. మొత్తంగా చెప్పాలంటే, పాదాచారుల పాలసీ 2026 అనేది కేవలం రోడ్ల నిర్మాణానికి సంబంధించింది కాదు, ఇది నగరాలను యంత్రాల కోసం కాకుండా, మనుషుల కోసంమార్చే ఒక గొప్ప సంస్కరణ. నియమాలు ఉన్నప్పటికీ ప్రజలు, స్థానిక సంస్థలు, ట్రాఫిక్‌శాఖ,రోడ్లుభవనాల శాఖల మధ్య సమన్వయం లోపం ఎక్కువగా, అమలు లోపం ఉంది.యూరప్లో చాలాదేశాలు (నెదర్లాండ్స్,డెన్మార్క్, జర్మనీ, స్వీడన్, ఫ్రాన్స్ మొదలైనవి) పాదచారులకు ప్రాధాన్యం ఇచ్చే నగర రూపకల్పనను అనుసరిస్తున్నాయి. మన దేశంలో కూడా ప్రతి 200-300 మీటర్లకు సురక్షిత క్రాసింగ్ ఏర్పాటు చేయాలి. పాఠశాలలు, ఆసుపత్రుల వద్ద వేగ పరిమితిని 30కి.మీ./గం.కు పరిమితంచేయాలి. పట్టణ స్థానిక సంస్థల పనితీరును 'పాదచారుల భద్రత' ఆధారంగా కూడా అంచనా వేయాలి. ప్రతి కొంత దూరానికి బెంచీలు, నీడకోసం చెట్లవరుస,తగిన వీధి దీపాలు, వర్షపు నీరునిల్వ కాకుండా సరైన డ్రైనేజీ, పాదచారులు దాటే చోటఎత్తుగా నిర్మించిన క్రాస్వాక్లు,పిల్లల స్ట్రోలర్లు, వృద్ధులు, దివ్యాంగులు సులభంగా ప్రయాణించేలా అడ్డంకులు లేకుండా నిర్మాణం, సైకిల్ ట్రాక్ వేరుఉండే సౌకర్యాలు ఉండాలి. ●

# 'జెన్‌జెడ్'ను తప్పుదారిపట్టించారు..



## నీట్ లీకేజీలపై తొలిసారి గళం విప్పిన కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్రప్రధాన్

## భారత్‌ను 'విశ్వగురు'గా నిలబెట్టేది యువతే

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన అంశంపై సీనియర్ బీజేపీ నాయకుడు, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ ఎట్టకేలకు నోరు విప్పారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో జరిగిన నిరసనల సందర్భంగా జెన్‌జెడ్ యువతను కొందరు తప్పుదోవ పట్టించారని, ఆ పరిణామాల వల్లే తాను పదవిని వీడాల్సి వచ్చిందని వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవడంతో గతనెల 25న ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజీనామా తర్వాత దాదాపు రెండువారాలకు జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన తొలిసారిగా ఈ బహిరంగ ప్రకటన చేశారు. జెన్‌జెడ్ యువత మన పిల్లలలాంటి వారని, కొందరు వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రధాన్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో ఏటా కనీసం రెండు కోట్ల మంది పిల్లలు జన్మిస్తున్నారని, గత పదేళ్లలో 20 కోట్ల మంది పురుడు పోసుకున్నారని పేర్కొన్నారు. వారి అంచనాలు, ఆకాంక్షలు వేరని, రాబోయే రోజుల్లో వారే భారత్‌ను విశ్వగురుగా నిలబెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తనకు పదవి ముఖ్యంకాదని, అందుకే స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీని కలిసి రాజీనామా సమర్పించినట్లు వివరించారు. మరొక సభలో మాట్లాడుతూ ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్‌పై ధర్మేంద్ర ప్రధాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలు, ధర్మేంద్ర ప్రధాన్ గోబ్యాక్‌నినాదాలకు తాను భయపడేది లేదని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు వద్ద బీజేడీ యువజన విభాగం చేసిన ఆందోళనలను ప్రస్తా విస్తూ తాను ఒక రైతు బిడ్డనని, వెనక్కి పొమ్మన్నా మళ్లీ వస్తూనే ఉంటానని వ్యాఖ్యానించారు. నవీన్ పట్నాయక్ యువతను రెచ్చగొట్టి తనపైకి పంపుతున్నారని, తనను ఒడిశా ప్రజలకు ఒక అవమానంగా, చెడు వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎప్పుడైనా ఒడిశా ప్రజలు తలదించుకునే పనిచేశానా అని సభను ప్రశ్నించగా, ప్రజలనుంచి లేదని పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. రాష్ట్రానికి పెద్దగా గౌరవం తేలేకపోయినా, తన ప్రవర్తనతో ఎప్పుడూ ఒడిశా ప్రతిష్టను దిగజార్చలేదని ప్రధాన్ స్పష్టం చేశారు. పన్నెండేళ్ల క్రితం జగన్నాథ స్వామి, సంబల్‌పూర్ ఆరాధ్య దైవం మా సమలేశ్వరి దేవి ఆశీస్సులతోనే తాను కేంద్ర మంత్రిని అయ్యానని గుర్తు చేసుకున్నారు. విచిత్ర మేమిటంటే బీజేడీ ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ లీడర్ ప్రసన్న ఆచార్య సమక్షంలోనే ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## వెస్ట్‌బ్యాంక్‌తో పాలస్తీనా ఏర్పాటును తిరస్కరించిన నెతన్యాహు



**జెరూసలెం, ఆగస్టు 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తిరస్కరించారు. ఆయన గాజా లేదా వెస్ట్ బ్యాంక్‌తో పాలస్తీనా దేశం ఏర్పాటును తోసిపుచ్చారు. 15 అంశాల గాజా పీస్ ప్లాన్‌ను ఆదివారం తిరస్కరించారు. ట్రంపునకు ఇది ఎదురుదెబ్బగా మారింది. తాను ప్రధానిగా ఉన్నంత కాలం, పాలస్తీనా దేశం ఉండదు అని నెతన్యాహూ అన్నట్లు ఇజ్రాయిల్ మీడియా నివేదించింది. గాజా ప్లాన్‌ను తిరస్కరించడంతో పాటు హమాస్ పూర్తిగా నిరాయుధమయ్యే వరకు ఇజ్రాయిల్ గాజా నుంచి వెళ్లేదే లేదని తేల్చి చెప్పారు. ఈ రోడ్ మ్యాప్‌ను ట్రంప్ కీలక మైలురాయి, గొప్ప పురోగతిగా అభివర్ణించిన వారం రోజుల తర్వాత నెతన్యాహూ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఇదిలా ఉంటే, ఈ ప్రణాళికకు హమాస్ అంగీకరించింది. శాంతి ప్రణాళిక అమలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని హమాస్ కోరింది. ఈ ప్రణాళికలో భాగంగా తదుపరి దశకు వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ట్రంప్ బోర్డ్ ఆఫ్ పీస్‌కు హమాస్ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు, ఇజ్రాయిల్ తీరుపై ముస్లిం దేశాలు విమర్శలు చేస్తున్నాయి. వారం రోజుల క్రితం యూఏఈతో పాటు ఏడు ముస్లిం దేశాలు సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ సైనిక చర్యను తీవ్రంగా విమర్శించాయి. ఇజ్రాయిల్ చర్యలు గాజా యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ రూపొందించిన శాంతి ప్రణాళికకు విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి.

# జేడీ వాన్స్‌తో ప్రధాని మోడీ ఫోన్ చర్చలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారత్‌అమెరికా మధ్య ఉన్న సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా జేడీ వాన్స్, ఆయన భార్య ఉషా వాన్స్‌కు ఇటీవల కుమారుడు జన్మించినందుకు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. వాన్స్ కుటుంబ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఫోన్ సంభాషణ అనంతరం ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికఎక్స్‌లో స్పందించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నుంచి ఫోన్ కాల్ అందుకుంది. భారత్‌అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కీలక రంగాల్లో మరింత లోతుగా తీసుకెళ్లే మార్గాలపై చర్చించాం. ఆయనకు, సెకండ్ లేడీ ఉషా వాన్స్‌కు కుమారుడు జన్మించిన సందర్భంగా హృదయ పూర్వక అభినందనలు తెలియజేశాను. మొత్తం కుటుంబానికి శుభాకాంక్షలని మోడీ పేర్కొన్నారు. ఈ ఫోన్ సంభాషణకు కొద్ది రోజుల ముందు భారత్‌లో విదేశీ విరాళాలకు సంబంధించిన ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ చట్టంలో ప్రతిపాదిత సవరణలపై అమెరికా చట్టసభ్యుడు రైలీ మూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌జీవోలు, ట్రస్టులు, విద్యా సంస్థలు, మత సంస్థలు విదేశాల నుంచి స్వీకరించే విరాళాలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు తీసుకురావడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మార్పులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతిపాదిత మార్పుల ద్వారా భారత ప్రభుత్వం చర్చిలు, మతపరమైన స్వచ్ఛంద సంస్థలపై నియంత్రణ సాధించే అవకాశం ఉందని రైలీ మూర్ ఆరోపించారు. దీనిని క్రైస్తవులపై స్పష్ట మైన దాడిగా అభివర్ణించారు. మరోవైపు భారత్‌అమెరికా ఆర్థిక సంబంధాలు కూడా కీలక దశలో ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించే రష్యా ఆంక్షల బిల్లును అమెరికా సెనేట్ శుక్రవారం ఆమోదిం చింది. ఈ బిల్లులో రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఉంది. రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ కూడా ఉండటంతో ఈ పరిణామం న్యూఢిల్లీకి ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ బిల్లు చట్టంగా మారాలంటే అమెరికా ప్రతినిధుల సభలో కూడా ఆమోదం పొందాల్సి ఉంది. ఇదే సమయంలో భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి.

## పాక్‌లో లష్కర్ కమాండర్ అనుమానాస్పద మృతి

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** పాకిస్తాన్‌లో ఐఎస్ఐ ప్రేరేపిత ఉగ్రవాదుల హత్యలు, అనుమానాస్పద మరణాలు కొనసాగుతూనే వున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో దారుణాలకు పాల్పడుతూ పాక్‌లో తలదాచు కుంటున్న లష్కర్ ఏ తయ్యిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ వంటి సంస్థల ఉగ్రవాదులు గడచిన నాటుగేళ్ల కాలంలో 30 మందికి పైగా హత్యకు గురవడం పాక్‌లో సంచలనం రేపింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇస్లామాబాద్‌లోని కుబా మసీదు వద్ద లష్కర్ ఓ తయ్యిబా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా వున్న జమాత్ ఉద్ దవా సీనియర్ కమాండర్ ఖారీ సయ్యిద్ అబ్దుల్ అజీజ్ వున్నట్లుండి కుప్పకూలి పోయాడు. అంతకు ముందు సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో ఇతను భోజనం చేసినట్లు సన్నిహితులు చెబుతున్నారు. కుప్పకూలగానే అజీజ్‌ను సహచరులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను చనిపోయాడు. అజీజ్ విష ప్రయోగంవల్ల మరణించి వుంటాడని అనుమానిస్తున్నారు. 30ఏళ్ల అజీజ్ ఇస్లామాబాద్‌కు చెందిన వాడుగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇతనిపై జమ్మూ కాశ్మీర్‌లో అనేక కేసులున్నాయి. కాగా జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడులకు పాల్పడే ఉగ్రవాదుల కు అజీజ్ అటు ఆక్రమిత పాక్ ఇటు కాశ్మీర్‌లోని అటవీ ప్రాంతంలో షెల్టర్లు అందించే వాడు. తప్పుడు పత్రాలతో ఉగ్రవాదులను భారత్‌లో పంపించేవాడు. ఇందుకోసం నీలం వ్యాలీ, ముజఫరాబాద్ మార్గాన్ని ఎంచుకునే వాడు. ఇదే సమయంలో ఎన్‌కౌంటర్లలో మరణించిన ఉగ్రవాదుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కూడా అజీజ్ అందించేవాడు.



## రాహుల్ ప్రయాగరాజ్ పర్యటనపై కేంద్రమంత్రి ఫైర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రయాగ్‌రాజ్ పర్యటనపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ ప్రయాగ్‌రాజ్ వెళ్లే బదులు రాంచీకి వెళ్లి ఉండాల్సిందని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. రాహుల్ ఒపెద్ద తప్పు చేశారని, అయితే మనుషులన్నాక తప్పులు చేయడం సహజమేనంటూ వ్యాఖ్యానించారు. అంతకుముందు మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంపై సోషల్ మీడియాలో వీరిద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్)తో మహిళా రిజర్వేషన్లను ముడిపెట్టడంపై కేంద్రం, విపక్షాల మధ్య నడుస్తున్న వివాదం నేపథ్యంలో ఈ చర్చ జరిగింది. మహిళల భావ ప్రకటన స్వేచ్ఛపై రాహుల్ గాంధీ షేర్‌చేసిన ఒక వీడియోపై రిజిజు స్పందిస్తూ, ఆయన మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరడంతో ఈ రగడ మొదలైంది. దీనికి ప్రతిగా, అసలు మహిళా రిజర్వేషన్ చట్టాన్ని నియోజకవర్గాల పునర్విభజనతో ఎందుకు లంకె పెడుతున్నారంటూ రాహుల్ గాంధీ నిలదీశారు. ప్రయాగ్‌రాజ్ చేరుకున్న రాహుల్ గాంధీ అక్కడి ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వంపై, దాని విధానాలపై విరుచుకుపడ్డారు. కేంద్రం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే దేశంలో నేడు యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆరోపించారు. తన ప్రసంగంలో ప్రధానంగా మూడు అంశాలపై మాట్లాడాలనుకుంటున్నట్లు రాహుల్ తెలిపారు. అవి - బాధ, డేటా, సంపద. యువత పడుతున్న బాధలు, వారు ఉత్పత్తి చేస్తున్న డేటా గురించి తాను మాట్లాడుతున్నానని, అయితే అసలు సమస్య ఏమిటంటే.. యువతకు చెందాల్సిన సంపద ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల కారణంగా వారికి అందడం లేదని అన్నారు.



## పేపర్ లీక్ ఆందోళనపై దిగివచ్చిన జార్ఖండ్ సర్కార్

### పరీక్షల రద్దుకు సుముఖమని తెలిపిన మంత్రి

**రాంచి, ఆగస్టు 9:** పేపర్ లీక్‌పై విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి జార్ఖండ్ సర్కార్ దిగొచ్చింది. సోమవారం జార్ఖండ్ అసెంబ్లీ ముట్టడికి విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం మరోసారి విద్యార్థులు, ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు కొలిక్కి రాలేదు. అయినప్పటికీ జెపిఎస్‌సి జెఎస్ఎస్‌సిజడ్ పరీక్షల రద్దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, సీబీఐ దర్యాప్తుపై హామీ ఇచ్చేంత వరకు రాజీ ప్రసక్తే లేదని విద్యార్థి నాయకులు తేల్చి చెప్పారు. విద్యార్థులతో జరిగిన చర్చల నేపథ్యంలో ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 14వ జెపిఎస్‌సి పరీక్షను రద్దు చేయడం, పరీక్షల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై దర్యాప్తు చేయడం, నియామక ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావడం వంటి ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఈ ప్రతిపాదనల్ని విద్యార్థులు పట్టించుకోవడం లేదు. సీబీఐ దర్యాప్తు లేకుండా చేసే ఇతర దర్యాప్తులు చేయడం, సీజీఎల్ పరీక్షను రద్దు చేయకపోవడం తమ ప్రధాన సమస్యల్ని పరిష్కరించవని విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యార్థులు చేస్తు డిమాండ్లలో 99 శాతం అంశాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మంత్రి సుదివ్య కుమార్ సోను తెలిపారు. మూడు రోజుల చర్చల తర్వాత 14వ జెపిఎస్‌సిపరీక్షతో పాటు 202325 బ్యాక్‌లాగ్ నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై రెండు దిశల్లో దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రిమినల్ అంశాలను రాష్ట్ర సీఐడీ దర్యాప్తు చేస్తుందని, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ దర్యాప్తు కోరుతామని మంత్రి తెలిపారు. నిందితులపై 90 రోజుల్లో ఛార్జిషీట్ దాఖలు చేసేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. భవిష్యత్ నియామకాలపై నిపుణులతో కూడిన కమిటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది.



## చైనాను వణికిస్తున్న 'డాల్ఫిన్' తుఫాన్

### షాంఘైలో జనజీవనం అస్తవ్యస్తం

### 1,300కు పైగా విమాన సర్వీసులు రద్దు

**బీజింగ్, ఆగస్టు 9:** పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన అత్యంత తీవ్రమైన 'డాల్ఫిన్' తుఫాన్ చైనా తూర్పు తీరాన్ని అతలాకుతలం చేస్తోంది. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులతో దూసుకొస్తున్న ఈ తుపాను దెబ్బకు దేశ వాణిజ్య రాజధాని షాంఘై సహా పలు ప్రధాన నగరాలు స్తంభించిపోయాయి. చైనా ప్రభుత్వం ఇప్పటికే బ్లూ అలర్ట్ జారీ చేసి, సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తుఫాన్ ప్రభావం షాంఘై, జెజియాంగ్ ప్రావిన్సులపై తీవ్రంగా పడింది. ముందుజాగ్రత్త చర్యగా షాంఘైలోని హాంకియావో, పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆదివారం నాటికి 1,300కు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. ఇది మొత్తం రాకపోకల్లో 60 శాతానికి సమానం. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు, జెజియాంగ్, షాంఘై ఓడరేవులను పూర్తిగా ఖాళీ చేయించడంతో పాటు యాంగ్జీ నదీ పరీవాహక ప్రాంతంలో నడిచే పలు రైళ్లు, పడవల సేవలను కూడా నిలిపివేశారు. భారీ వర్షాలు, వరదల ముప్పు పొంచి ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. జెజియాంగ్ ప్రావిన్స్‌లోని తైజౌ నగరం, షాంఘై పరిసర లోతట్టు ప్రాంతాల నుంచి సుమారు 3.90 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తీర ప్రాంతాల్లోని పాఠశాలలు, వ్యాపార సంస్థలు, పర్యాటక కేంద్రాలకు సెలవులు ప్రకటించారు. చైనా తీరాన్ని తాకడానికి ముందే ఈ డాల్ఫిన్ తుఫాన్ జపాన్‌లోని ఒకినావా దీవులు, తైవాన్ ఉత్తర ప్రాంతాల్లో కుండపోత వర్షాలతో బీభత్సం సృష్టించింది. రానున్న రోజుల్లో ప్రభావిత ప్రాంతాల్లో 200 నుంచి 400 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఈ దశాబ్దంలోనే ఇది అత్యంత ప్రమాదకరమైన తుపానుల్లో ఒకటిగా పరిణమించే ప్రమాదం ఉందని చైనా వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

### పెళ్లయిన ఏడేళ్లలోపు వేధింపులతో భార్య మరణిస్తే

## అది వరకట్న హత్యే: అలహాబాద్ హైకోర్టు తీర్పు

**లక్నో, ఆగస్టు 9:** వివాహితల అనుమానాస్పద మరణాలు, వరకట్న వేధింపుల కేసులకు సంబంధించి అలహాబాద్ హైకోర్టు అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. పెళ్లయిన ఏడేళ్లలోపు ఎవరైనా మహిళ అత్తగారింట్లో అసహజ రీతిలో మరణిస్తే ఆమెపై కట్నం కోసం వేధింపులు జరిగినట్లు ఆధారాలు ఉన్నట్లయితే దానిని 'వరకట్న హత్య'గానే పరిగణించవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇలాంటి తీవ్రమైన కేసుల్లో సదరు మహిళ మృతికి భర్త లేదా అత్తింటి వారి ప్రమేయానికి సంబంధించి ప్రత్యక్ష సాక్ష్యాలు గానీ, ఆధారాలు గానీ ప్రత్యేకంగా చూపించాల్సిన అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



వరకట్న హత్యకు సంబంధించిన ఒక అప్పీలు పిటిషన్‌పై విచారణ జరుపుతున్న సందర్భంగా అలహాబాద్ హైకోర్టు ఈ కీలకమైన విషయాలను వెల్లడించింది. 2010లో ఓ మహిళ అత్తగారింట్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించింది. అయితే అది పూర్తిగా వరకట్న హత్యేనంటూ పుట్టింటి వాళ్లు ఆమె భర్త సందీప్ సింగ్ హోరాపై కేసు పెట్టారు. ఈక్రమంలోనే విచారణ జరిపిన దిగువ కోర్టు అతడిని దోషిగా తేలుస్తూ 2018లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిని సవాలు చేస్తూ అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాడు. అయితే బాధితురాలు తన అత్తగారింట్లోనే అనుమానాస్పద స్థితిలో అసహజ మరణానికి గురైందని, ఆమె మృతి వెనుక వరకట్న వేధింపుల కోణం ఉందని హైకోర్టు కూడా ప్రాథమికంగా అంగీకరించింది. అయితే ఈ కేసులో దిగువ కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షపై హైకోర్టు జడ్జి కీలకమైన అభిప్రా యాన్ని వ్యక్తం చేశారు. దోషిగా తేలిన భర్త సందీప్ సింగ్ హోరాకు ఏకంగా యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించడానికి గల బలమైన కారణాలను లేదా ప్రత్యేకమైన పరిస్థితులను దిగువ కోర్టు తన తీర్పులో సహేతుకంగా పేర్కొన లేకపోయిందని జడ్జి అభిప్రాయపడ్డారు. చట్ట ప్రకారం అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే జీవిత ఖైదు లేదా యావజ్జీవ కఠిన కారాగారాన్ని విధించాల్సి ఉంటుందని కోర్టు తెలిపింది. అం తేకాకుండా ఈ ఘటన జరిగి 16యేళ్లు కావడం, నిందితుడి వయస్సు ప్రస్తుతం దాదాపు 40 యేళ్లకు చేరడం, గడచిన 7యేళ్లకు పైగా అతడు జైలులోనే గడపడం, అలాగే అతడి ప్రవర్తనపై ఎలాంటి ప్రతికూల నివేదికలు లేకపోవడాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలోనే హైకోర్టు నిందితుడి జీవిత ఖైదు ను 10యేళ్లకు తగ్గిస్తూ ఇప్పటికే అనుభవించిన జైలు కాలాన్ని అందులో మినహాయించాలని ఆదే శించింది. అయితే ఐపిసి సెక్షన్లు 498ఎ, 406, వరకట్న నిరోధక చట్టంలోని సెక్షన్లు 3, 4 కింద అతడిపై ఉన్న దోష నిర్ధారణను హైకోర్టు మార్చ కుండా యథాతథంగా ఉంచింది.

# బెయిల్ కోసం క్షుద్రపూజలు

### ఛత్తీస్‌గఢ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఫొటోతో 'తంత్ర పూజ'

### నిందితుడు అరెస్ట్, ఫొటో, నిమ్మకాయలు, కుంకుమ, చేప స్వాధీనం



**రాయ్‌పూర్, ఆగస్టు 9:** ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఫొటోను ఉపయోగించి 'తంత్ర పూజ' నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని బిలాస్‌పూర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన బంధువుకు బెయిల్ ఇప్పించే ప్రయత్నంలో భాగంగా అతను ఈ పని చేసినట్లు అధికారులు తెలిపారు. శనివారం మధ్య రాత్రి వేళ సిపాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవ్రి గ్రామంలోని శ్మశానవాటికలో ఈ ఘటన జరిగింది. నిందితుడిని రిషికేశ్ కుమార్‌గా గుర్తించారు. అతను మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి ఈ పూజ నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి వేళ నలుగురు వ్యక్తులు అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడటం గమనించిన గ్రామస్తులు వారిని నిలదీశారు. ఆ తర్వాత ముగ్గురు వ్యక్తులు పారిపోగా, కుమార్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు బిలాస్‌పూర్ ఎస్పీ రజనీష్ సింగ్ తెలిపారు. విచారణలో, కత్తిపోట్ల కేసులో తన బంధువు ప్రియాన్షు బోలే మరికొందరితో కలిసి పోలీసుల అదుపులో ఉన్నాడని నిందితుడు పోలీసులకు చెప్పాడు. విచారణ కోసం కుమార్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత, పోలీ సులు శ్మశాన వాటిక నుండి పూజకు సంబంధించిన కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో చేప, నిమ్మకాయలు, కుంకుమ, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేష్ సిన్హా, మరో ఇద్దరు వ్యక్తుల ఫోటోలు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఫోటోలలో ఒకటి ప్రియాన్షు బోలేది కాగా, మరొకటి కత్తిపోట్ల కేసులోని బాధి తుడిది. శ్మశానవాటికకు వెళ్లే ముందు, బెయిల్ పొందడానికి పూజ చేయవచ్చని చెప్పిన ఒక 'తంత్రిక్ష' వీడియోను తాము చూశామని కుమార్ పోలీసులకు చెప్పాడు. ఈ వ్యవహారంలో తదుపరి విచారణ జరుగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.

### రూ.40,185 కోట్ల పిఎంఎల్ఎ కేసులో

## ఆర్‌కామ్‌పై ఇడి చార్జిషీట్ దాఖలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద రిలయన్స్ కమ్యూ నికేషన్స్ లిమిటెడ్‌పై ఇడి అనుబంధ చార్జిషీట్‌ను ప్రత్యేక కోర్టులో దాఖలు చేసినట్లు ఆదివారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో పేర్కొంది. మార్చి 27నాటి మొదటి ప్రాసిక్యూషన్ ఫిర్యాదుకు కొనసాగింపుగా శనివారం ఈ అనుబంధ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును దాఖలు చేశారు. రిల యన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్), రిలయన్స్ టెలికాం లిమిటెడ్ (ఆర్‌టిఎల్), గౌతమ్ భైలాల్ దోషి, సతీష్ సేథ్, అమితాబ్ ఝున్‌ఝున్‌వాలా, మరియు ఇతరులను పిఎంఎల్ఎ, 2002లోని సెక్షన్ 4 కింద శిక్షార్హమైన సెక్షన్ 3, సెక్షన్ 3తో కలిపి సెక్షన్ 70 కింద నేరాలకు నిందితులుగా చేర్చినట్లు ఆ ప్రకటన తెలిపింది. నేర కార్యకలాపాల ద్వారా వచ్చిన సొమ్మును రూ. 40,185.55కోట్లుగా నిర్ధారించారు. ఇది, రుణ గ్రహీత సంస్థలు కన్సార్టియం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బాండ్‌హోల్డర్లకు చెల్లించడంలో విఫలమైన మొత్తం బకాయి. నిధుల సమీకరణ, వినియోగం, దాచిపెట్టడం, ప్రదర్శించడంలో నిందితుల విభిన్న పాత్రలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో భాగంగా, 1 బిలియన్ డాలర్ల ఫారిన్ కరెన్సీ కన్వర్టిబుల్ బాండ్ల (ఎఫ్‌సిసిబి) ద్వారా వచ్చిన సొమ్మును తుది వినియోగానికి సంబంధించి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం కూడా ఉంది.

న్యాయ నిర్ణయాధికార సంస్థ జప్తు చేసి, ధ్రువీకరించిన రూ. 8,078.06 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయాలని కోరారు. ఈ ఆస్తులలో న్యూఢిల్లీ, నవీ ముంబై, భువనేశ్వర్, చెన్నై, పుణెలలోని లీజు, స్థిరాస్తులు ఉన్నాయి.

# సంక్షిప్త వార్తలు

## సౌదీ అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి




**రియాద్, ఆగస్టు 9:** సౌదీ అరేబియాలోని జజాన్‌లో ఉన్న అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. ఈ దాడికి తామే కారణమని హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడి యర్ జనరల్ యహ్యా సరీ తెలిపారు. తమ గగనతలంలో సౌదీడ్రోన్ల చొరబాటుకు ప్రతిస్పం దనగానే దాడి చేసినట్లు వెల్లడించారు. సౌదీ 'మినిస్ట్రీ ఆఫ్ ఎనర్జీ' కూడా ఆదివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగినట్లు ధ్రువీకరించింది. అయితే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది.

## మమత కారుపై రాళ్లు రువ్విన నిరసనకారులు



**కోల్‌కత్తా, ఆగస్టు 9:** పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రికి నిరసనసెగ ఎదురైంది. ఆమె ప్రయాణిస్తున్న కారుపై ఆందోళనకారులు దాడిచేశారు. తమపై గుర్తుతెలియని దుండగులు ఇటుకలు, రాళ్లతో దాడిచేశారని, ఈ దాడిలో ప్రాణాలు పోయేవే అని మమత ఆరోపించారు. ఈ దాడిని రాష్ట్ర బీజేపీ ఖండించింది. ఈ హింసాకాండలో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. పోలీస్ కస్టడీలో టీఎంసీ పార్టీ కార్యకర్త మరణించాడని ఆ పార్టీ బెంగాల్‌లో తీవ్ర నిరసన తెలుపుతోంది.

## బారామతి ఎయిర్‌ఫీల్డ్‌లోనే కుప్పకూలిన మరో విమానం



**బారామతి, ఆగస్టు 9:** మహారాష్ట్ర బారామతి ఎయిర్ ఫీల్డ్‌లో మరో విమానం కుప్పకూలింది. ఆది వారం ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన ట్రైనింగ్ విమానం రన్‌వే దాటి వెళ్లింది. మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్య మంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదం జరిగిన 7 నెలల తర్వాత మరో ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనలో విమానం దెబ్బతిన్నప్పటికీ, పైలట్ సురక్షితంగా బయట పడ్డాడు. ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## బియ్యం స్కాంలో బిజెపి సర్కార్: సౌరభ్ భరద్వాజ్




**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. రూ.22,000 కోట్ల విలువైన రైస్ స్కాంకు బీజేపీ ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఆదివారం దీనికి సంబంధించిన ఆరోపణలు చేశారు. పేదప్రజలకు అందించాల్సిన బియ్యాన్ని, దారి మళ్లించి, భారీ స్కాంకు బీజేపీ సర్కార్ తెరతీసిందని విమర్శించారు.

## నకిలీ గుర్తింపులతో 25 పెళ్లిళ్లు: బిజెపి ఎమ్మెల్యే ఆక్రోశం



**లక్నో, ఆగస్టు 9:** నకిలీ గుర్తింపులతో 25 వివాహాలు చేసుకుని అనేక మంది మహిళలను మోసం చేసిన ఒక వ్యక్తికి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేసేలా తమను మోసగించారని బీజేపీ ఎమ్మెల్యే ఆరోపించారు. ఆయన ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. కేసు నమోదు చేయడంతో పాటు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని సేవత నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే జ్ఞాన్ తివారీ ఆగస్ట్ 6న సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. 2024లో మిశ్రిఖ్‌లోని చంద్రవాల్ ప్రాంతానికి చెందిన అనుజ్ త్రివేది కుమారుడు ప్రఖర్ త్రివేదితో తన కుమార్తె ప్రజ్ఞ పెళ్లి జరిగినట్లు తెలిపారు.



## ఉధృతమవుతున్న కెనడా కార్చిచ్చు

**టొరంటో, ఆగస్టు 9:** కెనడాలో కార్చిచ్చు విజృంభిస్తోంది. దీంతో కెనడా ప్రభుత్వం బ్రిటీష్ కొలంబియాలో ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ ప్రాంతంలోని 20వేల మందిని సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలివెళ్లాలని ఆదేశించింది. బాధితుల్ని రక్షించే సహాయక చర్యల్ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 100 అడుగులు ఎత్తులో మంటలు ఎగసిపడుతున్నాయి.

# ఒంగోలు కూటమిలో ముదిరిన విభేదాలు

● జనసేన నేత మాజీ మంత్రి బాలినేని, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల సవాళ్లు ● నేతల ఆరోపణలు ప్రత్యారోపణలతో ప్రకాశంలో వేడెక్కిన రాజకీయం



**ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9 ప్రభాతవార్త:** ఒంగోలు నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య రాజకీయ విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇసుక, గ్రావెల్, మైనింగ్, మద్యం వ్యాపారాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, ఎమ్మెల్యేకు వాటాలు ఉన్నాయని, రోజూ లక్షల్లో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని బాలినేని ఆరోపించగా, ఈ ఆరోపణలను దామచర్ల తీవ్రంగా ఖండించారు. తనపై చేసిన ఆరోపణలకు బాలినేని ఆధారాలు చూపాలని, అవి నిజమని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని దామచర్ల సవాల్ విసిరారు. అంతేకాకుండా తనపై వచ్చిన ఆరోపణలు నిజం కాదని కాణిపాకం వినాయకుడి వద్ద ప్రమాణం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, బాలినేని కూడా అందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. జనసేనను అడ్డుపెట్టుకుని కూటమి ప్రభుత్వంలో విభేదాలు సృష్టించేందుకు బాలినేని ప్రయత్నిస్తున్నారని, వైసిపి కోవర్టుగా వ్యవహరిస్తున్నారని దామచర్ల ఆరోపించారు. అప్పుడప్పుడు ఒంగోలుకు వచ్చి తనపై ఆరోపణలు చేసి వెళ్లడం కాకుండా ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. తన అనుచరులతో కరపత్రాలు పంపిణీ చేయించి రాజకీయంగా తన ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో బాలినేని, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డికి సంబంధించిన పలు వ్యవహారాలపై తాను మాట్లాడితే పెద్ద పుస్తకమే రాయాల్సి వస్తుందని దామచర్ల వ్యాఖ్యానించారు. మరోవైపు దామచర్ల తానే రాజు, తానే మంత్రి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని బాలినేని మండిపడ్డారు. తమ వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. తప్పు చేయని కార్యకర్తలను కాపాడు కోలేని పరిస్థితి ఉంటే తాను రాజకీయాల్లో ఉండి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ అనేక అంశాలపై ఇంతకాలం మౌనం వహించామని, అయితే తమ సహనానికి హద్దులు ఉన్నాయని బాలినేని స్పష్టం చేశారు. తమ కార్యకర్తలకు అన్యాయం జరిగితే ఇకపై చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇసుక, మైనింగ్, మద్యం వ్యాపారాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించాలని బాలినేని డిమాండ్ చేశారు. అయితే తన ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిర్గతం చేయాలని దామచర్ల ప్రతిసవాల్ చేశారు. గతంలో బాలినేని ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై తాను మాట్లాడితే అనేక అంశాలు వెలుగులోకి వస్తాయని ఆయన ఆరోపించారు. నగరంలో గంజాయి బ్యాచ్‌లు, భూ ఆక్రమణలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలపై కూడా ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. కూటమిలో భాగస్వామ్య పార్టీల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని దామచర్ల ఆరోపించగా, కూటమి ధర్మాన్ని పాటిస్తూ పరస్పర గౌరవంతో వ్యవహరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బాలినేని పేర్కొన్నారు. ఇరువురు నేతలు పరస్పరం తీవ్ర ఆరోపణలు, సవాళ్లు చేసుకోవడంతో ఒంగోలు రాజకీయాల్లో నెలకొన్న విభేదాలు రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మెల్యేపై బాలినేని చేసిన ఆరోపణలపై ప్రభుత్వం లేదా పార్టీ అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది, అదే సమయంలో దామచర్ల చేసిన ప్రతిఆరోపణలపై బాలినేని స్పందన ఎలా ఉంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. కూటమిలోని రెండు భాగస్వామ్య పార్టీల నేతల మధ్య వివాదం మరింత పెరిగితే దాని ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై పడే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.

ఇప్పటికే ఇరువర్గాల మధ్య కొనసాగుతున్న రాజకీయ విభేదాలు బహిరంగ సవాళ్లు, ప్రతివిమర్శల వరకు చేరుకోవడం కూటమి రాజకీయాల్లో చర్చకు దారితీసింది. ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో టిడిపి, జనసేన అధిష్ఠానాలు ఈ వ్యవహారంపై ఏ విధంగా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఇరువురు నేతలు తమ తమ వాదనలకు కట్టుబడి ఉండటంతో వివాదానికి ఇప్పట్లో తెరపడే పరిస్థితి కనిపించడం లేదు. కూటమి సమన్వయం దెబ్బతినకుండా పార్టీ పెద్దలు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఒంగోలులో మొదలైన ఈ వివాదం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశం కావడంతో కూటమి నేతల తదుపరి అడుగులపై ఉత్కంఠ నెలకొంది.

## సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు
# కీలక నిందితులను విచారిస్తున్న సిట్

విజయవాడ కృష్ణలంకలో సృష్టించిన సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో కీలకంగా భావిస్తున్న నిందితులను ఆధారాలతో ఎదుర్కొంటూ సిట్ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే సేకరించిన సిసి కెమెరా ఫుటేజీలు, ఫొటోలు, వీడియోలు, సాంకేతిక ఆధారాలను ముందుపెట్టి నిందితుల నుంచి వాస్తవాలను రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా మార్కాపురం నుంచి విజయవాడలోని కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు సాయికృష్ణను తరలించిన సమయంలో చోటుచేసుకున్న పరిణామాలపై సిట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మే 6న మార్కాపురం నుంచి సాయికృష్ణను కృష్ణలంక పిఎస్‌కు తీసుకొచ్చినట్లు సిట్ దర్యాప్తులో నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో సాయికృష్ణ తరలింపు సమయంలోని మార్గానికి సంబంధించిన సిసి కెమెరా ఫుటేజీలను అధికారులు సేకరించారు. అలాగే ఆ సమయంలో సాయికృష్ణకు సంబంధించిన ఫొటోలను టాస్క్‌ఫోర్స్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ తీసినట్లు కూడా సిట్ సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. సేకరించిన ఫొటోలు, వీడియో ఫుటేజీలను నిందితులకు చూపిస్తూ, ఆయా సమయాల్లో ఎవరు ఎక్కడ ఉన్నారు? మార్గమధ్యలో ఏం జరిగింది? వంటి అంశాలపై అధికారులు ప్రశ్నలు సంధిస్తున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా సిట్ అధికారులు ఆధారాలను ఒక్కొక్కటిగా ముందు పెట్టడంతో తమకు ఏమీ తెలియదని, మొత్తం వ్యవహారం సిఐ నాగరాజుకే తెలుసని కొందరు కానిస్టేబుళ్లు చెబుతున్నట్లు సమాచారం.

సాయికృష్ణను మార్కాపురం నుంచి విజయవాడకు తరలించి నప్పటి నుంచి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చే వరకు జరిగిన ప్రతి పరిణామాన్ని పునర్నిర్మించే దిశగా దర్యాప్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి మరింత కీలక సమాచారాన్ని రాబట్టి కేసులో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా సిట్ అధికారులు ప్రశ్నలు కొనసాగిస్తున్నారు. నలుగురు నిందితుల కస్టడీ నేటితో ముగియనున్న నేపథ్యంలో వారిని న్యాయాధికారి శ్రీకాంత్ ఎదుట హాజరుపరిచిన అనంతరం తిరిగి జైలుకు తరలించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే కస్టడీలో సిట్ అధికారులు సేకరించిన వివరాలు, సాంకేతిక ఆధారాల విశ్లేషణతో కేసు దర్యాప్తులో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# సాహిత్య విమర్శను శాస్త్రీయ స్థాయికి తీసుకుపోవాలి

**అనంతపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త బ్యూరో:** సాహిత్య విమర్శ ఒక మేధోప్రక్రియ, చర్చ, సంవాదం లాంటిదని, అభ్యుదయవాదులు సమిష్టికృషితో విమర్శను శాస్త్రీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రముఖ సాహితీవేత్త నెల్లుట్ల వేణుగోపాల్ అన్నారు. సమాజాన్ని పరావర్తనం చెందించేదే సాహిత్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'సాహిత్య విమర్శ- పాఠశాల' రెండు రోజులపాటు ఘనంగా సాగింది. ఆర్డీటి ఎకాలజీ సెంటర్లో ఆదివారం జరిగిన తరగతులకు, సభలకు, అరసం జిల్లా అధ్యక్షుడు భీమిరెడ్డి ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. "సాహిత్య విమర్శ విభిన్న ధోరణులు", "మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ" అనే అంశాలపై ఎన్.వేణుగోపాల్ సుదీర్ఘంగా ఉపన్యసించారు. "సాహిత్య విమర్శ వికాసం" అనే అంశంపై అరసం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారామ్ "విమర్శకుని అనుభవాలు" చక్కగా వివరించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ సాహిత్య విమర్శకులు విస్తృత అధ్యయనం, నిరంతర సాధన కొనసాగించాలన్నారు. ప్రపంచీకరణ తర్వాత, అసహన రాజ్యం మొదలయ్యాక ప్రజాస్వామిక చర్చకు అవకాశం లేకుండా పోయిందన్నారు. సృజనకారుల్లో కూడా కీర్తికాంక్ష పెరిగి, విమర్శను, సవరణను అంగీకరించలేని ఒక స్థితి నెలకొందన్నారు. విమర్శకులకు సాహిత్య చరిత్ర మీద స్థూలమైన అవగాహన ఉండాలని, సృజనకారుల కన్నా ఎక్కువ అధ్యయనం చేయాలని సూచించారు. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అవగాహనను పెంచుకోవాలన్నారు. భిన్నరంగాల పట్ల విహంగ వీక్షణం చేసి మేధావిగా ఉండాలన్నారు. ఉపపత్తులతో గుణ, దోష విచారణ చేసినప్పుడే శాస్త్ర ప్రతిపత్తి సంతరించుకుంటుందన్నారు. ఆధునిక సాహిత్య విమర్శలో వైజ్ఞానిక వాదం, ఆస్తిత్వ, వాచక కేంద్ర, రూపవాద ప్రక్రియవాద, ఆధునికానంతర, పర్యావరణ వాద, సత్యానంతర, సామాజిక శాస్త్ర సాహిత్య విమర్శ, ఉపాంత వర్గాల వాద విభిన్న ధోరణులున్నాయన్నారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా సిద్ధాంత పత్రం, సదస్సు పత్రాలు ప్రామాణికంగా వుండాలని సూచించారు. సాహిత్య విమర్శకులు మరింత విరివిగా రావాలని, తర్క వితర్కాలు, వాద వివాదాల ద్వారా కూడా సాహిత్య విమర్శ అభివృద్ధి చెందిందన్నారు. తెలుగులో 8 దశాబ్దాల చరిత్ర గల మార్క్సిస్టు సాహిత్య విమర్శ మీద మరింతగా పరిశోధించాల్సి ఉందన్నారు. కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డుగ్రహీత, ఏపీ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు, సుప్రసిద్ధ సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మానవ సంబంధాల చిత్రణే సాహిత్యమన్నారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శులు శరత్ చంద్ర జ్యోతిశ్రీ, ఏఎంఆర్ ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి డా.తస్నీరు నాగేంద్ర, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ శాంతి నారాయణ, గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, మానవహక్కుల వేదిక నాయకులు ఎస్ఎం భాష, ఏ చంద్రశేఖర్, ఎస్వీ యూనివర్సిటీ తెలుగు విభాగ అతిథి అధ్యాపకులు డాక్టర్ ఎం. ఆదిశేషయ్య, కవులు అశేరా, మధుర శ్రీ, డాక్టర్ జూటూరి షరీఫ్, డాక్టర్ అనితమ్మ, ద్రాక్షాయణి, హేమలత, స్వర్ణలత, పుల్లా రామాంజనేయులు, గంగిరెడ్డి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



# అనూహ్యంగా పెరిగిన రద్దీ

● వెంకన్న సర్వదర్శనానికి 30గంటలు

**తిరుమల, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వరుససెలవులు... వారాంతంతో భక్తులు వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు చేరుకోవడంతో కొండపై రద్దీ పెరిగింది. వరుస సెలవులతో ఆదివారం ఉదయం 6గంటలకే తిరుమలలో వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్ నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల ఐదు కిలోమీటర్లు గోగర్భం డ్యామ్‌వరకు చేరాయి. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 10గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 43వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టిటిడి సూచించింది.

# నవంబర్‌లో శ్రీవారి పుష్పయాగం


● ఒక్క టికెట్‌తో ఒకే రోజు రెండుసార్లు శ్రీవారి దర్శనం



**తిరుమల, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** సహజంగానే తిరుమలకు వచ్చిన భక్తులు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దివ్యమనోహర రూపాన్ని క్షణకాలంపాటు దర్శించుకుంటేనే ఆత్మసంతృప్తి చెందుతుంటారు. అలాంటిది మళ్ళీమళ్ళీ చూడాలనిపించి మనసు ఉవ్విళ్ళూరుతుంది. ఇప్పుడు దీన్ని నిజంచేస్తూ టిటిడి అధికారులు భక్తులకు ఒక మహదవకాశం కల్పించారు. నవంబర్‌లో శ్రీవారి ఉత్సవ మూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్ప స్వామికి జరిగే పుష్పయాగం రోజు ఒక్క టికెట్ పొందితే ఒకే రోజు తమ ఇష్టదైవమ్ తిరుమలేశుని రెండుసార్లు దర్శించుకునే అద్భుత అవకాశాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించింది. శ్రీవారి ఆలయంలో నవంబరు 16న పుష్పయాగం జరగనుంది. ఈ పుష్పయాగానికి సంబంధించిన ఆర్జితసేవా టికెట్లను టిటిడి ఈ నెలలోనే విడుదల చేయనుంది. ఈ టికెట్ 700 రూపాయలు చెల్లించి ఇద్దరు గృహస్థ భక్తులకు బుక్ చేసుకునే అవకాశం ఉంది. పుష్పయాగం టికెట్ పొందినవారు నవంబర్ 16న ఉదయం ఆరు గంటలకు తిరుమలలోని సుపథం మార్గం ద్వారా ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో నిర్వహించే స్నపనతిరుమంజనం అభిషేకసేవలో పాల్గొనవచ్చు. ఆ తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తారు. మళ్ళీ అదే రోజు రెండోసారి మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ టికెట్ ఉన్న భక్తులు సుపథం మార్గం క్యూలైన్‌లో ప్రవేశించి మలయప్ప స్వామికి నిర్వహించే పుష్పయాగ మహోత్సవంలో పాల్గొంటారు. ఆలయంలోపల మరోసారి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఇలా ఒకే టికెట్ పై ఒకేరోజు రెండుసార్లు శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని టిటిడి బోర్డు భక్తులకు కల్పిస్తోంది.

# భక్తుల మధ్య భగవంతుడి బ్రహ్మోత్సవాలు

● సెప్టెంబర్ 15 నుండి 23వరకు మాఢవీధుల్లో వాహనసేవలు ● సామాన్యభక్తుల దర్శనాలకే ప్రాధాన్యత



**తిరుమల, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి తిరుమలలో ఈ ఏడాది జరగనున్న రెండు బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 15నుండి 23వ తేదీ వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు కొండ ముస్తాబవుతోంది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, అలంకరణలు, భక్తులకు సకల సౌకర్యాల కల్పన పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది వాహన సేవలను ఆలయ మాఢవీధుల్లో భక్తుల మధ్య వేడుకగా నిర్వహించనున్నారు. ఆపదమొక్కుల వాడికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు తిరుమలలో జరుగుతుంటాయి. బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత వుంది. సాక్షాత్తు బ్రహ్మదేవుడే కలియుగానికి విచ్చేసి దేవదేవునికి ఉత్సవాలు నిర్వహిస్తాడని ప్రతీతి. భక్తులు కూడా లక్షలాదిమంది ఈ తొమ్మిది రోజులు తిరుమలలోనే వుండి తమ ఇష్టదైవం వాహనసేవల్లో పాల్గొంటూ ముక్తికోసం తపిస్తుంటారు. ఈ ఏడాది అధికమాసం రావడంతో తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తిరుపతి జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విజయవంతంగా భక్తుల నడుమ బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేలా ప్రణాళికలు రూపొందించారు. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశముంది. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేశారు. సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తొలిరోజు సెప్టెంబర్ 15వ తేదీ మంగళవారం సాయంత్రం ధ్వజారోహణం రోజునే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమలకు చేరుకుంటారు. అదేరోజు సాయంత్రం ప్రభుత్వం తరపున వెంకన్నకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో పూర్తిగా సర్వదర్శనం మాత్రమే ఉంటుంది. శ్రీవాణి ట్రస్టు దాతలకు, ఇతర ట్రస్టుల దాతలకు దర్శన టిక్కెట్లు రద్దుచేశారు. భక్తుల రద్దీకి తగ్గట్లు లడ్డూలు బఫర్ స్టాక్ ఉంచుతున్నారు. భద్రత పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వాహనాల పార్కింగ్‌కు అసౌకర్యం కలగకుండా పోలీసులతో సమన్వయంతో ఏర్పాట్లు చేపడుతున్నారు. అలాగే అక్టోబర్ 11 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఆ తొమ్మిదిరోజులు సెప్టెంబర్ 15నుండి 23 వరకు, అక్టోబర్ 11నుండి 20వరకు అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్ర దీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది.

**సెప్టెంబర్ 19నుండి పెరటాసి శనివారాలు:** ఏడుకొండలవాడికి అత్యంత పవిత్రమైన పెరటాసి మాసం కూడా సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరిగే సెప్టెంబర్‌నెలలోనే రావడంతో తమిళ భక్తులతోబాటు తెలుగు రాష్ట్రాలు, కర్నాటక, ఉత్తర భారతదేశం నుండి భక్తులు భారీగా తిరుమలకు చేరుకునే అవకాశం ఉంది. బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 15వతేదీ రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహనం, సెప్టెంబర్ 19న గరుడసేవ, 20న స్వర్ణరథం, 23న చక్రస్నానం జరుగుతాయి. పోలీసులతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రత కల్పించేలా చూడనున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటుచేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తారు.

# ఎస్‌విబిసి ఛైర్మన్‌గా శ్రీధర్‌వర్మ

## యువకుడికి టిడిపి అద్భుత అవకాశం



**తిరుమల, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్‌విబిసికి) నూతన ఛైర్మన్‌గా తిరుపతికి చెందిన యువనేత, టిడిపి నాయకుడు బి.శ్రీధర్‌వర్మకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి అధికారికంగా రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి. టిడిపికి తొలి నుండి శ్రీధర్‌వర్మ కుటుంబం అంకితభావంతో సేవలందిస్తోంది. ఆయన తండ్రి ఎన్టీఆర్‌రాజు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుండి దివంగత ఎన్టీఆర్‌తో మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. తిరుమలకు వచ్చిన ప్రతిసారి ఎన్టీఆర్ ఎన్టీఆర్‌రాజును పలకరించి చర్చించేవారు. ఇదే సాన్నిహిత్యంతో శ్రీధర్‌వర్మ కూడా తొలినుండి టిడిపిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

ప్రస్తుతం టిడిపి రాయలసీమ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన సేవలను గమనించిన సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ శ్రీధర్‌వర్మకు ఎస్‌విబిసి ఛైర్మన్ పగ్గాలు అప్పగించేందుకు సుముఖత చూపిందని తెలిసింది.

# నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో బాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుండి నుంచి 9:30 గంటల వరకు 'డయల్ యువర్ ఎస్‌ఇ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్‌ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 నంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలి.





పి.రాజేశ్వరరావు మృతికి సంతాపం తెలియజేస్తున్న అరసం నేతలు

# విశాలాంధ్ర మాజీ మేనేజర్ పి.రాజేశ్వరరావు మృతికి అరసం సంతాపం

**అనంతపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త బ్యూరో:** విశాలాంధ్ర ప్రచురణాలయం మాజీ మేనేజర్, విశిష్ట ప్రచురణ కర్త అవార్డు గ్రహీత, అరసం నేత కామ్రేడ్ పి.రాజేశ్వరరావు మృతి దిగ్భ్రాంతి కలిగించిందని అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, కార్యదర్శులు ఏ.ఎం.ఆర్ ఆనంద్, కె.శరత్‌చంద్ర, జ్యోతిశ్రీ పేర్కొన్నారు. అనంతపురంలో జరుగుతున్న అరసం సాహిత్య విమర్శ పాఠశాలలో పి.రాజేశ్వరరావుకు నివాళి అర్పించారు. తమతో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉన్న మిత్రుడిని కోల్పోయామని వారు పేర్కొన్నారు. సభలో విరసం నేత, వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్ వేణుగోపాల్, విశాలాంధ్ర మాజీ మేనేజర్ బి.ఈశ్వర్ రెడ్డి, ప్రముఖ విమర్శకులు తూముచర్ల రాజారాం, జయరామ్, కె.నాగేశ్వరాచారి, ఈరన్న, తస్నీరు నాగేంద్ర, గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, పలువురు సాహితీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# రోడ్డు ప్రమాదంలో డిసిపి కుమార్తె మృతి





**గుంటూరు(క్రైమ్), ఆగస్టు 9 ప్రభాతవార్త:** గుంటూరు సమీపంలోని ఏటుకూరు బైపాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డిసిపి షిరీన్ బేగం కుమార్తె షేక్ అసిఫా(24) మృతి చెందారు. మృతురాలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంఎస్‌సి సైకాలజీ కోర్స్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. విజయవాడ నుంచి చీరాల బీచ్‌కు వెళ్తుండగా కారు ప్రమాదానికి గురైంది. కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కుమార్తె మృతి వార్త విని షిరీన్ బేగం తీవ్ర దిగ్భ్రాంతికి గురై స్పృహ కోల్పోయినట్లు సమాచారం.


# 11 కిలోలు గంజాయి స్వాధీనం



**పుత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పుత్తూరు మండలంలోని టి.ఆర్.కండ్రిగ గ్రామ చెరువు సమీపంలో నిర్వహించిన దాడిలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 11 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు డిఎస్పీ రవికుమార్ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. కె.నవీన్‌కుమార్ (36), వి.జయప్రకాష్ (25), బి.బాబు అలియాస్ బాబునాయుడు (50), ఎం.ఆర్.దేవరాజ్ (24), సి.ఎస్.మూర్తి (24), ఇ.రోహిత్ (23)లను అరెస్ట్ చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 1,67,550 లక్షలు వుంటుందని తెలిపారు. అలాగే గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు రాజేష్ అలియాస్ ఆర్‌కె, శ్రీనివాసులు పరారీలో వున్నారని వారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నామని తెలిపారు. నిందితులపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. దాడిలో పాల్గొన్న సిబ్బందిని ఆయన అభినందించారు. సమావేశంలో సిఐ నెట్టి కంఠయ్య, ఎస్ఐ నాగేంద్ర పాల్గొన్నారు.

# క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో సక్సెస్

● తుడా ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి




**తిరుపతి, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీకన్వెన్షన్ హాల్లో మూడు రోజుల పాటు ప్రదర్శించిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రదర్శన ఆదివారం సాయంత్రంతో విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి తుడా ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో తుడా పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని శెట్టిపల్లి భూములు అందరికీ ఇచ్చిన ఘనత తనకే తన ప్రభుత్వానికి చెందుతుందన్నారు. రోడ్ల అభివృద్ధి చేయడంతో పాటు తిరుచానూరు బైపాస్ అభివృద్ధికి ఎన్నో పనులు చేపట్టామని తెలిపారు. తిరుపతిలో మరిన్ని స్టార్ హోటల్‌లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, అలాగే మంచి స్టార్ హోటల్ వచ్చి తిరుపతి మరింత వేగంగా అభివృద్ధి చెందుతున్న వేళ ఇలాంటి ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం మంచిదన్నారు. ఈ మూడు రోజులు నిర్వహించిన క్రీడాయి ప్రాపర్టీ ఎక్స్పో ద్వారా ప్రజలకు తిరుపతిలో సొంతిల్లు కల నెరవేర్చుకోవడంతోపాటుతో వివిధ రకాలైన అపార్ట్మెంట్లు ఫ్లాట్స్, గృహాలకు సంబంధించిన రుణ సదుపాయాలు బ్యాంకులతోపాటు గృహోపకరణాలకు సంబంధించి అన్ని రకాల స్టాల్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం చాలా శుభదాయకమన్నారు. నిర్మాణ రంగంలో ఆధునిక టెక్నాలజీతో కూడిన ఉత్పత్తులు, వివిధ గృహ సుందరీకరణ వస్తువులు, ప్లాట్లు, అపార్ట్మెంట్, రుణ సదుపాయాలు, ఆధునాతన వంటి వాటిని ఒకే వేదికపైకి తెచ్చి సుమారు 60 స్టాల్స్‌తో ప్రజల కలలు సాకారం చేసే దిశగా కృషి చేసిన క్రెడాయ్ ప్రతినిధులను వారు అభినందించారు. అనంతరం క్రెడాయ్ ఛైర్మన్ గోపినాథ్, అధ్యక్షుడు రాంప్రసాద్ ఇదే స్ఫూర్తితో భవిషత్తులో మరిన్ని ప్రదర్శనల ద్వారా ప్రజల ఆశయాల సాధనకు తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయి రాష్ట్ర అధ్యక్షుడు భయాన శ్రీనివాసులు, క్రెడాయ్ కార్యదర్శి నరసింహులు, ఉపాధ్యక్షుడు రాజేష్ బాబు, కోశాధికారి హరికృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

# పునరావాసం కల్పించకుండా 'వెలిగొండ' నిర్వాసితులకు ఖాళీ చేయించొద్దు

● సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా గ్రామాల నుండి ఖాళీ చేయించే ప్రయత్నాలు మానుకోవాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేసారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పనులు 2026 ఆగస్టుకి పూర్తిచేసి సెప్టెంబర్ 1వ తేదీన ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందిదని ఇది హర్షణీయమే అయినప్పటికీ గతంలో ఇలాంటి గడువులు చాలా పెట్టి అమలు చేయకుండా ఆలస్యం చేశారు. ఇంకా చాలా పనులు అసంపూర్తిగా ఉన్నాయన్న వాస్తవాన్ని గుర్తించాలి. కృష్ణా జలాశయంలో నీళ్ళులేవు. వరదలొస్తే తప్ప నల్లమల సాగర్‌కు నీళ్ళివ్వలేరు. రిజర్వాయర్‌కు వదిలినా పంటకాల్వలు లేవు. ఈ పరిస్థితులను మరిచినీళ్ళు వదలాలనుకోవడం వివేకంకాదు. ఏదో సాధించామని గొప్పలు చెప్పుకోడానికి నిర్వాసితులను బలిచేయొద్దు. నిర్వాసితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నిర్వాసితులందరికీ ఇళ్ళస్థలాలు కూడా ఇవ్వకుండా చెల్లించాల్సిన ప్యాకేజీ చెల్లించకుండానే ఆగస్టు నెలాఖరుకు గ్రామాలు ఖాళీ చేయాలన్న కలెక్టర్ మౌఖిక ఆదేశాలతో నిర్వాసితులు తీవ్రంగా ఆందోళన పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన ప్రకారం రూ.906 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు మూడోవంతు అంటే రూ.306కోట్లే చెల్లించారు. మిగతా పరిహారం ఇస్తామంటూ ఊరిస్తూ కాలయాపన చేస్తున్నారు. గ్రామనాయకులు, బాధిత ప్రజలు కలెక్టర్ గారిని కోరినా ముందు ఖాళీ చేయండి, సమయం లేదంటూ ఎక్కడైనా పరదాలు కట్టుకుని వెళ్ళాల్సిందే నంటూ గ్రామాలు ఖాళీ చేయాలని బలవంత పెడుతున్నారు. విద్యుత్ సైతం కట్ చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నది. అప్పటికి గ్రామాలు ఖాళీ చేయకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారు. ఇది చట్టవిరుద్ధమే కాదు అమానవీయం కూడా. భూసేకరణ చట్టాన్ని అనుసరించి అందరికీ పరిహారం చెల్లించిన అనంతరం కనీసంగా 6 నెలలు చట్ట ప్రకారం సమయం ఇవ్వాలి. బలవంతంగా ఖాళీ చేయించకూడదని సిపిఐ(యం) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది.

# చైల్డ్ హోమ్ నుంచి బాలిక పరార్



**తిరుపతి(క్రైమ్), ఆగస్టు 9 ప్రభాతవార్త:** ప్రభుత్వ పరిరక్షణ బాలికల పాఠశాలలో చదువుకున్న సాయి దుర్గ (15) హోమ్ నుండి ఆదివారం పరారైంది. ప్రభుత్వ బాలికల హోమ్ సూపరిండెంట్ సునీత కథనం మేరకు బాపట్ల జిల్లాకు చెందిన కూన సాయిదుర్గ(15) అనే బాలిక ఈ నెల ఒకటో తారీకు ఒంటరిగా ప్రయాణిస్తుండగా తిరుపతి శక్తి టీం గమనించి బాలికను అదుపులో తీసుకున్నారు. అనంతరం తిరుపతికి చెందిన ప్రభుత్వ పరిరక్షణ పాఠశాలలో చేర్పించారు. అయితే అక్కడ ఉండటం ఇష్టంలేని సాయిదుర్గ ఆదివారం ఉదయం హోమ్ నుండి పరారైంది. సమాచారం తెలుసుకున్న హోమ్ సూపర్డెంట్ వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి ఆ అమ్మాయి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

# అమరావతిలో ఎఐ వర్సిటీ

● అత్యాధునిక క్వాంటమ్ కూడా.. ● ముందుకొచ్చిన 'నీలిట్' - రూ.731.7 కోట్లతో ఏర్పాటు ● ఈ సెప్టెంబరు నుంచే విద్యార్థులకు శిక్షణ ప్రారంభం



**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధానిని క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ తీర్చిదిద్దాలనే ఎపి ప్రభుత్వం ఆలోచనకు అనుగుణంగా అమరావతి ప్రాంతంలో మరో విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్) సంస్థ రూ.731.7 కోట్లతో దేశంలోనే తొలి, అత్యాధునిక క్వాంటమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యూనివర్సిటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. నిడమర్రు వద్ద నీలిట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 10 ఎకరాల భూమిని కేటాయించింది. వాస్తవానికి ఆ సంస్థ మొదట 19 ఎకరాలు కావాలని కోరింది. అయితే మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించి 10 ఎకరాలకు ఆమోదం తెలిపింది. ఈ భూమిని 30యేళ్ల పాటు లీజుకు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి ఈ లీజును మరో 30యేళ్లు పొడిగించే వెసులుబాటును కూడా కల్పించింది. అమరావతిలో నిర్మించే నీలిట్ క్యాంపస్ కోసం రూ.731.7 కోట్లను ఖర్చు చేయనున్నారు. సుమారు 5.1 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవనాలతో ఈ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది ఆరంభంలో ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఈ ప్రాజెక్టుకు బీజం పడింది. ఆ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఎపి ప్రభుత్వం, నీలిట్ సంస్థల మధ్య కీలకమైన ఎంఓయు కుదిరింది. అనంతర క్రమంలో నిడమర్రులో నీలిట్ యూనివర్సిటీ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధాన క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు తరగతులు ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఆరునెలలు కుడా తిరగకుండా నీలిట్‌ను అందుబాటులోకి తీసుకుని వస్తోంది. ఈ సెప్టెంబరు నెల నుంచే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నీలిట్ తాత్కాలికంగా తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నీలిట్ అమరావతి క్యాంపస్‌ను ఒక 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌'గా అభివృద్ధి చేయనున్నారు.

క్వాంటమ్, ఏఐ, సెమీ కండక్టర్ టెక్నాలజీల్లో ఇక్కడ అత్యుత్తమ శిక్షణ అందిస్తారు. ఈ క్యాంపస్‌లో పలు అత్యాధునిక కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్ అండ్ సెక్యూరిటీ, ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ రంగాల్లో యుజి, పిజి, పిహెచ్‌డి, డిప్లొమా కోర్సులు ఆఫర్ చేస్తారు.

సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్, చిప్ డిజైన్, విఎల్ఎస్ఐ, ఎటిఎంపి, ఎంబెడెడ్ సిస్టమ్స్, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్‌లో ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తారు. విద్యార్థుల కోసం అత్యాధునిక పరిశోధనశాలలను నెలకొల్పుతారు. డీప్‌టెక్ రంగంలో స్టార్టప్‌లకు, ఇతర సంస్థలకు ఈ క్యాంపస్ అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తుంది. నీలిట్ పూర్తి స్వయంప్రతిపత్తి గల ప్రతిష్ఠాత్మక కేంద్ర శాస్త్ర సంస్థ. ఇది కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, పరీక్షల నిర్వహణ, సర్టిఫికేషన్ వంటి కార్యక్రమాలను ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. నైపుణ్య శిక్షణలో దీనికి దేశవ్యాప్తంగా మంచి పేరుంది. ఇటీవల నీలిట్‌కు కేంద్ర విద్యాశాఖ 'డీమ్డ్ టు బి యూనివర్సిటీ' హోదా కూడా కల్పించింది.

# పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహణ

● రేయింబవళ్లు కష్టపడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువత కష్టాన్ని తక్కువ చేసి చూపొద్దు: మంత్రి సవిత



**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డీఎస్సీని పారదర్శకంగా, అక్రమాలకు తావు లేకుండా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పకడ్బందీగా నిర్వహించారని రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేసారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయనడం సరికాదు అన్నారు. రేయింబవళ్లు కష్టపడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువత కష్టాన్ని తక్కువ చేసి చూపొద్దు అన్నారు. కర్నూలు కొండారెడ్డి బురుజు ఎక్కిన వారికి నీ తాడేపల్లి ప్యాలెస్ ఎక్కడం ఒక లెక్క కాదు అన్నారు. 'మెగా డీఎస్సీపై రోజంతా చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం' అని మంత్రి ఎస్.సవిత సవాల్ అన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు 14కు పైగా డీఎస్సీలు నిర్వహించి, రెండు లక్షల వరకూ టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారు. ఏనాడూ అవినీతి, అక్రమాలకు తావులేకుండా డీఎస్సీలు నిర్వహించారన్నారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని అసమర్థుడు జగన్ రెడ్డి అని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక వీడియో ప్రకటన చేశారు. డీఎస్సీ అంటేనే జగన్‌కు మొదటి నుంచి విషం కక్కుతున్నారన్నారు. నోటిఫికేషన్ రాగానే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవాలని చూశారన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆ అడ్డంకులన్నింటినీ అధిగమించి, మెగా డీఎస్సీని అవినీతికి, అక్రమాలకు తావులేకుండా నిర్వహించారన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16వేల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతుంటే, వారందరినీ గొడ్డలి పార్టీ అవమానిస్తోందని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉన్నా, పోయినా టీచర్లను అవమానించడమే పనిగా పెట్టుకోవడం మానుకోవాలని హితవు పలికారు.

ఐదేళ్ల పాలనలో ఉపాధ్యాయులను అన్ని విధాలా జగన్ వేధించారని మంత్రి సవిత మండిపడ్డారు. చంద్రబాబునాయుడు 14 డీఎస్సీలు నిర్వహించారని, వాటి ద్వారా రెండు లక్షలకు పైగా టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఏ డీఎస్సీలోనూ అక్రమాలకు తావులేకుండా, టీచర్ పోస్టులు భర్తీ చేశారన్నారు. 2025 మెగా డీస్సీపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని జగన్ కు హితవు పలికారు. డీఎస్సీ నిర్వహణపై ఎలాంటి అనుమానాలు ఉన్నా.. దమ్ము, ధైర్యం ఉంటే జగన్ అసెంబ్లీకి చర్చకు రావాలని అన్నారు. జగన్‌కు ఎంతసేపైనా మైక్ ఇచ్చి గౌరవంగా మాట్లాడిస్తామని, అవసరమైతే ఒక రోజంతా మెగా డీఎస్సీపై అసెంబ్లీ వేదికగా చర్చించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె స్పష్టం చేశారు. నీతి, నిజాయితీ, దమ్ము, ధైర్యం ఉంటే సభకు వచ్చి తేల్చుకోవాలని జగన్‌కు మంత్రి సవిత సవాల్ చేశారు. వైసిపి, జగన్ తప్పుడు ఆరోపణలపై రాయలసీమకు చెందిన ఉపాధ్యాయులంతా సమరశంఖం పూరించారన్నారు.

## 55 దేశాల్లో మాత్రమే దృశ్యమానం..

## రాత్రివేళ కావడంతో భారత్‌లో కనిపించదు

# 12న సంపూర్ణ సూర్యగ్రహణం

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఈ నెల 12న బహుళ అమావాస్య రోజున సంపూర్ణ సూర్యగ్రహణం రూపంలో ఖగోళంలో మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. యూరప్, రష్యా, ఉత్తర అమెరికా సహా 55 దేశాల్లో ఎనిమిది గంటలకు పైగా కనువిందు చేయనున్న ఈ గ్రహణం ఒక్క స్పెయిన్, ఐస్‌లాండ్‌లో మాత్రమే సంపూర్ణంగా కనిపించనుంది. మిగతా దేశాల్లో పాక్షికంగానే కనిపించనుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం ఏడు గంటల సమయంలో గ్రహణం మొదలు కానుండగా సంపూర్ణ గ్రహణం రాత్రి 9.15 గంటల సమయంలో ఏ ర్పడనుంది. గరిష్ట కాలం రాత్రి 11.17 గంటలకు వుండనుంది. దీని తరువాత తెల్లవారుజామున 1.20 గంటలకు సంపూర్ణ దశ ముగింపు మొదలవనుంది. తెల్లవారుజామున 3.30 గంటలకు గ్రహణం ముగియనుంది. రాత్రి వేళలో సూర్య గ్రహణం ఏర్పడనుండడంతో భారత్‌లో ఇది కనించదు. ఐస్‌లాండ్, స్పెయిన్ దేశాల్లో సంపూర్ణ సూర్య గ్రహణాన్ని పూర్తిగా వీక్షించే అవకాశం వుండడంతో సూర్యుడిపై పరిశోధనలకు ఖగోళ శాస్త్రవేత్తలు ఆ దేశాలకు ముందుగానే పయనమయ్యారు. ఇక ఈ గ్రహణం భారత్‌లో ఎక్కడ కనిపించ నందున ఇక్కడ ఎలాంటి సూతకం లేదని, ఆలయాల మూసివేత వుండదని ఆగమన పండితులు చెబుతున్నారు. ఈ గ్రహణం కర్కాటక రాశిలోని అశ్లేషా నక్షత్రంలో కేతుగ్రస్త సూర్య గ్రహణంగా సంభవి స్తోంది. కర్కాటక రాశి వారు శాంతి పూజలు చేయాలని పండితులు చెబుతున్నారు. బహుళ అమావాస్య ను హిందువులు చుక్కల అమావాస్యగా పిలుస్తారు. పలు దేవాలయాల్లో ఇదే రోజున తాంత్రిక పూజలు చేయడం విశేషం. ఈ ఏడాది ఇది రెం డవ సూర్య గ్రహణం కావడం గమనార్హం. మొదటిది పాక్షిక సూర్య గ్రహణం ఈ ఏడాది ఫిబ్రవరి నెల 17న సంభవించగా ఇది కూడా భారత్‌లో కనిపించలేదు.

ఇదిలా ఉండగా ఈ నెల 12న సూర్యోదయానికి ముందు ఆకాశంలో ఆరు గ్రహాలు ఒకే ప్రాంతంలో వరుసగా కనువిందు చేయనున్నాయి. బృహస్పతి, బుధుడు, అంగారకుడు, శని, యురేనస్, నెప్ట్యూన్ తూర్పు నుంచి పడమన వైపు విస్తరించి వరుసగా కనిపిస్తాయి. వీటిలో అంగారకుడు, శని వంటి ప్రకాశ వంతమైన గ్రహాలను అందరు వీక్షించే వీలుంది. ఇతర గ్రహాల వీక్షణకు దూరదర్శిని అవసరం వుంటుంది. ఇదే సమయంలో ఆ రోజున రాత్రి ఉల్కా వర్షం కురవనుంది.

**28న పాక్షిక చంద్రగ్రహణం**

మరోవైపు ఆగస్టు 28వ తేదీన పాక్షిక చంద్ర గ్రహణం ఏర్పడనుంది. రక్షా బంధన్ పండగ రోజున భారత కాలమానం ప్రకారం ఈ గ్రహణం మధ్యాహ్నం 12.12 గంటల నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు వుండనుంది. పగటి వేళ అయినందున ఇది భారత్‌లో కనిపించ దు. దీంతో భారత్‌లో సూతకం వుండదని పండితులు చెబుతున్నారు.





# నాలుగు హైకోర్టులకు కొత్త సిజెలు

## మరో ఇద్దరు న్యాయమూర్తుల బదలీ

## సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** నాలుగు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల నియామకాన్ని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. కామేశ్వరరావును పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా బదిలీ చేయాలని కూడా కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం బొంబాయి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ రవీంద్ర విఠల్‌రావు ఘుగేను కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సిఫార్సు చేసింది. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠిని బొంబాయి హైకోర్టు ప్రధానన్యాయ మూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. అంతేకాకుండా, ప్రస్తుతం పంజాబ్- హర్యానా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ అశ్వనీకుమార్ మిశ్రాను ఆ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన ఈ సిఫార్సులను, ఇప్పుడు పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సిఫార్సులను ఆమోదించి, అవసరమైన నోటిఫికేషన్లను జారీ చేసిన తర్వాత ఈ నియామకాలు అమల్లోకి వస్తాయి.

ప్రస్తుతం, దేశంలోని ఇరవై ఐదు హైకోర్టులలో ఏడింట శాశ్వత ప్రధాన న్యాయమూర్తులు లేకుండా పనిచేస్తున్నాయి. ఇటీవల పదవీ విరమణలు, సుప్రీంకోర్టుకు పదోన్నతుల కారణంగా బొంబాయి, కలకత్తా, జమ్మూకాశ్మీర్, లడఖ్, మధ్యప్రదేశ్, పాట్నా, పంజాబ్- హర్యానా, రాజ స్థాన్ హైకోర్టులకు ప్రస్తుతం తాత్కాలిక ప్రధానన్యాయమూర్తులు నాయ కత్వం వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే, ఈ తాజా సిఫార్సుల ద్వారా ఈ ఖాళీలలో ఐదింటిని భర్తీ చేయవచ్చు.



# రష్యానుంచి నేరుగా హిందూ మహాసముద్రానికి రైల్వేలైన్

## రష్యా ఉపప్రధాని ఖుస్నుల్లిన్ వెల్లడి

**మాస్కో, ఆగస్టు 9:** రష్యా నుంచి నేరుకగా హిందూ మహాసముద్రం వరకు రైల్వే మార్గాన్ని నిర్మించడం ద్వారా ఇండియాతో భూమార్గ అనుసంధానాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని మారత్ ఖుస్నుల్లిన్ ప్రభుత్వ వార్తా సంస్థ టాస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చర్చించారు. హిందూ మహాసముద్రానికి రైల్వే మార్గాన్ని నిర్మించడాన్ని రష్యా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి ప్రత్యామ్నాయ రైలు నెట్‌వర్క్, ప్రస్తుతం ఉన్న సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని రష్యా విశ్వసిస్తోంది. ప్రస్తుతం రష్యా, భారత్ మధ్య అత్యధిక వాణిజ్యం బోస్పరస్, హార్ముజ్ జలసంధి వంటి కీలకమైన సముద్ర మార్గాల ద్వారానే జరుగుతోంది. హార్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు, గ్యాస్ వాణిజ్య మార్గాలలో ఒకటి. అయితే ప్రపంచ చమురు రవాణాలో 25 శాతం, ఎల్ఎన్‌జీ రవాణాలో 20 శాతం ఈ సముద్ర మార్గం గుండానే జరుగుతాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం కారణంగా సముద్రం మార్గం ద్వారా వెళ్లే వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రష్యా తన వాణిజ్యం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఏఏ దేశాల గుండా ఈ రైలు మార్గం వెళ్తుంది ప్రతిపాదిత రైల్వే నెట్వర్క్ రష్యా నుంచి బయలుదేరి మధ్య ఆసియా, పశ్చిమాసియా దేశాలైన తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ దేశాల గుండా హిందూ మహాసముద్రాన్ని చేరుకునేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

ఈ మార్గం అందుబాటులోకి వస్తే ఇండియాకు రవాణా అయ్యే సరుకుల సమయం, వ్యయం గణనీయంగా తగ్గుతాయి. భూమార్గం, సముద్రమార్గాల కలయికతో కూడిన ఈ నెట్వర్క్ దక్షిణాసియా, మధ్య ఆసియా దేశాలకు సరికొత్త ఆర్థిక, వాణిజ్య అవకాశాలను అందిస్తుంది. భారతదేశం రష్యాకు ఓ ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి. ఇంధనం, రక్షణ, ఇతర రంగాలలో ఇరు దేశాల మధ్య దీర్ఘకాలంగా వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ఇండియాకు ప్రత్యక్ష, సురక్షితమైన భూమార్గ అనుసంధానాన్ని అభివృద్ధి చేయడం ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని మరింతగా పెంచగలదు. ఈ ప్రతిపాదన రష్యా, ఇండియాకు ముఖ్యమైనది మాత్రమే కాకుండా, మధ్య ఆసియా, ఇరాన్ వంటి దేశాలకు కూడా కొత్త వాణిజ్య అవకాశాలను అందించగలదు. భయంకపితులను చేసిన ఆ ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఘటనలో అసలు విషయాలు వెలుగులోకి ఈ ప్రాజెక్టుకు భారీగా నిధులు అవసరం. అటువంటి రైల్వే నెట్‌వర్క్‌ను నిర్మించడం సులభం కాదు. అనేక దేశాల గుండా వెళ్లే ఈ మార్గానికి గణనీయమైన పెట్టుబడి, భద్రతా చర్యలు, వివిధ దేశాల మధ్య దీర్ఘకాలిక సహకారం అవసరం.

# కామన్వెల్త్ క్రీడాకారులతో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2026లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి తిరిగి వచ్చిన భారత బృం దానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం తన ఢిల్లీ నివాసంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ దేశ పతక విజేతలతో సుదీర్ఘంగా సంభాషించి వారి అనుభవాలను తెలుసుకున్నారు. వారి అద్భుతమైన ప్రదర్శనను ప్రశంసిస్తూ, యావత్ దేశం తరపున అభినందనలు తెలిపారు. సోషల్ మీడియాలో ఓ వీడియోను కూడా పంచుకున్నారు, అది వేగంగా వైరల్ అవుతోంది. ప్రధాన మంత్రి తన సోషల్ మీడియాలో ఓ వీడియోను పంచుకోవడం ద్వారా కామన్వెల్త్ గేమ్స్ అథ్లెట్లతో జరిగిన ఈ ప్రత్యేక సమావేశం గురించి తెలియజేశారు. ఆ వీడియోలో ఆయన స్వర్ణ పతక విజేత బాక్సర్ సాక్షి చౌదరి, పలువురు ఇతర ఛాంపియన్‌లతో సంభాషిస్తూ కనిపించారు. ఆ వీడియోలో సాక్షిచౌదరి ప్రధాని మోదీ నిరాడం బరతను ప్రశంసిస్తూ ప్రధానమంత్రిని కలవడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఆయన చాలా వినయశీలి అని అన్నారు. సంభాషణ సందర్భంగా ఆటగాళ్ల ప్రధానమంత్రిని ఏదైనా మాట్లాడమని కోరగా దేశంలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించే తన ప్రసిద్ధ సందేశాన్ని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు, జో ఖేలేగా, వో ఖిలేగా! ఆల్వేస్ చీర్4భారత్. అంటూ చివరకు భారత్ మాతా కీ జై అని నినాదాలు చేస్తూ ఆటగాళ్లలో ఉత్సాహాన్ని నింపారు. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత అథ్లెట్లు అద్భుతంగా రాణించి, మొత్తం 39 పతకాలను గెలుచుకోవడం గమనార్హం. వీటిలో 13స్వర్ణాలు, 17రజతాలు, 9కాంస్య పతకా లున్నాయి. ఈ విజయం భారత జట్టు ఆత్మవి శ్వాసాన్ని పెంచగా ప్రధానమంత్రితో ఈ సమావేశం అథ్లెట్ల ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.

# ఈగల్‌కు చిక్కిన అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్

## హాష్‌ఆయిల్ స్వాధీనం





**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఒడిశా నుంచి హాష్ ఆయిల్‌ను హైదరాబాద్‌కు స్మగ్లింగ్ చేస్తున్న అంతరాష్ట్ర స్మగ్లర్‌ను ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అతని వద్ద నుంచి 200 మిల్లీ లీటర్ల హాష్ ఆయిల్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఎపిలోని ప్రకాశం జిల్లాకు చెందిన బర్సె నరేంద్ర శ్రీనివాస్ (30) చాలా కాల ంగా హైదరాబాద్‌లో వుంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు అలవాటుపడ్డ ఇతను ఐదేళ్ల క్రితం డ్రగ్ స్మగ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో ఇతనిపై సరూర్‌నగర్, మీర్‌పేట్ పోలీసు స్టేషన్లలో ఐదు కేసులు నమోదయ్యాయి.

గత ఏడాది మే నెలలో మీర్‌పేట్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టయి నవంబర్ నెలలో బెయిల్‌పై విడుదలయ్యాడు. అనంతరం మళ్లీ కొద్దిరోజులు డ్రైవర్‌గా పనిచేసినా ఆదాయం సరిపోక పోవడంతో మళ్లీ డ్రగ్స్ దందా చేయసాగాడు. స్నాప్ చాట్‌లో ఒడిషాలోని కోరాపూర్‌కు చెందిన హారీ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అక్కడి నుంచి తక్కువ ధరకు హాష్ ఆయిల్ కొన సాగా డు. దీనిని జంట నగరా లలో ఎక్కువ ధరకు విక్ర యిస్తూ దండిగా సంపా దించ సాగాడు. అయితే ఇతని కదలికలపై ఈగల్ పోలీసులు నిఘా వుం చారు. తాజాగా ఇతను ఈ నెల రెండవ తేదీన వైజాగ్ మీదుగా ఒడిశా లోని కోరాపూర్ జిల్లాకు వెళ్లి హాష్ ఆయిల్ స్మగ్లర్ హారితో భేటీ అయ్యాడు. అక్కడ నాలుగు రోజులు వున్న తరువాత తొమ్మిది వేల రూపాయలు చెల్లించి 200 మిల్లీలీటర్ల హాష్ ఆయిల్‌ను తీసుకుని వైజాగ్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులో వచ్చాడు.

నరేంద్ర శ్రీనివాస్ గురించి పక్కా సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ఆదివారం ఉదయం అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ఓఆర్ఆర్ వద్ద కాపుకాశారు. విజయవాడ నుంచి వస్తున్న బస్సులో ఇతను వచ్చి అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద దిగాడు. అనంతరం ఆటో కోసం ఎదురు చూస్తుండగా ఈగల్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. నిందితుడి బ్యాగుల్లో 200 మిల్లీలీటర్ల హాష్ ఆయిల్ పట్టుబడింది. దీని విలువ రెండున్నర లక్షల రూపాయలుగా తేలింది. ఒడిషాలో కొన్న హాష్ ఆయిల్‌ను జంట నగరాలలో పది మిల్లీ లీటర్‌గా చిన్న బాటిల్‌లో వుంచి 1200 రూపా యలకు ఇతను అమ్ముతున్నట్లు తేలింది. నింది తుడిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించారు. ఈ కేసులో ఒడిషా స్మ గ్లర్ హారి కోసం గాలిస్తున్నారు. కాగా నరేంద్ర శ్రీనివాస్ నుంచి పది మంది హాష్ ఆయిల్ కొన్నట్లు తేలగా వారి కోసం కూడా గాలిస్తున్నారు.



జూరాల గేట్లు మూసివేసిన దృశ్యం

# జూరాల గేట్లు మూసివేత

**మహబూబ్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త బ్యూరో:** జూరాలకు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 8.415 టీఎంసీలుగా నమోదు అయింది. జూరాల ప్రాజెక్టుకు 63,000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అయింది. దీంతో డ్యాం గేట్లు మూసివేశారు. పవర్ హౌస్ ద్వారా 43,686 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. మొత్తంగా జూరాల నుంచి 47,060 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదు అయింది. 878టీఎంసీ లకు శ్రీశైలం జూరాల నుంచి వరద వస్తుండడంతో శ్రీశైలం జలాశ యానికి జలకళ సంతరించుకున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు 215.8070 టీఎంసీలకు గాను ప్రస్తుతం 878.10 అడుగులకు చేరి 178.7400టీఎంసీలుగా నమోదు అయింది. జూరాల పవర్ హౌస్ నుంచి 36,233 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అయింది. శ్రీశైలంలోని రెండు ఎడమ కుడి జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. కుడి జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 31,306 క్యూసెక్కులు, ఎడమ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 7063 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

# 13 మంది స్టార్లు ఔట్

## టీమిండియాకు ఊహించని షాక్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ రేసులో భారత్‌కు అత్యంత కీలకమైన శ్రీలంక పర్యటన ప్రారంభానికి ముందే గాయాల సమస్య రూపుదిద్దుకుంది. శ్రీలంకతో జరగబోయే కీలకమైన టెస్టు సిరీస్ ముందు ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా 13 మంది భారత ఆటగాళ్ళు గాయాల బారిన పడ్డారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో సహా జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా లాంటి స్టార్ ప్లేయర్లు దూరం కావడంతో భారత్ క్రికెటన కంట్రోల్ బోర్డు తీవ్ర ఒత్తిడిలో పడిపోయింది. ఈ నెల 15 నుంచి రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుండగా, భారత క్యాంప్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది. లంక ఎలెవన్‌తో జరుగుతున్న ప్రాక్టీస్ మ్యాచ్‌కూ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వేలి గాయం వల్ల దూరమయ్యాడు. అతని స్థానంలో కేఎల్ రాహుల్ జట్టు బాధ్యతలను భుజాన వేసుకున్నారు. టీమిండియా మేనేజ్‌మెంట్‌ను ఇది కోలుకోలేని దెబ్బగా మారింది. గాయపడిన 13 మంది ఆటగాళ్ళు ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సిఎ)లో పునరావాసం పొందుతున్నారు. వీరిలో స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మోకాలి గాయంతో బాధపడుతుండగా, హార్దిక్ పాండ్యా తొడ కండరాల గాయంతో మైదానానికి దూరమయ్యారు. ఆకాష్ దీప్ వెన్నుముకలో స్ట్రెస్ ఫ్రాక్చర్, రియాన్ పరాగ్ కుడి చేతి మణికట్టు గాయంతో కోలుకుంటున్నారు. నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా హ్యామ్‌స్ట్రింగ్ సమస్యలతో ఇబ్బంది పడుతుండటంతో మ్యాచ్ ఎంపికలకు దూరమయ్యారు. వరుణ్ చక్రవర్తి, సుయాష్ శర్మ, అశోక్ శర్మ, యుధ్‌వీర్ సింగ్, హిమాంశు సింగ్ సైతం వేర్వేరు గాయాలతో చికిత్స పొందుతున్నారు. శ్రీలంక టెస్టు సిరీస్‌కు ఎంపికైన యువ బ్యాటర్ సాయి సుదర్శన్ కాలి వేలి ఫ్రాక్చర్ నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దీంతో అతడు ఈ సిరీస్ మొత్తానికి దూరం కానున్నట్లు సమాచారం వస్తోంది. అయితే దీనిపై బిసిసిఐ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వాషింగ్టన్ సుందర్ అందుబాటుపై కూడా ఇంకా అనుమానాలు తొలగిపోలేదు. ఇంతమంది ముఖ్యమైన ఆటగాళ్ళు ఒకేసారి గాయాల బారిన పడటం జట్టు ఎంపికను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ముఖ్యమైన టెస్టు సిరీస్ ముంగిట ప్రధాన ఆటగాళ్ళు మైదానానికి దూరం కావడం భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బే. ఎన్సిఏలో చికిత్స పొందుతున్న ఆటగాళ్ళు ఎంత త్వరగా కోలుకుంటారో వేచి చూడాల్సి ఉంది.




## లెక్సింగ్టన్ ఓపెన్‌లో ఛాంపియన్స్‌గా

# నిక్కి, ఎస్కోబార్ జోడీ

**న్యూఢిల్లీ:** ఏటీపీ ఛాలెంజర్ 75 టోర్నమెంట్ అయిన లెక్సింగ్టన్ ఓపెన్ 2026లో, భారత్‌కు చెందిననికి కలియంద పూనాచా- ఈక్వెడార్‌కు చెందిన గొంజలో ఎస్కోబార్ జోడీ అద్భుతమైన పునరాగమనం చేసి, అమెరికన్ జోడీ ఆండ్రీ ఇలగన్-కార్ల్ పోలింగ్‌లను ఓడించి పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఆదివారం కెంటకీలోని లెక్సింగ్టన్‌లో ఒక గంట 42 నిమిషాల పాటు జరిగిన ఫైనల్‌లో, మూడవ సీడ్ జంట పూనాచా ఎస్కోబార్ 6-7 (1), 6-3, 11-9 తేడాతో విజయం సాధించింది. పూనాచా-ఎస్కోబార్ భాగస్వామ్యంగా గెలిచి ఛాంపియన్‌గా నిలిచిన మొట్టమొదటి ఛాలెంజర్ టైటిల్ కూడా ఇదే. తొలి సెట్‌లో పూనాచా-ఎస్కోబార్ నాలుగో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి బలమైన ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, ఏడో గేమ్‌లో తిరిగి బ్రేక్ చేసి ఇలాగన్ మరియు పోలింగ్ సెట్‌ను సమం చేశారు. ఆ తర్వాత అమెరికన్లు టైబ్రేక్‌లో ఆధిపత్యం చెలాయించి, దానిని 7-1 తేడాతో గెలుచుకున్నారు. భారత ఈక్వెడార్ ద్వయం రెండవ సెట్‌లో బలంగా పుంజుకుని, మూడవ గేమ్‌లోనే తొలి బ్రేక్ సాధించి ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. తొమ్మిదవ గేమ్‌లో మళ్లీ విజృంభించి మ్యాచ్‌ను సూపర్ టైబ్రేక్‌కు తీసుకువెళ్లారు. నిర్ణయాత్మక మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఏ జట్టు కూడా రెండు పాయింట్లకు మించి ఆధిక్యాన్ని సాధించలేకపోయింది. పూనాచా-ఎస్కోబార్ 7-9తో వెనుకబడి ఓటమి అంచున నిలిచినా చివరి నిమిషాల్లో నిర్ణయాత్మకమైన పుంజుకోవడంతో వరుసగా నాలుగు పాయింట్లు గెలుచుకుని, ఆ క్రమంలో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు.







## వరల్డ్ ఛాంపియన్‌షిప్..

# హైజంప్‌లో బసంత్ రజతం

## లాంగ్‌జంప్‌లో షానవాజ్ కాంస్యం

**న్యూఢిల్లీ:** ప్రపంచ అండర్20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత జంపర్లు మరో రెండు పతకాలను జోడించారు. అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రం, యూజీన్‌లో జరుగుతున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో బసంత్ హైజంప్‌లో రజత పతకం సాధించి భారతదేశానికి మొట్టమొదటి పతకాన్ని అందించగా, షానవాజ్ ఖాన్ కాంస్య పతకం గెలుచుకొని ఈ పోటీలో పతకం సాధించిన తొలి పురుష లాంగ్ జంపర్‌గా నిలిచాడు. బసంత్ తన రెండవ ప్రయత్నంలో తన వ్యక్తిగత అత్యుత్తమమైన 2.21 మీటర్లను సమం చేసి, కౌంట్‌బ్యాక్ ఆధారంగా అల్జీరియాకు చెందిన యూనెస్ అయాచి (2.21 మీటర్లు) వెనుక ఫైనల్‌లో రెండవ స్థానాన్ని పొందాడు. ఈలోగా, షహనవాజ్ తన అత్యుత్తమ ఫామ్‌ను కనుగొనలేకపోయినప్పటికీ, తన మూడవ ప్రయత్నంలో 7.84 మీటర్లు దూకి, యూజీన్‌లో డేనియల్ ఇంజోలి (ఇటలీ) మరియు మేసన్ మెక్‌గ్రోడర్ (ఆస్ట్రేలియా)ల వెనుక టాప్ 3 స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు. అంతకుముందు జరిగిన క్వాలిఫైయింగ్ రౌండ్‌లోని హీట్ 1లో మూడో స్థానంలో నిలిచిన భారత మహిళల 4x400 మీటర్ల రిలే జట్టు ఫైనల్‌కు చేరుకుంది. భూమికా నేహతే, తహురా ఖతున్, తనూ చౌదరి, థియా ఆరుముగమ్‌ల క్వార్టెట్ 3:39.53 సెకన్లతో స్లోవేకియాను ఓడించి హీట్ 1లో 3వ స్థానంలో నిలిచింది.

# కొరియా మాస్టర్స్‌లో అష్మితకు టైటిల్

**న్యూఢిల్లీ:** కొరియా మాస్టర్స్ సూపర్ 300 ఈవెంట్‌లో అష్మిత చలిహా మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని, బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సర్క్యూట్‌లో తన తొలి టైటిల్‌ను గెలుచుకుంది. ఆదివారం నాడు 53 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో, 26 ఏళ్ల క్రీడాకారిణి వెనుకబడి ఉన్నప్పటికీ పుంజుకుని నాలుగో సీడ్ చైనీస్ షట్లర్ హాన్ కియాన్ క్సీని 14-21, 21-14, 21-14 తేడాతో ఓడించింది. చాలిహా మ్యాచ్‌ను బాగా ప్రారంభించి, తొలి గేమ్‌లో 9-5 ఆధిక్యం సాధించింది. కానీ మిడ్‌గేమ్ తర్వాత ఆమె నియంత్రణ కోల్పోవడంతో, హాన్ ఆ గేమ్‌ను 21-14 తేడాతో గెలుచుకుంది. ఆమె రెండవ గేమ్‌ను మరింత మెరుగ్గా ఆడింది. ఈసారి తన ఆధిక్యాన్ని చేజార్చుకోకుండా, గేమ్‌ను 21 -14తో ముగించి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీయడం ద్వారా తన తొలి టైటిల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. హోరాహోరీగా సాగిన నిర్ణయాత్మక గేమ్‌లో, చివరి మధ్యంతర విరామ సమయానికి హాన్ 11-9 స్వల్ప ఆధిక్యంలో ఉంది, కానీ ఆ తర్వాత అష్మిత వరుసగా ఆరు పాయింట్లు గెలుచుకుని, చివరికి 21-14 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుంది. భారత మహిళల సింగిల్స్ ఈ ఏడాది అత్యుత్తమ సంవత్సరాలలో ఒకటిగా నిలుస్తోంది. దేవికా సిహాగ్, తన్వి శర్మ, అష్మిత, పివి సింధు వంటి విభిన్న క్రీడాకారిణులతో ఇప్పటికే నాలుగు టైటిళ్లను గెలుచుకుంది. మొత్తంగా, ఈ ఏడాది ఈ సర్క్యూట్‌లో భారతదేశానికి ఇది ఐదవ టైటిల్.



## శ్రీలంక వామప్ మ్యాచ్‌లో..

# భారత్ ఘన విజయం

**న్యూఢిల్లీ:** శ్రీలంక పర్యటన భారత్ ఘనంగా ప్రారంభించింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా శ్రీలంక ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆదివారం నాడు జరిగిన మూడో రోజు ఆటలో ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో 207 పరుగుల లక్ష్య ఛేదనలో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ నిర్ణీత 45 ఓవర్లలో 4 వికెట్లకు 214 పరుగులు చేసి గెలుపొందింది. యశస్వి జైస్వాల్(61) హాఫ్ సెంచరీతో రాణించగా, శుభ్‌మన్ గిల్(44), మహమ్మద్ సిరాజ్(32 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో కేశర నువాంత(2/57)రెండు వికెట్లుతీయగా, విశ్వ ఫెర్నాండో, రమేష్ మెండీస్ తలో వికెట్ తీసారు. భారత్ విజయానికి ఆఖరి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో టెయిలెండర్ సిరాజ్‌తో పాటు, సరాన్ష్ జైన్ ఉండటంతో విజయం కష్టమేనని అంతా అనుకున్నారు. కానీ సిరాజ్ అనూహ్యంగా హ్యాట్రిక్ సిక్స్‌లు బాది విజయాన్ని అందించాడు. లంక జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు నష్టానికి 200 పరుగులు చేసి టీమిండియా ముందు 207 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. నిషాన్ మధుష్క (63) అర్థ సెంచరీతో రాణించగా, అంజల బండార (35), నిపున్ ధనంజయ్ (46)తో రాణించారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 357 వద్ద డిక్లేర్ చేసింది. పడిక్కల్ (142 నాటౌట్), రవీంద్ర జడేజా (63), రాహుల్ (40), మానవ్‌సుతార్ (41), గుర్నూర్ బ్రార్ (36 నాటౌట్), సరాన్ష్ జైన్ (22) స్కోరు చేశారు. దీని ముందు లంక తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు నష్టానికి 363 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. నిషాన్ మధుష్క (66), రవిందు రాషాంత (71), సోనల్ దినుష (52) రాణించారు.



## కృత్రిమ మేధతో భారత్‌లో


# ఉద్యోగ సృష్టి ఎక్కువే



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీల్లో వేలాది ఉద్యోగాల కోతలు జరిగాయి. వరుసగా లేఆఫ్స్ ప్రకటిస్తున్నా భారతీయ ఉద్యోగ మార్కెట్ పై దీని ప్రభావం భిన్నంగా ఉందని గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ నోమురా వెల్లడించింది. భారత్‌లో ఎఐ కారణంగా కోల్పోయిన ఉద్యోగాలకంటే ఎఐ ఆధారిత టెక్నాలజీల వల్ల కొత్తగా సృష్టిస్తున్న ఉద్యోగాల సంఖ్యే ఎక్కువగా ఉందని నోమురా తన నివేదికలో స్పష్టం చేసింది. లేఆఫ్స్‌తో పోలిస్తే భారత్‌లో ఎఐ నియామకాలు దాదాపు 3 రెట్లు ఉన్నట్లు నోమురా నివేదిక పేర్కొంది. 2022 నుంచి 2026 ఆగస్టు వరకు చూసుకుంటే భారతీయ కంపెనీలు ఎఐ కారణంగా 31,921 మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. ఇదే సమయంలో 83,100 ఎఐ ఆధారిత కొత్త నియామకాలు చేపట్టినట్లు నివేదిక తెలిపింది. ఎఐ చాట్‌బాట్లను వినియోగించడంతో చాలా కంపెనీలు తమ సపోర్ట్ టీమ్స్‌లో కోతలు చేపట్టినట్లు తెలిపింది. ఎఐ ఆధారిత డిమాండ్‌ను భర్తీ చేసేందుకు ఐటీ సేవల గ్రాడ్యుయేట్ల నియామకాలు పెరిగినట్లు తెలిపింది. ఎఐ విధానాలతో ఇండియా, సౌత్ కోరియా వంటి దేశాల్లో రెండంచెల కార్మిక మార్కెట్ సృష్టి జరిగిందని నోమురా అంచనావేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలకు డిమాండ్ తగ్గినావ్యాపార కార్యకలాపాల్లో అనుభవజ్ఞులైన ఉద్యోగులకు అవకాశాలు మెరుగుపడు తున్నాయని తెలిపింది. గడిచిన నాలుగు సంవత్సరాల్లో ఆసియా వ్యాప్తంగా 1.3 లక్షలకు పైగా ఎఐ ఆధారిత నియామకాలు జరిగాయని తెలిపింది. ఇందులో 90 శాతం టెక్నాలజీ రంగంలోనే ఉన్నాయని పేర్కొంది. ఆసియా కంపెనీలు గత నాలుగేళ్లలో 60,654 ఉద్యోగులను తొలగించాయని, అందులో 60 శాతం ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలోనే ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

# 4.5 బిలియన్ డాలర్ల షేర్ బైబాక్

## బెర్క్‌షైర్ వ్యూహాల్లో మార్పులు




**న్యూయార్కు, ఆగస్టు 9:** వారెన్ బఫెట్ నుంచి గ్రెగ్ అబెల్ చేతుల్లోకి వచ్చిన తర్వాత బర్క్‌షైర్ హాత్‌వే వ్యూహంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఈ యేడాది రెండో త్రైమాసికంలో సుమారు 4.5 బిలియన్ డాలర్ల విలువైన సొంత షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. 2021 తర్వాత ఒక త్రైమాసికంలో బర్క్‌షైర్ చేపట్టిన అతిపెద్ద షేర్ బైబ్యాక్ ఇదే. జూన్‌తో ముగిసిన మూడు నెలల్లో కంపెనీ నిర్వహణ కార్యకలాపాల ద్వారా వచ్చే లాభం 16 శాతం పెరిగి దాదాపు 13 బిలియన్ డాలర్లకు చేరింది. తయారీ, సేవలు, రిటైల్ విభాగాల్లో మెరుగైన పనితీరు కంపెనీ లాభాల వృద్ధికి దోహదపడింది. వివిధ రంగాల్లో విస్తృత వ్యాపారాలు, పెట్టుబడులు కలిగి ఉన్న బర్క్‌షైర్ ఫలితాలను అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిస్థితులకు ఒక ముఖ్యమైన సూచికగా ఇన్వెస్టర్లు పరిగణిస్తారు. భారీ నగదు నిల్వలకు కదలిబర్క్‌షైర్ భారీ నగదు నిల్వలను పెట్టుబడుల వైపు మళ్లించడంతో త్రైమాసికం చివరికి నగదు, నగదుకు సమానమైన ఆస్తులు 365.5 బిలియన్ డాలర్లకు తగ్గాయి. ఇదే సమయంలో కంపెనీ దాదాపు 20 బిలియన్ డాలర్ల నికర ఈక్విటీ కొనుగోళ్లు చేపట్టింది. వారెన్ బఫెట్ నాయకత్వంలో గత కొన్నేళ్లుగా బర్క్‌షైర్ కొత్త కొనుగోళ్లు, పెట్టుబడుల విషయంలో ఆచితూచి వ్యవహరించింది. ముఖ్యంగా అమెరికా మార్కెట్లలో కంపెనీల విలువలు భారీగా పెరగడంతో, బర్క్‌షైర్ అనుసరించే విలువ ఆధారిత పెట్టుబడి విధానానికి సరిపడే అవకాశాలు పరిమితమయ్యాయి. సిఇఒగా బాధ్యతలు చేపట్టిన గ్రెగ్ అబెల్ మార్పు తెస్తున్నారు. కంపెనీ వద్ద ఉన్న అపారమైన మూలధనాన్ని సరైన అవకాశాల్లో పెట్టుబడి పెట్టేందుకు ఆయన మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. బైబ్యాక్‌లకు మళ్లీ ప్రాధాన్యంఏడాదికి పైగా సొంత షేర్ల కొనుగోళ్లకు దూరంగా ఉన్న బర్క్‌షైర్ ఈ యేడాది తొలి త్రైమాసికంలో బైబ్యాక్‌లను పునఃప్రారంభించింది. రెండో త్రైమాసికంలో 4.5 బిలియన్ డాలర్ల బైబ్యాక్ చేయడం ద్వారా కంపెనీ తన సొంత షేర్ల విలువపై యాజమాన్యానికి ఉన్న విశ్వాసాన్ని మరోసారి చాటింది. 6.8 బిలియన్ డాలర్లకు టేలర్ మారిసన్ హోమ్ కార్పొరేషన్‌ను కొనుగోలు చేసింది.

# ద్రవ్యోల్బణం, త్రైమాసిక ఫలితాలే కీలకం



## ఈ వారం మార్కెట్లకు లాభం కానున్న పశ్చిమాసియా వార్

**ముంబయి, ఆగస్టు 9:** రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, హార్ముజ్ జలసంధిపై అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్‌ఐఐ) ప్రవాహాలు వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయనున్నాయి. వరుసగా రెండో వారం లోనూ బెంచ్‌మార్క్ సూచీలు లాభాలతో ముగియడంతో మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగుతోంది. గత వారంలో భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో వారం లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు భారీగా తగ్గడం, రూపాయి కొంత బలపడటం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగడం మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. జూన్ త్రైమాసిక రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ 12న విడుదల చేయనుంది. అధికారిక గణాంకాల ప్రకారం జూన్‌లో హెడ్‌లైన్ సిపిఐ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా నమోదైంది. ఇది ఆర్బీఐ నిర్దేశించిన 4 శాతం లక్ష్యంకంటే అధికంగా ఉన్నప్పటికీ, నిర్దేశిత సహన పరిమితిలోనే ఉంది. ఆహారం, ఇంధన ధరలు ద్రవ్యోల్బణంపై ప్రధాన ప్రభావం చూపాయి. ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ వచ్చే వారంలోనూ కొనసాగనుంది. ఆగస్టు 10న లాయిడ్స్ మెటల్స్ అండ్ ఎనర్జీ, బాష్, భారత్ ఫోర్జ్, లిండే ఇండియా, ఇన్ఫోఎడ్జ్, వొడాఫోన్ ఐడియా తదితర కంపెనీలు తమ ఫలితాలను ప్రకటించనున్నాయి. 11న సీమెన్స్, జైడస్ లైఫ్ సైన్సెస్ తదితర కంపెనీలు ఫలితాలను వెల్లడించనున్నాయి. మొత్తంమీద వచ్చే వారంలో 250కి పైగా కంపెనీలు తమ త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్నట్లు కార్పొరేట్ ఎర్నింగ్స్ క్యాలెండర్లు సూచిస్తున్నాయి. ఎఫ్‌ఐఐల పెట్టుబడులపై దృష్టి ఇటీవలి సెషన్లలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు మిశ్రమంగా కొనసాగాయి. ఈనెల7న నగదు విభాగంలో ఎఫ్‌ఐఐలు రూ.480.20 కోట్ల విలువైన షేర్లను నికరంగా కొనుగోలు చేశారు. గతవారంలో కొంతమేర విక్రయాలు జరిపిన నేపథ్యంలో ఈ కొనుగోళ్ల మార్కెట్ సెంటిమెంట్‌కు ఊతమిచ్చాయి. ముడి చమురుధరల పతనం కీలక మద్దతుముడి చమురు ధరలు గణనీయంగా తగ్గడం దేశీయ మార్కెట్లకు ప్రధాన సానుకూల అంశంగా మారింది. జూలైలో బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా ఉన్న బ్రెంట్ క్రూడ్‌ధర ప్రస్తుతం సుమారు 79-83 డాలర్ల స్థాయికిపడిపోయింది. దీనితోపాటు రూపాయి విలువకూడా డాలర్‌తోపోలిస్తే 95.3-95.4 స్థాయిలో కొంతస్థిరంగా ఉండటం మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతు అందిస్తోంది. మొత్తంగా వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్ల దిశను రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, కంపెనీల క్యూ1 ఫలితాలు, ముడిచమురు ధరలు, రూపాయి కదలికలు, ఎఫ్ఐఐల పెట్టుబడులు, హోర్ముజ్ జలసంధిపై అమెరికా-ఇరాన్ నిర్ణయాలు కీలకం కానున్నాయి.

# ఈ వారంలో 10 కొత్త ఫండ్స్




**ముంబయి, ఆగస్టు 9:** స్టాక్ మార్కెట్లో హెచ్చుతగ్గులున్న క్రమంలోమ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్టర్లు కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్నారు. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ సిప్ లేదా లంప్‌సమ్ విధానంలో పెట్టుబడులు పెట్టాలనుకునే ఇన్వెస్టర్ల కోసం ఇటి మ్యూచువల్ ఫండ్స్ టాప్ 10 ప్రధాన మ్యూచువల్ ఫండ్ల జాబితాను ప్రకటించాయి. పరాగ్ పరీఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ లార్జ్‌క్యాప్ కేటగిరీలో టాప్‌లోఉంది. విదేశీ, దేశీయ ఈక్విటీల్లో సమతుల్య పెట్టుబడులతో స్థిరమైన రాబడులను అందిస్తోంది. కెనరా రోబెకో బ్లూచిప్ ఈక్వీటీ ఫండ్ లార్జ్ క్యాప్ విభాగంలో తక్కువ రిస్క్‌తో స్థిరత్వం అందించే ఫండ్, ఐసిఐసిఐ ప్రూడెన్షియల్ బ్లూచిప్ ఫండ్ పెద్ద తరహా కంపెనీల్లో పెట్టుబడి పెట్టడానికి నమ్మకమైన లార్జ్ క్యాప్ ఫండ్. మిరాయ్ అసెట్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ పెరుగుతున్న మిడ్ క్యాప్ కంపెనీలు, స్థిరమైన లార్జ్ క్యాప్ కాంబినేషన్‌తో మంచి గ్రోత్ పొటెన్షియల్ ఉన్న ఫండ్ ఇదే. హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఫండ్ మేనేజర్ అసెట్ కేటాయింపులు మార్చే సామర్థ్యం ఉన్న ఫండ్ కోటక్ ఎమర్జింగ్ ఈక్వీటీ ఫండ్ మిడ్ క్యాప్ విభాగంలో అత్యంత స్థిరమైన పనితీరును కనబరుస్తోంది. నిప్పాన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ స్మాల్ క్యాప్ విభాగంలో పెద్ద పరిమాణంలో నిధులను సేకరించి మంచి రాబడులను అందించిన ఫండ్. ఎస్‌బీఐ స్మాల్‌క్యాప్ ఫండ్ దీర్ఘకాలికంగా పెట్టుబడిపెట్టే అగ్రెసివ్ ధోరణి ఉన్న ఇన్వెస్టర్లకు ఈఫండ్ అనుకూలం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ ఈక్విటీ, డెట్ అసెట్లలో డైనమిక్ కేటాయింపులు జరుపుతూ మార్కెట్ నష్టాల నుంచి రక్షణ కల్పిస్తుంది. యూటీఐ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్ తక్కువ ఖర్చుతో నిఫ్టీ 50 సూచీలో ఇన్వెస్ట్ చేసే ఇండెక్స్ ఫండ్.




## తొమ్మిది కంపెనీల ఐపిఒలు..

# రూ.7681 కోట్లు సమీకరణ

**ముంబయి, ఆగస్టు 9:** స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు పండగే. భారతీయ ప్రాథమిక మార్కెట్ ఈవారం పబ్లిక్ ఇష్యూలతో బిజీ అవుతోంది. ఇకామర్స్ ఎనేబుల్మెంట్ ప్లాట్ ఫామ్ షిప్‌రాకెట్, డెయిరీ బ్రాండ్ మిల్కీ మిస్ట్ వంటి దిగ్గ కంపెనీలతో సహా మొత్తం 9 కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ఈ కంపెనీలు అన్నీ కలిసి రూ.7,681 కోట్లు సమీకరించేందుకు మార్కెట్లోకి వస్తున్నాయి. మోల్బియో డయోగ్నిస్టిక్, ధూత్ ట్రాన్స్‌మిషన్, మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్, ఫాస్కినేట్ టెక్స్‌టైల్స్, షిప్‌రాకెట్, బెహారీ లాల్ ఇంజినీరింగ్, ప్రమోదిని మెడికేర్, క్యూ అండ్ టీ ఫుడ్స్, షామ్ ఫామ్ వంటివి ఉన్నాయి. ఈ కంపెనీల పబ్లిక్ ఇష్యూలు ఈనెల 10 నుంచి 12వ తేదీల మధ్య సబ్‌స్క్రిప్షన్ ప్రారంభిస్తున్నాయి. ఆగస్టు 14 వరకు సబ్‌స్క్రిప్షన్ కొనసాగనుంది. వీటితో పాటు ఈ వారం ఏకంగా 8 కంపెనీలు మార్కెట్ల లిస్టింగ్ కానున్నాయి. ఈ వారం వస్తున్న పబ్లిక్ ఇష్యూల్లో ధూత్ ట్రాన్స్‌మిషన్ అతిపెద్ద ఐపీఓగా నిలిచింది. ఈ పబ్లిక్ ఇష్యూ 10వ తేదీన మొదలై 12వ తేదీతో ముగుస్తుంది. ఈ మెయిన్‌బోర్డ్ ఐపీఓ షేరు ధరలు రూ.829-871గా నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద రూ.3066.89 కోట్లు సమీకరించనుంది. మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్ ఐపీఓ మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 11వ తేదీన మొదలై 13వ తేదీతో ముగుస్తుంది. రూ.1553 కోట్లు సమీకరించే లక్ష్యంతో మెయిన్‌బోర్డు విభాగంలో వస్తోంది. షేర్ల ప్రైస్ బ్యాండ్ రూ.133-140 గా నిర్ణయించారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 1428 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.125 కోట్లు సమీకరించనుంది. ఈ ఐపీఓ జీఎంపీ 19 శాతంగా ఉంది. షిప్ రాకెట్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ధరలు రూ.92-97గా నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద రూ.1617.48 కోట్లు సమీకరించనుంది. ఇందులో ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.885.50 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.731.98 కోట్లుగా సమీకరించనున్నారు. మొల్బియో డయాగ్నోస్టిక్స్ లిమిటెడ్ ఐపీఓ మెయిన్‌బోర్డు విభాగం నుంచి వస్తోంది. రూ.939.70 కోట్లు సమీకరించనుంది. షేరు ధరలు రూ.768807 గా నిర్ణయించారు. బెహారీ లాల్ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 12న ప్రారంభమయి రూ.301.62 కోట్లు సమీకరించనుంది. షేరు ధరలు రూ.271-285 గా నిర్ణయించారు. ఇక ఎస్ఎంఈ విభాగం నుంచి ప్రమోదిని మెడికేర్ రూ.69.04 కోట్లు సమీకరించనుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
**వార్త**

రాజమహేంద్రవరం | సోమవారం 10 ఆగస్టు 2026 | I


# వాడపల్లి క్షేత్రంలో భక్తులు సందడి...

## నిత్యాన్న పథకానికి రూ,101116/- విరాళం...

**ఆత్రేయపురం, ఆగస్టు 09,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రంగా శోభిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం ఏకాదశి కావడంతో బారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.వేలాది మంది





భక్తుల రాకతో ఆలయ పరిసరాలన్నీ గోవిందనామ స్మరణతో సందడి గా మారింది.ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, బాల భోగం, నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అలాగే తణుకు చెందిన కాటూరి లక్ష్మణరావు, విజయ వెంకట లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ.101116/- విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండాదేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

# మాల్ నుంచి మృత్యువు దాకా..

## ఆ 8 నిమిషాల్లో ఏం జరిగింది?

**సీసీ కెమెరాలు విప్పిన ప్రసాదిత్య మాల్ ప్రమాదం గుట్టు**
**మద్యం.. వాగ్వాదం.. వేగం.. వెనుక నుంచి ఢీకొట్టిన కారు..**
**చివరకు డాక్టర్ ప్రియాంక మృతి**
**ఎస్పీ నరసింహ కిషోర్ వెల్లడించిన దర్యాప్తు కీలక అంశాలు**



**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 9: (ప్రభాతవార్త)** ఒక సినిమా చూడాలనుకున్నారు.. మాల్‌కు వెళ్లారు.. కానీ అక్కడ జరిగిన పరిణామాలు ఓ యువ వైద్యురాలి ప్రాణాలను బలిగొన్నాయి. ప్రసాదిత్య మాల్ వద్ద ఆగస్టు 3న జరిగిన ఘటన సాధారణ రోడ్డు ప్రమాదమా? లేక మద్యం మత్తు, వాగ్వాదం, దూకుడు డ్రైవింగ్ కలిసి విషాదానికి దారితీశాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలను సీసీ కెమెరాలు, సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా పోలీసులు వెలికితీశారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు దర్యాప్తు వివరాలను వెల్లడించారు.

**మొదటి క్లూ.. సీసీ కెమెరా**

ఆగస్టు 3 రాత్రి సుమారు 9.40 గంటల సమయంలో డాక్టర్ కనికే ప్రియాంక, ఆమె స్నేహితుడు వి. వెంకట దుర్గా సాయి ఉమేష్ ద్విచక్ర వాహనంపై మాల్ నుంచి బయటకు వస్తుండగా టాటా నెక్సాన్ కారు వారిని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదం అనంతరం కారు అక్కడి నుంచి వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న ప్రకాష్‌నగర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. వాహనం నంబర్ ఏపీ40 జీఖీ 6299గా గుర్తించడం దర్యాప్తులో తొలి కీలక మలుపుగా మారింది.

**మద్యం.. మాల్‌లోనే వాగ్వాదం**

పోలీసుల దర్యాప్తులో నిందితులు ఘటనకు ముందే మద్యం సేవించినట్లు ఆధారాలు లభించాయి. మాల్‌లో రెండో ఆట సినిమా చూసేందుకు వెళ్లిన సమయంలో సెక్యూరిటీ సిబ్బంది వారిని లోపలికి అనుమతించలేదని పోలీసులు తెలిపారు. ఆ సమయంలో సెక్యూరిటీతో వాగ్వాదం జరిగినట్లు సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తించారు. అనంతరం నిందితులు పార్కింగ్ ప్రాంతానికి వెళ్లి కారులో బయటకు వచ్చారు. అదే సమయంలో డాక్టర్ ప్రియాంక, ఉమేష్ ద్విచక్ర వాహనంపై మాల్ నుంచి బయటకు వెళ్తున్నారు.

**ఒక్క ఢీకొట్టుడే.. ఓ కుటుంబానికి శాశ్వత విషాదం**

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. నిందితులు ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి బాధితుల ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రియాంక తీవ్రంగా గాయపడ్డారు. తొలుత రాజమహేంద్రవరం జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రికి తరలించి, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ప్రియాంక ఆదివారం మధ్యాహ్నం 3.22 గంటలకు మృతి చెందినట్లు కిమ్స్ ఆసుపత్రి నుంచి ప్రకాశ్‌నగర్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్పటి వరకు ఉన్న కేసును 106(2) తీ/ష 3(5) దీఘా కిందకు మార్చారు.

**దర్యాప్తులో వరుస ఆధారాలు**

ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. మాల్‌లోని వివిధ ప్రాంతాల సీసీ ఫుటేజీలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, ఫోన్ కాల్ వివరాలు, వాహన రికార్డులు, సినిమా టికెట్లు, గేట్ పాస్‌లు, డ్రంకెన్ డ్రైవ్‌కు సంబంధించిన ఆధారాలను సేకరించారు. ఈ ఆధారాల ఆధారంగా సురవరపు దాస్వంత్, దేశభక్తుల ఆంధ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్‌లను ఆగస్టు 6న అరెస్ట్ చేశారు. ఆగస్టు 7న కోర్టులో హాజరుపరచగా ఈ నెల 21 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

**కేసులో తదుపరి అడుగు ఏంటి?**

కేసులో మరిన్ని వివరాలను వెలికితీసేందుకు నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకుని విచారించేందుకు కోర్టును ఆశ్రయించనున్నట్లు ఎస్పీ తెలిపారు. న్యాయ నిపుణులు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలతో దర్యాప్తు పూర్తి చేసి త్వరగా చార్జిషీట్ దాఖలు చేస్తామని చెప్పారు. ఈ కేసులో సీసీ కెమెరాలు కీలక సాక్ష్యాలుగా మారాయి. ప్రమాదానికి ముందు నిందితుల కదలికల నుంచి ప్రమాదం అనంతరం వారు వెళ్లిన మార్గం వరకు సాంకేతిక ఆధారాలను పోలీసులు విశ్లేషిస్తున్నారు. సాధారణ ప్రమాదంగా మొదలైన కేసు.. వైద్యురాలి మృతితో తీవ్రమైన క్రిమినల్ కేసుగా మారింది. ఇప్పుడు పోలీస్ కస్టడీ విచారణలో మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తాయా అన్నదే కీలకంగా మారింది.

# కళింగల కట్టడి.. రైతుల కడగండ్లు!

**బల్లలు తీయక సాగునీటికి అడ్డుకట్ట**
**సింహాద్రిరాజు కాలువకు నీరు బంద్.. 8 వేల ఎకరాలు బీడేనా?**
**గెద్దనాపల్లి, కిర్లంపూడి వద్ద అడ్డంకులతో నారుమళ్లు ఎండిపోతున్నాయంటున్న రైతులు**



**పిఠాపురం, ఆగస్టు 9( ప్రభాతవార్త )**సాగునీటి కోసం రైతులు కళ్లలో ఒత్తులతో ఎదురుచూస్తుంటే.. కాలువల్లో మాత్రం నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెద్దనాపల్లి, కిర్లంపూడి ప్రాంతాల్లో కళింగల బల్లలు తొలగించకపోవడంతో సింహాద్రిరాజు కాలువకు సాగునీరు చేరడం లేదని బి కొత్తూరు, గోకివాడ, రాపర్తి, భోగాపురం, బి ప్రత్తిపాడు, రాయవరం, పి. తిమ్మాపురం వెల్లర్ల, పి. దొంతమూరు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా సుమారు 8 వేల ఎకరాల ఆయకట్టు సాగునీటికి దూరమై బీడు భూములుగా మారే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నారుమళ్లకు నీరేదీ?**

ప్రస్తుతం గ్రామాల్లో రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. నాట్లకు సమయం దగ్గరపడుతున్నా కాలువలో నీటి జాడ కనిపించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నారుమళ్లు ఎండిపోతున్నాయని వారు చెబుతున్నారు. సకాలంలో నీరు అందకపోతే నారుమళ్లు దెబ్బతినడంతో పాటు తిరిగి నారుమళ్లు వేసుకోవాల్సి వస్తుందని, దీంతో అదనపు పెట్టుబడి భారం పడుతుందని రైతులు వాపోతున్నారు.

**రెండు కళింగలు.. వేల ఎకరాల ప్రశ్న!**

గెద్దనాపల్లి, కిర్లంపూడి ప్రాంతాల్లో రెండు కళింగలు నిత్యం మూసి ఉండటంతో సింహాద్రిరాజు కాలువకు నీరు చేరడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గెద్దనాపల్లి వద్ద కళింగల బల్లలు తీయకపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని చెబుతున్నారు. ఈ అడ్డంకులు తొలగిస్తే కాలువలో నీటి ప్రవాహం సక్రమంగా సాగి దిగువ ఆయకట్టుకు నీరు అందే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. అయితే సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదులు.. హామీలే!**

సాగునీటి సమస్యపై జలవనరుల శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాలతో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామనిచెబుతున్నారు. కలెక్టర్ గతంలోహామీ ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మారలేదని వారు అంటున్నారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే తమకు ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**కలెక్టర్ జోక్యంపై ఆశలు**

8 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందాల్సిన పరిస్థితిలో జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు. గెద్దనాపల్లి, కిర్లంపూడి వద్ద కళింగలను అధికారులు స్వయంగా పరిశీలించి నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను గుర్తించి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. సింహాద్రిరాజు కాలువకు నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నారుమళ్లు ఎండిపోయిన తర్వాత చర్యలు తీసుకుంటే ప్రయోజనం ఉండదని, ఇప్పుడే అధికారులు కదలాలని రైతులు స్పష్టం చేస్తున్నారు.

**అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నాం :**



అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నామని నీరు లేకపోవడంతో నారుమడులు ఎండిపోతున్నాయని బి కొత్తూరు గ్రామానికి చెందిన గుండుబిల్లి కాశి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సాగునీటికి అడ్డంకులు తొలగించాలని కోరారు.

**నారుమళ్లు ఎండిపోతే అధికారులదే బాధ్యత :**



నారు ముళ్ళు ఎండిపోతే అధికారులే బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలని పి.దొంతమూరు గ్రామానికి చెందిన కోసెట్టి లావు బాబు డిమాండ్ చేశారు. వ్యవసాయం పండకపోతే ఆత్మహత్యలు చేసుకోవలసిన పరిస్థితి వస్తుందని వాపోయారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవ జిల్లాస్థాయి వేడుకలు ఘనంగా నిర్వహణ

## ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 9,(ప్రభాతవార్త)** గిరిజన యువత తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే ప్రభుత్వం అందిస్తున్న విద్య, ఉపాధి, శిక్షణ, సంక్షేమ అవకాశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన అనంతరం అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, బిర్సా ముండా తదితర మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన జీవన విధానం ఆదర్శం కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతికి అత్యంత సమీపంగా జీవించే గిరిజన సమాజానికి చెట్టు, ఋతువులు, వాతావరణం, ప్రకృతి చక్రాలపై అపారమైన అవగాహన ఉందన్నారు. గిరిజనుల సంస్కృతి, కళలు, సంప్రదాయాలు తరతరాలకు అందుతున్నాయని ప్రశంసించారు. గిరిజన విద్యార్థుల సౌకర్యార్థం రెండు హాస్టల్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామని చెప్పారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ గిరిజన అభివృద్ధి అంటే వారి మూలాలను మార్చడం కాదని, సంస్కృతి, జీవన విధానాన్ని పరిరక్షిస్తూ విద్య, వైద్యం వంటి ఆధునిక సదుపాయాలు అందించడమే నిజమైన అభివృద్ధి అన్నారు. గిరిజనుల హక్కులపై యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని అవాంతరాలను అధిగమిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆర్డీవో ఆర్. శివాజ్యోతి మాట్లాడుతూ బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. జిల్లా ఉపాధి అధికారి శిరీష ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆకట్టుకున్న దింసా నృత్యాలు గిరిజన నాయకులు ప్రొఫెసర్ మల్లి భాస్కరరావు, గరికపాటి సురేష్, తాడేపల్లి విజయ్ గిరిజన చరిత్ర, హక్కుల సాధనపై అవగాహన కల్పించారు. అనంతరం వారిని సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ దింసా నృత్యాలు, అడవుల పరిరక్షణపై నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఎస్టీ సంఘాల నాయకులు, వసతి గృహాల విద్యార్థులు, గిరిజన యువత పాల్గొన్నారు.

# చింతూరులో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు.





**చింతూరు ఆగస్టు 9 ప్రభాత వార్త.** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివారం చింతూరులో ఘనంగా నిర్వహించారు. చింతూరు ఐ టీ డి ఏ కార్యాలయంలో ప్రాంగణంలో ఏ పి ఓ రామ తులసి, ఆదివాసీ నాయకులతో కలిసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు ఘన నివాళి అర్పించారు. అనంతరం జాతీయ జెండా మరియు ఆదివాసీ జెండాను ఎగురవేశారు. అక్కడి నుండి బైక్ ర్యాలీగా చింతూరు సెంటర్‌కు చేరుకుని, అక్కడ ఉన్న గిరిజన నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆదివాసీ నాయకుల చేత ఆదివాసీ జెండాను ఎగురవేసిన అనంతరం ఏ పి ఆర్ లో ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక వద్దకు చేరుకున్నారు.అక్కడ వెలుగు, విద్య, వైద్యం, జీసీసీ , ఐ.సీ.డి ఎస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఏ పి ఓ రామ తులసి, మరియు ఆదివాసీ నాయకులు సందర్శించారు. అనంతరం ఆదివాసీ జెండాను ఎగురవేశారు. ప్రధాన వేదిక వద్ద బిర్సా ముండా, కొమరం భీమ్, గంటం దొర, మల్లుదొర, కొపర్ లింగో తదితర ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు చింతూరు ఏ ఎస్ పి. హేమంత్,ఏ పి ఓ రామ తులసి, చింతూరు డివిజన్, మరియు ఆదివాసీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వందేమాతరం మరియు ఆదివాసీ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు జెట్. పి. టీ. సి.చిచ్చడి మురళి, మడి.వి. నెహ్రూ, ఆల్ ఇండియా ఎంప్లాయీస్ అసోసియేషన్ నేషనల్ సెక్రటరీ, కుంజ శ్రీను, ఆదివాసీ సంక్షేమ పరిషత్ సెక్రటరీ, జల్లి నరేశ్, ఆదివాసీ డివిజన్ చైర్మన్; కుర్సం సుబ్బారావు, ఆదివాసీ సీనియర్ నాయకులు; సీసం సురేశ్, గిరిజన సంఘం స్టేట్ సెక్రటరీ; సోడే నారాయణ, ఆదివాసీ టీచర్ యూనియన్ నాయకులు; తిమ్మ సాయి వెంకట రమణ, ఆదివాసీ ఫారెస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొని ఆదివాసీల హక్కులు, బాధ్యతలు, జి ఓ నెంబర్ 3 మరియు 1/70 చట్టం తదితర అంశాలపై ప్రసంగించారు. అమరావతిలో భూములకు పరిహారం అందిస్తున్న విధంగానే చింతూరు డివిజన్‌లో కూడా భూములకు తగిన భూపరిహారం అందించాలని కోరుతూ తీర్మానం చేసి, సంబంధిత దరఖాస్తులను అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారికి అందజేశారు.ఈ సందర్భంగా చింతూరు ఏ ఎస్ పి. హేమంత్ మాట్లాడుతూ ఆదివాసీ యువత విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. యువత మద్యం, గంజాయి, జూదం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు పాల్పడకూడదని సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో నైపుణ్యం కనబరిచిన 10 మంది గిరిజన ఆదివాసీలను, పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 11 మంది గిరిజన విద్యార్థులను, అలాగే ఉత్తమ సేవలందించిన 4 మంది గిరిజన ఉద్యోగులను ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. అనంతరం ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# అన్నవరం కొండపై నెయ్యి ఓత్తుల షాపు ఆకస్మిక తనిఖీ.



**అన్నవరం జూలై10 (ప్రభాతవార్త),** అన్నవరం శ్రీ వీర వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం రత్నగిరి కొండపై విక్రయిస్తున్న నెయ్యి వత్తుల నాణ్యతపై నల్లం సూర్య చక్రధరరావు ఆదివారం ఉదయం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రత్నగిరిపై స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు విక్రయిస్తున్న నెయ్యి వత్తుల నాణ్యత, ప్రమాణాలపై ఆయన స్వయంగా ఆరా తీశారు. నెయ్యి వత్తుల షాపును సందర్శించి అక్కడ విక్రయానికి ఉంచిన నెయ్యి వత్తులను పరిశీలించారు. ? ఓత్తులలో ఉపయోగిస్తున్న నెయ్యి నాణ్యతగా ఉందో లేదో, మిశ్రమాలు ఏమైనా కలుపుతున్నారా అనే దానిపై వ్యాపారులను ప్రశ్నించారు. భక్తుల నమ్మకాన్ని, భక్తిభావాన్ని వ్యాపార సరుకుగా మార్చవద్దని, నాణ్యమైన నెయ్యి ఓత్తులను మాత్రమే నిర్ణీత ధరలకు విక్రయించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కల్తీ నెయ్యి వఓత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని వ్యాపారులను హెచ్చరించారు. స్వామివారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తుల నమ్మకాన్ని కాపాడటం మన అందరి బాధ్యత ఈఓ చక్రధరరావు తెలిపారు..



# దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయా సాధనకు కృషి చేయాలి

## -- దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 9 (ప్రభాతవార్త):**శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు. కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామంలో ఏర్పాటు చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మిన మహనీయుడని కొనియాడారు. విద్యాభివృద్ధి కోసం తనకున్న వందలాది ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప దాత, సేవా తత్పరుడని పేర్కొన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డిలోని సేవా గుణాలను నేటి తరం ఎంతైనా ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన స్ఫూర్తితో విద్య, వైద్య రంగాల్లో శెట్టిబలిజ సమాజంతో పాటు అన్ని వర్గాల ప్రజలు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని ప్రభుత్వపరంగా అధికారికంగా ప్రకటించి ఉత్సవాలు నిర్వహించామని మంత్రి సుభాష్ తెలిపారు. దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసే వైసిపి పార్టీకు ప్రజలు గత ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పారని మంత్రి సుభాష్ అన్నారు. సమాజంలో విభేదాలు సృష్టించడం కాకుండా అన్ని వర్గాలను కలుపుకొని రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు, గుత్తుల సాయి తదితరులు మాట్లాడుతూ దొమ్మేటి ఆశయాల సాధనకు, అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అందరూ దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు శెట్టిబలిజ సమాజంతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత పాలిక శ్రీను, పంతం సందీప్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చేటి విజయలక్ష్మి,కడలి ఈశ్వరి, చప్పిడి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి చంద్రమౌళి,కూడా చైర్మన్ తలాటం సత్య, జడ్పీటీసీ గుబ్బల తులసికుమార్, సత్య స్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకట రమణ, టీడీపీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస బాబా, మాజీ జెడ్పీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు,కాకినాడ జిల్లా శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు చొల్లంగి వేణుగోపాల్ , మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పితాని అప్పన్న,బీసీ సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# మెడికో ప్రియాంక మృతి పట్ల మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి

**సీఎం చంద్రబాబు, ఆదేశాల మేరకు బాధితురాలి కుటుంబానికి ఇప్పటివరకు అయిన వైద్య ఖర్చులతో పాటు రూ. 20 లక్షల పరిహారం**
**కేసు విచారణను వేగవంతం చేసి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలకు హామీ**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు9,ప్రభాతవార్త.** సికింద్రాబాద్‌లో చికిత్స పొందుతూ రాజమహేంద్రవరానికి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి చెందడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విచారం వ్యక్తం చేశారు. ఈ విచారకర ఘటనను మొదటి నుండి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించిందని ఒక ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. నిర్లక్ష్యంతో నిండు ప్రాణాన్ని బలితీసుకున్న బాధ్యులెవరినీ విడిచిపెట్టేది లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. బాధ్యులకు కఠిన శిక్ష పడేలా సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. మృతురాలు ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ. 20 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించినట్లు వెల్లడించారు. అంతేగాక ఇప్పటివరకు ప్రియాంక చికిత్స కోసం అయిన మొత్తం ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు.కేసు విచారణను వేగవంతం చేసి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన నిబంధనలు అమలు చేస్తామని వెల్లడించారు. ప్రియాంక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని, తగిన న్యాయం చేకూరుస్తుందని మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# నున్న తిరుమల రావుకి పలువురు పరామర్శ







**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు9,ప్రభాతవార్త** నున్న సురేష్ ఆకస్మిక మరణం పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు . తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు సోదరుడు కృష్ణ ల స్వంత సోదరుడు సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో ధర్మరణం పాలైన సంగతి విదితమే. ఈ సందర్భంగా ఆదివారం కాతేర్లో నున్న స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు హాజరై సురేష్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అలాగే నున్న సోదరులు తిరుమలరావు, కృష్ణలను పరామర్శించి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా దివంగత సురేష్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా పలువురికి రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేతుల మీదుగా వస్త్ర దానం నిర్వహించారు .ఈ సందర్భంగా బుచ్చియ్య చౌదరి మాట్లాడుతూ దివంగత సురేష్ చిన్ననాటి నుండి ఎంతో బాధ్యతతో మెలిగిన వ్యక్తిని తనతో ఉన్న కొన్ని సంఘటనలను వివరించారు. అలాగే రాజమండ్రి పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురందరేశ్వరి ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, వరుపుల సత్యప్రభ, మాజీ మంత్రులు దగ్గుపాటి వెంకటేశ్వరరావు, కేఎస్ జవహర్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ లు మార్గాని భరత్, వంగా గీత, మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు, సీనియర్ నాయకులు ముళ్ళపూడి బాపిరాజు, గన్ని కృష్ణ, గోరంట్ల రవి కిరణ్, జక్కంపూడి గణేష్ తదితరులు ఇందులో పాల్గొన్నారు.

# రాజమండ్రి వైద్య విద్యార్థిని మృతి

- **కారు ఢీ కొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ డాక్టర్ ప్రియాంక**
- **ఏడు రోజులు మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచిన ప్రియాంక**
- **ప్రియాంక మృతి పై వెళ్ళెత్తిన నిరసనలు**

**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 9( ప్రభాతవార్త)** కారు ఢీ కొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ డాక్టర్ ప్రియాంక(28) ఆదివారం ఆస్పత్రిలో మృతి చెందారు. ఏడు రోజులుగా వైద్యులు వైద్యం అందిస్తున్న ఫలితం లేకపోయింది. చివరకు మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచారు. ప్రమాదం జరిగిన రోజునే ప్రియాంక బ్రెయిన్డెడ్ గా వైద్యులు ప్రకటించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించిన ఫలితం దక్కలేదు. ప్రసాదిత్య మాల్ వద్ద ఈనెల మూడో తేదీన మద్యం మత్తులో ఇద్దరు యువకులు ప్రియాంక స్కూటీని వెనకరించి రెండుసార్లు ఢీ కొట్టి మరల మూడోసారి కూడా ఢీకొట్టడంతో కిందపడ్డ ప్రియాంక తీవ్రంగా గాయపడింది. ప్రియాంక స్నేహితుడు ఉమేష్ తో కలిసి స్కూటీపై వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. ప్రియాంక జిఎస్ఎల్ మెడికల్ కళాశాలలో డెర్మటాలజీలో పీజీ ఫస్ట్ ఇయర్ చదువుతుంది ప్రియాంక సొంత ఊరు కర్నూలు ప్రస్తుతం కుటుంబ సభ్యులు హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. ముద్దాయిలు సూరవరపు దస్వంత్, ఆంధ్రు జోసఫ్ ఎడ్వర్డ్స్ పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. ఈనెల ఆరవ తేదీన ఈ ఇద్దరినీ అరెస్ట్ చేసి ఏడవ తేదీన రాజమండ్రి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.



**ప్రియాంకకు న్యాయం చేయాలని నిరసనలు:**

వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలని కోరుతూ రాజమహేంద్రవరంలో విద్యార్థులు నిరసన ర్యాలీలు చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రియాంకకు న్యాయం జరిగే విధంగా అండగా నిలబడతానని చెప్పారు.

**ప్రియాంక మృతి పట్ల మాజీ ఎంపీ భరత్ దిబ్బంతి వ్యక్తం చేశారు**

జిఎస్ఎల్ మెడికల్ కళాశాల విద్యార్థిని డాక్టర్ ప్రియాంక మృతి పట్ల మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సోమవారం ప్రియాంక మృతి సంతాపంగా విద్యాసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ప్రియాంకకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు.


**శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం**
**వాడపల్లి గ్రామం, ఆత్రేయపురం మండలం,**
**డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా**

**సీల్డు టెండరు & ఈ-టెండరు ప్రకటన**

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో క్రింద పేర్కొన్న పనుల నిర్వహణ నిమిత్తం ఈ-టెండర్ పిలవబడుచున్నది.


| S.No | Name of the work | ధరావత్తు / EMD | Start date | End date |
|---|---|---|---|---|
| 1 | Providing high volume low speed (HVLS) fans in Vakulamatha annadanam building | Rs.8,250/- | 09-08-2026 | 17-08-2026 |

మిగిలిన వివరములు కొరకు
https://tender.apeprocurement.gov.in
లో చూడవచ్చును. మిగతా వివరములకు దేవస్థానం కార్యాలయం నందు పనివేళలులో సంప్రదించవలెను.

తేది: 09-08-2026
వాడపల్లి

శ్రీ నల్లం సూర్య చక్రధరరావు
డిప్యూటీ కమీషనర్ & ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

## కూటమి ప్రభుత్వానికి ఆదివాసీల పట్ల స్పష్టమైన ఆలోచన ఉంది



**వి.ఆర్.పురం,ఆగష్టు9,ప్రభాతవార్త** రాష్ట్రంలోని ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచన విధానం ఉందని, జడ్.పి.టి.సి సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాళ్ళ.రంగారెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని, రంగారెడ్డి విలేఖరులతో మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారికంగా,అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించటం జరిగిందని చెప్పారు. ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఆదివాసీ చట్టాలు, హక్కుల విషయంలో వస్తున్న వదంతులను ఆదివాసీలు నమ్మవద్దని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పాయం.రామారావు, మండల అధ్యక్షులు బొర్రా.నరేష్ కుమార్, సవలం.రాజేంద్రప్రసాద్, బీరకా.ప్రకాష్ రావు, ముత్యాల.చంద్రశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది

### ఎపి బాలల హక్కుల కమీషన్ సభ్యులు గాంధీబాబు



**వి.ఆర్.పురం,ఆగష్టు9,ప్రభాతవార్త** తరతరాలుగా అడవులను నమ్ముకొని ప్రకృతిలో మమేకమై జీవిస్తున్న మన్యంలో ఆదివాసీల చట్టాలు, హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని,ఎపి బాలల హక్కుల కమీషన్ సభ్యులు ఉండవల్లి.గాంధీబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రం రేఖపల్లిలో ఆదివాసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో గాంధీబాబు పాల్గొన్నారు. కొమరం భీం, బిర్సా ముండా, తమన్నదొర చిత్ర పటాలకు ఎంపిపి కారం.లక్ష్మి, గాంధీబాబులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సభా వేదిక వద్ద ఎంపిపి లక్ష్మి ఆదివాసీ గిరిజన జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి గాంధీబాబు మాట్లాడారు. ఆదివాసీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తప్పక నెరవేరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల ఐక్య వేదిక నాయకులు, విద్యావేత్తలు, మేధావులు, నాయకులు ఆదివాసీ గిరిజన కుల పెద్దలు, విద్యార్థులు అన్ని వర్గాల ఆదివాసీలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సత్తెమ్మ తల్లి 11వ వార్షికోత్సవ వేడుకలు




**కాకినాడ రూరల్, ఆగస్టు 9(ప్రభాతవార్త)** : కాకినాడ రూరల్ మండలం తమ్మవరం గ్రామంలో పాము గుంట శ్రీ సత్తెమ్మ తల్లి 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎల్లబోయిన వారి ఇంటి ఇలవేల్పుగా పిలుచుకునే సత్తెమ్మ తల్లి కోరిన కోర్కెలు తీర్చి భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. ఉదయం నుండి చుట్టుపక్కల గ్రామాల నుండి మహిళా భక్తులు భారీ సంఖ్యలో మేళ తాళాలతో బోనాలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎల్ల బోయిన వెంకటరమణ, ధర్మకర్తలు, లక్ష్మణరావు రాంబాబు ,రాము అన్నవరం, బుజ్జి, కిరణ్ కుమార్,పెంకే సింహాచలం, దయ్యాల భద్రరావు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జి. వేమవరంలో గ్రామ దేవతలకు సారె సమర్పణ



**తాళ్లరేవు ఆగస్టు 9 (ప్రభాతవార్త)**: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జి. వేమవరం గ్రామంలో కొలువై ఉన్న గ్రామ దేవతలు పాదాలమ్మ, సోమాలమ్మ దేవతలకు భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆదివారం సారె సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ముందుగా ఆలయంలో పూజలు నిర్వహించి పలువురు దంపతులు ముత్తైదువులతో కలిసి మేళ తాళాలతో ప్రతి ఒక్కరి చేతిలో సారె పళ్లెంతో ఊరేగింపుగా పాదాలమ్మ గుడికి వెళ్లి సారె సమర్పించారు. అక్కడి నుంచి ఊరేగింపుగా సోమాలమ్మ గుడికి వచ్చి అమ్మవారికి సారె సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం లోని ఆడపడుచులు, దంపతులు పెద్ద ఎత్తున తరలి రావడంతో జి. వేమవరంలోని పురవీధులు కళకళలాడాయి. ఈ సందర్భంగా సత్తెమ్మ తల్లికి సారె సమర్పించి భక్తులు పూజలు నిర్వహించారు.ఈ ఈ మేరకు ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి అమ్మవారి ప్రసాదాన్ని అందరికీ పంపిణీ చేశారు. సమరత సేవా ఫౌండేషన్ ప్రోత్సాహంతో ఈ సారి ఉత్సవం నిర్వహించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## బొలేరా వ్యాన్ బోల్తా ఒకరు మృతి: ముగ్గురికి గాయాలు



**గండేపల్లి. ఆగస్టు 9. ప్రభాతవార్త** గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారున జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలేరో వ్యాన్ టైర్ పేలి డివైడర్ ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కొంతమంది కి స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసులు వివరాలు మేరకు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం అంజనాపురం గ్రామాని కి చెందిన అల్లాడి గోపాలకృష్ణ తన ఆరు నెలల పాప కి అన్న ప్రాసన చేసేందుకు అన్నవరం శ్రీ వీర వెంకటసత్యనారాయణ స్వామి దేవాలయానికి వచ్చి కార్యక్రమం అయిన అనంతరం తలుపులమ్మ తల్లి గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని తిరిగి సొంత ఊరికి వెళ్లే సమయంలో గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామ సమీపంలో పెట్రోల్ బంకు వద్ద డివైడర్ ఢీకొని అల్లాడి చిన్నారావు (46) సత్తన్న గూడెం కి చెందిన వ్యక్తి మృతిచెందాడు. మంతెన భవాని,అన్నా బత్తుల సామ్రాజ్యం,వెంకటరమణ ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటనా స్థలానికి జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతిరావు, గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జెడ్ రాగంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## నాటక అకాడమీ డైరెక్టర్‌గా ఏసుపాదం



**సీతానగరం, ఆగస్టు 09, (ప్రభాతవార్త)** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా సీతానగరానికి చెందిన మద్దాల ఏసుపాదం శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన నివాసం వద్ద ఏసుపాదం మాట్లాడుతూ.. రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన

**--కాకినాడ రూరల్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్**



**కాకినాడ రూరల్, ఆగస్టు 9(ప్రభాతవార్త)**: రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో ఆదివారం రూరల్ మండలం చీడిగా గ్రామంలో ప్రజల సహకారంతో సాధించిన ప్రగతిని ప్రజలకు తెలిపేందుకు నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. మంత్రి వెంట కాకినాడ రూరల్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ దంపతులు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, టీడీపీ సీనియర్ నేత నూరుకుర్తి వెంకటేశ్వరరావుతో పాటు కూటమి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు స్థానిక ప్రజలు అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ, హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు, యువత, స్థానిక ప్రజలు మంత్రిని ఆత్మీయంగా కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై స్పందించారు ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనతో పాటు వివిధ రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించడమే ఈ ప్రచార కార్యక్రమం ఉద్దేశమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన, ఆదరణ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ కదలి ఈశ్వరి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, పితాని అప్పన్న, చీడిగ గ్రామ పెద్దలు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభిమాన కథానాయకుడి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి..

### అంబాజీపేటలో మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు..



**అంబాజీపేట, ఆగస్టు 9, (ప్రభాతవార్త)**: అభిమాన కథానాయకుడి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సందేశాత్మక చిత్రాలలో నటించడమే కాకుండా, నిజ జీవితంలోనూ ప్రజా సేవ చేస్తున్న సూపర్ స్టార్ మహేష్ బాబును ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర నాయకులు ఎం.ఎం.శెట్టి,మాజీ సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు,పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్లు అన్నారు.మండలంలోని గంగలకుర్రు అగ్రహారంలో కట్టా వెంకట సుబ్రహ్మణ్యం ఇంటి ఆవరణలో సూపర్ స్టార్స్ కృష్ణ, మహేష్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మహేష్ బాబు ఫ్యాన్స్ సంసాని మురళి, రాయుడు భానుశంకర్, బొక్కా త్రినాథ్,మట్టపర్తి రమేష్, దంగేటి దినేష్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్ వైద్యులు చొల్లంగి అనిల్, యాపిల్ ఆస్పత్రి వైద్యులు, రవి ఈఎన్టీ ఎండోస్కోప్ వైద్యులచే 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 72 మందికి పైగా రక్తదానం చేశారు. అంతకుముందు మహేష్ బాబు పుట్టినరోజు కేకును కట్చేసి పలువురికి పంచారు.ఈ కార్యక్రమంలో రాయుడు మీరయ్య. రాయుడు షణ్ముఖ్ , రాయుడు స్వామి, రాయుడు కృష్ణమహేష్ తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం...



**అడ్డతీగల, ఆగస్టు 09: ప్రభాతవార్త** మండల కేంద్రమైన అడ్డతీగల లో ఆదివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అడ్డతీగల ఆశ్రమ పాఠశాలలో రంపచోడవరం డిఎస్పి అశ్రుఫ్ ఆలీ మరియు అడ్డతీగల సీఐ ఎం .గజేంద్ర కుమార్, ఎస్సై బి. వినోద్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు పెన్నులు, పెన్సిల్, స్కేలు సుమారు 200 మంది హై స్కూల్ ,కాలేజ్ విద్యార్థినిలకు అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పి అశ్రుఫ్ ఆలీ మాట్లాడుతూ విద్యార్థులంతా మంచి చదువులు చదివి ఉన్నతమైన పదవులు అవరోదించాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరుతీసుకురావాలని అన్నారు. అలానే మహిళల భద్రతకు పటిష్టమైన చట్టాలు ఉన్నాయని, దీనిపై ఈగల్ టీం ప్రత్యేకంగా పనిచేస్తుందని మహిళలను ఎవరైనా ఇబ్బందులకు గురి అయినట్లయితే తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని డీఎస్పీ తెలిపారు. అనంతరం విద్యార్థినులు చేత కేక్ కట్ చేయించారు. అనంతరం విద్యార్థినిలు గిరిజన సంప్రదాయ నృత్యాలను, మరియు దిమ్మిస నృత్యాన్ని ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### మండల అధ్యక్షులు వెంకన్న దొర



**శంఖవరం ఆగస్టు 9 ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేసేందుకు కృషి చేయాలని శంకవరం మండలం బిజెపి పార్టీ అధ్యక్షులు అదట్రా వెంకన్న దొర పేర్కొన్నారు. మండలంలో నెల్లిపూడి లో ఆదివారంశక్తీ కేంద్ర పరిశీలన,బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతం పై స్థానిక ఎన్నికల పై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మండల ఇంచార్జ్ విశ్వనాధ పల్లి శ్రీనివాసరాజు మాట్లాడుతూ నాలుగైదు పోలింగ్ కేంద్రాలు కలిపి ఒక శక్తి కేంద్రం ఉంటుందని ప్రతి బూత్ కమిటీ నెంబరు తాను బూతులు వేరే కుటుంబాన్ని కలిసి పార్టీ కార్యక్రమాలు ప్రభుత్వ పథకాలను వివరించాలని పేర్కొన్నారు. ప్రత్తిపాడు పూర్వఇంచార్జ్ ఘంటా బాలు దొర మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థలు పార్టీ పలు స్థానాల్లో కూటమి ప్రభుత్వం తో కలిపి పోటీ చేయనున్నామని కార్యకర్తలు నాయకులు పార్టీ కోసం మరింత పాటుపడాలని ఆయన పేర్కొన్నారు అనంతరం నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో బొమ్మిడి లోవరాజు, సైపిరెడ్డి, నాగ శివదొర, బాలిపల్లి చక్రి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మ సీతమ్మ సేవా సమితి వార్షికోత్సవం




**రావులపాలెం, ఆగస్ట్ 09 (ప్రభాతవార్త)** :మండలం లోని పొడగట్లపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో లంకపాలెం అమ్మ సీతమ్మ సేవాసమితి అధ్యక్ష ఉపాధ్యక్షులు సానబోయిన బాలాజు ,సానబోయిన శ్రీను ఆధ్వర్యంలో లాంప్ సంస్థ బడుగు సుబ్బాయమ్మ అధ్యక్షతన అమ్మ సీతమ్మ సేవాసమితి 2వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో అర్బన్ సిఐ జి రమేష్ బాబు ముఖ్యఅతిధిగా అతిథులుగా గ్రామ పెద్దలు అల్లూరి పెద్ద క్రిష్ణంరాజు, ఎస్ ఎంసి చైర్మన్ జాలాది సహదేవుడు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు భూపతిరాజు రామరాజు, మాజీ సర్పంచ్ గంథం దేవి అన్నవరం పాల్గొన్నారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ సేవ చేయాలనే ఆలోచన అందరికీ ఉంటుందని సేవ చేసే గుణం కొందరికే స్ఫురిస్తుందని ఆకోవకు చెందిన సంస్థ అమ్మ సీతమ్మ సేవా సంస్థ అని కొనియాడారు. ఈ సమితికి ఆంధ్రుల అన్నపూర్ణ సామాజిక వేత్త డొక్కా సీతమ్మ పేరు పెట్టడం ఆనందంగా ఉందన్నారు.మానవసేవే మాధవ సేవగా ఎంచుకొని అనేక సేవా కార్యక్రమాలు చేస్తు ఎందరికో సహాయాన్ని అందించడం అభినందనీయమని అన్నారు.అనంతరం 100 మంది వృద్ధులకు ,వికలాంగులకు, నిరుపేదలకు, బియ్యం పప్పులు, దుప్పట్లు,పళ్లు సిఐ చేతులమీదుగా అందచేసారు.అమ్మ సీతమ్మ సేవా సమితి సభ్యులు సిఐ రమేష్ బాబు ను ఘనంగా మెమొంటో దుస్సాలువా పూలమాల తో ఘనంగా సన్మానించారు.పారిశుద్ధ్య కార్మికులను నూతన వస్త్రాలు సాలువా పూలమాల తో సత్కరించారు.అలాగే జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో త్రిబుల్ఐటి సాధించిన 5 మంది విద్యార్థులను తల్లిదండ్రులను సన్మానించారు. అనంతరం 200మందికి అన్నదానం చేసి డొక్కా సీతమ్మ పేరుకు సార్థకత చేకూర్చారు.ఈకార్యక్రమంసంఘ సభ్యులు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ధన ధాన్య లక్ష్మి, గోగులమ్మ అమ్మవార్లకు సారే




**కె గంగవరం, ఆగస్టు 9,( ప్రభాతవార్త)**: కె గంగవరం మండలం కోటిపల్లి కోట గ్రామాల మధ్య వెలిసినటువంటి వైకుంఠపురం శ్రీ మహాలక్ష్మి( శ్రీ ధనధాన్యలక్ష్మి) అమ్మవారికి చుట్టుప్రక్కల గ్రామాలైనటువంటి పాతకోట, కొత్తకోట, కోటిపల్లి, గంగవరం, సుందరపల్లి సమీప ప్రాంతాల భక్తులు ఆషాడం సందర్భంగా అమ్మవారికి సారే కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు హరినాథ,రాజు పట్టాభి రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు భక్తులు కోటిపల్లి నుంచి సుమారు మూడు కిలోమీటర్లు డోలు సన్నాయిలతో భాజభజయంత్రీయులతో ఊరేగింపుగా పసుపు కుంకుమ చీర చలివిడి వడపప్పు పానకం లతోపాటు రకరకాల పిండి వంటలు నైవేద్యంగా అమ్మవారికి సారెగా సమర్పించినారు. అమ్మవారి దర్శన అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. అలాగే తామరపల్లి గ్రామంలో వేంచేసినటువంటి శ్రీ గోగులమ్మ తల్లి అమ్మవారికి అధిక సంఖ్యలో మహిళా భక్తులు గ్రామస్తులు ఊరేగింపుగా సారే కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు పులిహార పరమాన్నం ప్రసాదంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు గ్రామస్తులుపాల్గొన్నారు.

## కట్వలంబా అమ్మవారిక ఆషాడ మాసం సారె



**కొత్తపేట, ఆగస్టు09, (ప్రభాతవార్త)** మండల పరిధిలో అవిడి గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవత శ్రీ కట్వలంబా అమ్మ వారికి అవిడి గ్రామ ప్రజలు ఆదివారం ఆషాధ మాసం సారె సమర్పించారు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు కుంకమ చీరలు గాజులు చలివిడి పానకాలు వివిధ రకాల స్వీట్స్ అరటి గెలలు పండ్లు కావిళ్ళతో సన్నాయి మేళాలతో సమర్పించారు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం నుంచి అవిడి గ్రామంలోని వివిధ వీధుల గుండా ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు ఆ సాధులు స్వాగతించి శ్రీ కట్వలంబా అమ్మ వారికి సమర్పించారు కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## కూనవరం మండలంలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు



**కూనవరం, ఆగస్టు 9, ప్రభాతవార్త**: ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు పోలవరం జిల్లా కూనవరం మండలంలో ఆదివారం ఘనంగా జరిగాయి. మండలంలోని అన్ని గ్రామాలలోనూ పతాకావిష్కరణలు జరిగాయి. ఆయా గ్రామాలలో గిరిజనులు సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేశారు. మండలంలోని కోండ్రాజుపేట, శబరి కొత్తగూడెం, కూనవరం, పల్లూరు, కాచవరం, వెంకటాయపాలెం, రేగులపాడు, ముల్లూరు తదితర గ్రామాలలో గ్రామ పెద్దలతో ఆదివాసి ఉద్యమ అమరవీరులైన కొమరం భీమ్, భీర్సముంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**కూనవరంలో... ఆదివాసి హక్కులు, చట్టాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి..**

**- ఆదివాసి అఖిలపక్షం డిమాండ్**

ఆదివాసీల హక్కులు, రాజ్యాంగపరమైన చట్టాల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని ఆదివాసి అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సినిమా హాలు సెంటర్ నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసి సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు. శబరి బ్రిడ్జి వరకు ర్యాలీ కొనసాగించడం జరిగింది. అనంతరం సభా ప్రాంగణానికి చేరుకొని బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడారు. షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఆదివాసి హక్కులను కాపాడవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జీవో నెంబర్ 3 పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని, 1/7 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, ఆదివాసి భూములు అన్యక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం ఆదివాసుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జడ్పిటిసి గుజ్జా విజయ, బాబు బొర్రయ్య, పులి సంతోష్, రవితేజ, తెల్లం తమ్మయ్య, గుజ్జా బాబు, నాగమణి, అమ్మాజీ, జయసుధ, సత్యనారాయణ, బొగ్గా రామారావు, సున్నం అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ముస్లిం సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎంపిక



**మామిడికుదురు.ఆగస్టు 09(ప్రభాతవార్త )** రాజోలు నియోజకవర్గ ముస్లిం సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక మామిడికుదురు మండలం మొగలికుదురు మస్జీదే మునాఫ్ లో ఆదివారం జరిగింది. సంఘ గౌరవ సలహాదారులుగా అబ్దుల్ హమీద్ ,షేక్ అబ్దుల్ ఖాదర్ అధ్యక్షుడు గా షేక్ జిలానీ,ఉపాధ్యక్షులుగా మహ్మద్ అబ్దుల్ రహీం ,మహ్మద్ మునీర్ కార్యదర్శిలు గా షేక్ మీరజ్ ,మహ్మద్ సమద్ భాషా జనరల్ సెక్రటరీ గా సయ్యద్ రోషన్, కోశాధికారిగా మహ్మద్ రఫీ తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## చెత్త కుండీగా బ్యాంకు కైనాల్



**అయినవిల్లి ఆగస్టు 9 ప్రభాత వార్త** లక్షలాది ఎకరాలు సాగునీరు అందించే పంట కాలువల పరిస్థితి దయనీయంగా మారింది సెంట్రల్ డెల్టా బ్యాంకు కెనాల్ బొబ్బర్లంక నుండి అన్నం పల్లి వరకు వేలాది ఎకరాలకు సాగునీరు వందలాది గ్రామాలకు త్రాగునీరు అందిస్తూ ప్రవహిస్తుంది 1855లో సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు ఈ కాలువలను నిర్మాణం చేశారు స్వతంత్ర అనంతరం మన పాలకుల నిర్లక్ష్యము ఆక్రమణదారుల స్వార్థంతో కాలవ గట్లు ఆక్రమణకు గురై మొత్తం చెత్తకుండీగా మారిపోయింది ప్లాస్టిక్ వ్యర్థాలు ఇతర వ్యర్థ పదార్థాలు మోసుకెళ్ళే మురుగు కాలువగా మారిపోయింది అధికారులు చూసి చూడనట్లు ఊరుకోవడం ఇరిగేషన్ శాఖ నిర్వీర్యం అయిపోవడంతో కాలవలు పూర్తిగా ఆక్రములకు గురయ్యాయి ముఖ్యంగా కొత్తపేట నుండి అన్నంపల్లి వరకు కాలువ గట్టు పూర్తిగా ఆక్రములకు గురయ్యాయి శాశ్వత కట్టడాలు చిన్న చిన్న వ్యాపారాలు బడ్డీలు పశువుల పాకలు వేసి వ్యర్థాలు కాలువలో పడవేస్తున్న అడిగే వారు కరువయ్యారు ఇరిగేషన్ పంచాయతీ శాఖలు ఒకరినొకరు చూపించి తప్పించుకుంటున్నాయి కాలవ పొడుగునా గ్రామాల నుండి మురుగు గొట్టాలు పెట్టి వ్యర్థాలను వదిలేస్తున్నారు ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు దృష్టి పెట్టి కాలువలను శుభ్రపరచాలని ప్రజల కోరుతున్నారు

## కూటమి ప్రభుత్వం దిగివచ్చే వరకు ఆందోళన ఆగదు..



**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 9 (ప్రభాత వార్త)** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగబోదని మాజీ ఎంపీ, వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్చార్జి మార్గాని భరత్ రామ్ స్పష్టం చేశారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఫీజు రీ ఎంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని, నిరుద్యోగ భృతి వెంటనే విడుదల చేయాలని, డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మోరంపూడి జంక్షన్ ఫ్లైఓవర్ వద్ద శనివారం ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్ష విరమణ కార్యక్రమానికి వైసీపీ రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విచ్చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మోరంపూడి జంక్షన్ ఫ్లైఓవర్ వద్ద మాజీ ఎంపీ మార్గాని భరత్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని, డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరపాలని, మెడికో ప్రియాంక ప్రమాదానికి కారకులను కఠినంగా శిక్షించాలని, ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్లు వెంటనే వేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఈవీఎం ఎమ్మెల్యే తీరుపై మార్గాని భరత్ రామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలందరూ గమనిస్తున్నారని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ఓటుతో సరైన గుణపాతం చెబుతారని హెచ్చరించారు.


## శ్రీవాగ్దేవి నగర మహాలక్ష్మి కి. సారె సమర్పించిన గ్రామస్తులు...

### శాకంబరి దేవిగాభక్తులకు దర్శనం..



**ఆత్రేయపురం, ఆగస్టు 09,(ప్రభాత వార్త)** ఆషాఢమాసం పురస్కరించుకొని ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వాగ్దేవి నగర మహాలక్ష్మి,ముత్యాలమ్మ అమ్మవార్లకు ఆదివారం గ్రామస్తులు సారె సమర్పించారు. అమ్మవార్లు శాకాంబరి దేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలో ఆడపడుచులు, అలాగే చుట్టుపక్కల గ్రామాల ఆడపడుచులు అమ్మవార్లకు సన్నాయి వాయిద్యాలతో బాణాసంచా కాల్పుల నడుమ బారీ ఊరేగింపుగా ఆషాడం సారె సమర్పించి అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి వారి సేవలో ఆలయ చైర్మన్ నామాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, పాల్గొని వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే లొల్ల లాకుల వద్ద వేంచేసియున్న శ్రీ విజయ దుర్గ, వేలిచేరు గ్రామ దేవతలు శ్రీ ఊదలమ్మ, ఎర్ర గంగాలమ్మ అమ్మవార్లకు సన్నాయి వాయిద్యాలతో బాణాసంచా కాల్పులతో గ్రామస్తులంతా గ్రామ పురవీధులలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో చీర, సారె, చలివిడి పానకాలతో సమర్పించారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

## మత్తుకు బానిసలైతే జీవితాలు చిత్తు



**యు.కొత్తపల్లి, జూలై 22 (ప్రభాతవార్త)** : మత్తు పదార్థాలకు అలవాటు పడి బానిసలైతే వారి జీవితాలతో పాటు కుటుంబాలు నాశనమవుతాయని ఎస్సై వెంకటేష్ అన్నారు. ఉప్పాడ బీచ్ రోడ్డు కూడలిలో ఆదివారం డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలుకు అలవాటు పడితే భవిష్యత్తును సర్వనాశనం చేస్తాయన్నారు. అంతేకాకుండా కుటుంబాలు, సమాజాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. దురలవాట్లు విడనాడి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వాడపల్లి 'వెంకన్న'ను దర్శించుకున్న ఎంపి, అంబికా లక్ష్మీ నారాయణ.



**ఆత్రేయపురం, ఆగస్టు 09,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీ నారాయణ దర్శించుకున్నారు వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు .శ్రీ స్వామివారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సలాది నాగేశ్వరరావు, శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

మరిన్ని వార్తలు 6లో

# ఉపాధ్యాయ నియామకలపై వైసీపీ నేతలుకు చిన్న చూపే

**జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు ముత్యాల బాబ్జి**



**కొత్తపేట, ఆగస్టు 09, (ప్రభాతవార్త)** రాష్ట్ర ప్రభుత్వం 2025 మెగా డీఎస్సీ అవకతవకలు అనేది లేకుండా చేపడితే దీనిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ అపోహాలు సృష్టిస్తూ వైసీపీ నేతల రిలే నిరాహారదీక్షలు చేపట్టడం అర్థరహితమని టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి అన్నారు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించిన డీఎస్సీలో మొదటిసారి క్రీడాకోటాలో హారిజంటల్ రిజర్వేషన్ అమలు అయిందన్నారు అంతే తప్ప క్రీడాకోటాలో కానీ జనరల్ కోటాలో గాని ఎక్కడ అవినీతికి తావు లేకుండా 16 000 పైగా పోస్టులు ఎలక్షన్ మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం భర్తీ చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు ఇప్పుడు వైసీపీ నాయకులు అయిపోయిన పెళ్లికి మేళాలు వాయిస్తున్నారనీ ఆరోపించారు అవినీతి ఎక్కడా జరగలేదు వైసీపీ నాయకులు నిరాహార దీక్షలుకు ప్రతిగా రాయలసీమలో ఉపాధ్యాయులే రోడ్డు ఎక్కి నిరసన తెలియజేస్తున్నారు డిఎస్సీకి ఎంపికై ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఉపాధ్యాయుల నుండి నిరసనలు ఎదుర్కోకముందే వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు

# జనసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**యు.కొత్తపల్లి, ఆగస్టు 9 (ప్రభాతవార్త) :** మండలంలోని శ్రీరాంపురం శివారు ముమ్మిడివారుపోడులో ఆదివారం జనసేన పార్టీ నాయకుడు పిర్ల శివాజీ ఆధ్వర్యంలో కాకినాడ మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ ఎన్. అంజిబాబు, గుండె వైద్యులు చెన్నకేశవరావు, గైనకాలజి వైద్యురాలు లక్ష్మీ ప్రవీణల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రావు అక్షయ్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో గుండె, నేత్ర, దంత సంబంధిత ఉచిత పరిక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా అక్షయ్ మాట్లాడుతూ మండల పరిధిలో 8 విడతలుగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ముఖ్యంగా తీరప్రాంత మత్స్యకారుల్లో సముద్రం నీటిపై పడే సూర్య కిరణాలు కారణంగా కంటికి సంబంధించిన ఇబ్బందులు ఉన్నట్లు తెలిసిందన్నారు. త్వరలో మత్స్యకార గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో మూలపేట జనసేన పార్టీ ఇంచార్జ్ రామిశెట్టి రాంబాబు, మాజీ సర్పంచులు రావి రమేష్, నక్కా మణికంఠ, పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# .పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

**ఆదివాసీ యువతకు ఉద్యోగ భద్రత కల్పించాలి**

**1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి**




**ఎటపాక: ఆగస్టు 9 ( ప్రభాత వార్త):** మండల పరిధిలోని చెన్నం పేట గ్రామంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా చెన్నంపేట నుండి మేడువాయ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం కొమరం భీమ్, బిర్స ముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు . ఆదివాసి జెండాను ఎగరవేయడం జరిగింది. ఆదివాసి టాప్ టెన్ ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి కంగాల కోటేశ్వరావు అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పూసం శ్రీను మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కారణంగా సర్వస్వం కోల్పోయిన ఆదివాసీ నిర్వాసితులకు 2013 భూసేకరణ, పునరావాస చట్టం ప్రకారం న్యాయమైన నష్టపరిహారం, పునరావాసం, పునరుద్ధరణ ప్యాకేజీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వానికి కోరారు. గోండ్వానా సంక్షేమ పరిషత్ జాతీయ కన్వీనర్ సొందె వీరయ్య మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతులకు భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాసం తదితర ప్రయోజనాలు కల్పిస్తున్నప్పుడు, పోలవరం ప్రాజెక్టు కోసం భూములు, ఇళు ,, జీవనాధారాలను కోల్పోయిన ఆదివాసీ నిర్వాసితులకు అదే స్థాయిలో న్యాయం ఎందుకు జరగడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాము. పోలవరం నిర్వాసితుల విషయంలో వివక్ష లేకుండా 2013 భూసేకరణ చట్టం స్ఫూర్తి, పునరావాస నిబంధనల ప్రకారం న్యాయం చేయాలి.గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు ముర్రం వీరభద్రం మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీ యువతకు ఉద్యోగ భద్రత కు ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో తరతరాలుగా జీవిస్తున్న ఆదివాసీ యువతీ యువకులకు స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ఉద్యోగ భద్రత చట్టం తీసుకురావాలి. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రాజెక్టులు, పరిశ్రమలు, పర్యాటక రంగం, విద్యుత్ సంస్థలు తదితర రంగాల్లో స్థానిక ఆదివాసీ యువతకు ప్రాధాన్యత కల్పించే విధంగా స్పష్టమైన చట్టపరమైన హక్కులు కల్పించాలని అలాగే

**1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి**

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకు ఉన్న 1/70 భూ బదలాయింపు నిబంధనలను కఠినంగా అమలు చేయాలి. ఆదివాసీ భూములపై అక్రమ ఆక్రమణలు, బదలాయింపులు, మధ్యవర్తుల దందాలను అరికట్టాలి. 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలు తమ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలి. ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రసార కార్యదర్శి సోడే మురళి మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీల సంప్రదాయ ఆచారాలు, సంస్కృతి, దేవతా పూజలను తరతరాలుగా కొనసాగిస్తున్న ఆదివాసీ పూజారులు, సంప్రదాయ పూజారులకు ప్రభుత్వం గౌరవ వేతనం అందించాలి. ఆదివాసీ సంస్కృతి పరిరక్షణలో వారి పాత్రను గుర్తించి ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వానికి కోరారు.. అలాగే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో తమ భూములు, ఇళ్లు, జీవనాధారాలను కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు ప్రాజెక్టు ద్వారా ఏర్పడే జల విద్యుత్ కేంద్రం, పర్యాటక రంగం, ఇతర అనుబంధ సంస్థలు మరియు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యతతో ఉద్యోగాలు కల్పించాలి. నిర్వాసితులను కేవలం పరిహారం తీసుకున్న వారిగా కాకుండా, ప్రాజెక్టు అభివృద్ధిలో భాగస్వాములుగా గుర్తించాలి. ఆదివాసీల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే రేలా పండుగను 2027 ఫిబ్రవరిలోనే ఘనంగా నిర్వహించాలి. ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, ఆదివాసీ కళలు, భాషలు, సంప్రదాయాలు, జానపద కళారూపాలకు ప్రోత్సాహం కల్పించాలి. రేలా పండుగను ఆదివాసీ యువతలో ఐక్యత, సాంస్కృతిక చైతన్యం పెంపొందించేలా నిర్వహించేందుకు ప్రభుత్వం అవసరమైన నిధులు, ఏర్పాట్లు చేయాలని పోలవరం నిర్వాసితులకు న్యాయం, ఆదివాసీ భూములకు రక్షణ, యువతకు ఉద్యోగ భద్రత, ఆదివాసీ సంస్కృతికి గౌరవం కల్పించే విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటా దేవదానం,టాప్ టెన్ నాయకులు ఆదివాసి నాయకులు బాడీస వెంకటేష్, పూనేమ్ శ్రీకాంత్ గుండి లక్ష్మణ్, పీసా అధ్యక్షులు కార్యదర్శులు తురం అర్జున్, పూణెం సురేష్, ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ నాయకులు సోడే రాఘవయ్య ,కరణ్ ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్రం నాయకుడు మురళి నూప అనిల్ గ్రామ పటేల్ పూజార్లు పాల్గొన్నారు

# ప్రాణాలను ప్రాణంగా పెట్టైనా తమ హక్కులను చట్టాలను కాపాడుకుంటాం

**ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో నేతల స్పష్టీకరణ**

**వి.ఆర్.పురం,ఆగష్టు9,ప్రభాతవార్త** ఈ అడవి మాది, ఈ నీరు మాది, ఈ భూమి మాది. ఈ నేలపై సర్వాధికారాల మావి. అడవుల నుండి ఆదివాసీలను వేరుచేయాలని చూస్తే, విల్లంబులమై లేస్తాం, సింహాల్లా గర్జిస్తాం. ప్రాణాలను ప్రాణంగా పెట్టైనా రాజ్యాంగంలో మా రక్షణ కొరకు కల్పించిన చట్టాలను, హక్కులను కాపాడుకుంటాం అని, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు గంభీర స్వరంతో స్పష్టం చేశారు. ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఆదివాసీలు వి.ఆర్.పురం మండలంలోని గ్రామ గ్రామాన ఘనంగా జరుపుకుంటారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండల కేంద్రం రేఖపల్లిలోని సచివాలయం నూతన భవనం వద్ద ఆదివాసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. సభా వేదిక వద్ద కొమరం భీం, బిర్సా ముండా, తమన్నదొర చిత్ర పటాలకు ఆదివాసీ ప్రజా ప్రతినిధులు, నేతలు ఎంపిపి కారం.లక్ష్మి, జడ్.పి.టి.సి సభ్యులు వాళ్ళ.రంగారెడ్డి, ఆదివాసీ ఐక్య వేదిక నేతలు పులి.సంతోష్ కుమార్, పూనెం.ప్రతీఫ్ కుమార్, సున్నం.రాజులు, పొడియం.శ్రీరామూర్తి, పిట్టా.రామారావు, చిక్కాల.బాలు, పొడియం.గోపాల్, కోటం.జయరాజు, పాయం.రామారావు, పాయం.లక్ష్మణ్ రావు, సవలం.రాజేంద్రప్రసాద్, కొండారెడ్డి, ముర్ల.కనకారెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సభా వేదిక వద్ద ఎంపిపి లక్ష్మి ఆదివాసీ గిరిజన జెండాను ఆవిష్కరించారు.



**ఐకమత్యంతో పోరాడుతాం...భావితరాలకు బంగారు బాటలు వేస్తాం..........**

తమ వ్యవసాయ భూముల రక్షణ కొరకు రాజ్యాంగంలో కల్పించిన 1/70 చట్టాన్ని, ఏజెన్సీలోని 100% ఉద్యోగాలు ఆదివాసీలకే దక్కేందుకు 3 జిఒ స్థానంలో ప్రత్యామ్నాయ జిఒను ఐకమత్యంతో పోరాటాలు చేసి సాధించుకుంటామని, తద్వారా భావితరాలకు బంగారు బాటలు వేస్తామని, ఆదివాసీ ఐక్య వేదిక నాయకులు అన్నారు. 1/70 చట్టం రద్దు చేయాలని గిరిజనేతరులు సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్ కు రాష్ట్ర ప్రభుత్వం స్ట్రాంగ్ కౌంటర్ వేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు 3 జిఒ కు ప్రత్యామ్నాయ జిఒ తీసుకొనివస్తానని ఇచ్చిన మాట ప్రకారం వెంటనే జిఒ ప్రకటించాలన్నారు.



**ఆదివాసీ దినోత్సవం సాక్షిగా, ఆదివాసీ గిరిజనుల్లో ఐక్యత..........**

మన్యంలోని ఆదివాసీ గిరిజనుల్లో మునుపెన్నడు లేని విధంగా, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సాక్షిగా, ఐక్యత కనిపించింది. తమలో ఐక్యత లేకుంటే, తాము తమ అస్తిత్వాన్ని కోల్పోతామనే అభిప్రాయానికి మన్యంలోని ఆదివాసీ గిరిజనులు వచ్చేశారు. ఆదివాసీ గిరిజన జాతి మనుగడ, జాతి సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ ఐకమత్యంతోనే సాధ్యమని దృడ సంకల్పం వారిలో స్పష్టంగా కనిపించింది. దీని ఫలితమే 2026 ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు గ్రామ గ్రామాన పండుగ వేడుకలా జరగటానికి కారణమని స్పష్టమౌతుంది. ఈ వేడుకల్లో ఆదివాసీ గిరిజన సంఘాల ఐక్య వేదిక నాయకులు, విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఆదివాసీ కుల పెద్దలు అన్ని వర్గాల ఆదివాసీలు పాల్గొన్నారు.

# గ్రామ దేవతలకు ఆషాఢ చీర సారే...



**సఖినేటిపల్లి ఆగస్టు 9, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామ దేవత కనక ముత్యాలమ్మ అమ్మకు, కనక దుర్గమ్మ అమ్మవార్లకు పెద్ద ఎత్తున సారి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం నాలుగు పక్కల నుంచి ఆడపడుచులు భక్తులు వందలాదిగా చలివిడి పానకం లు సారే తీసుకునీ ప్రధాన రహదారి మీదుగా నడుచుచూ అమ్మ వారల ఆలయాలలో సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడపడుచులు ఆకర్షణంగా నిలిచారు.

# ఎల్ఎల్ఐఎన్ దోమతెరల పంపిణీకి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ:



**జగ్గంపేట ఆగస్టు 9 (ప్రభాతవార్త )** మలేరియా, డెంగ్యూ తదితర దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణలో భాగంగా లాంగ్ లాస్టింగ్ ఇన్‌సెక్టిసైడల్ నెట్స్ (ఎల్ ఎల్ ఐ ఎన్ ) దోమతెరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట ఎస్‌డబ్ల్యూ బాలికల వసతి గృహం రాజపూడి ఎస్‌డబ్ల్యూ బాలుర వసతి గృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ సభ్యులు జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాజపూడి వైద్యాధికారులు డాక్టర్ ఎన్. పూజా, డాక్టర్ ఎం. మురళి పాల్గొని, విద్యార్థులకు ఎల్ఎల్ఐఎన్ దోమతెరల ప్రాముఖ్యతను వివరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల పట్ల ప్రత్యేక ప్రేమతో వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తూ ఈరోజు మీ అందరికీ దోమతెరలు అందించడం జరిగిందని దోమకాటును నివారించడంతో పాటు మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ప్రతి విద్యార్థి ప్రతిరోజూ రాత్రి దోమతెరలను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. వైద్యాధికారులు ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు దోమతెరలను సక్రమంగా ఉపయోగించే విధానం, వాటిని పరిశుభ్రంగా సురక్షితంగా నిర్వహించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే వసతి గృహాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల ఉత్పత్తి నివారణకు తగిన చర్యలు తీసుకోవడం వంటి ముందస్తు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ మరియు వసతి గృహాల అధికారుల సమన్వయంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో ప్రయోజనకరమని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, కొత్త కొండబాబు, రేఖ బుల్లి రాజు, పాండ్రంగి రాంబాబు, ఉప్పలపాటి బుల్లెబ్బ, పీలా మహేష్, వేములకొండ జోగారావు సీడీపీవో పూర్ణిమ , ఎస్‌యూఓ శ్రీ ఎన్.వి. సత్యనారాయణ , వసతి గృహాల సూపర్‌వైజర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాజపూడి వైద్య, పాల్గొన్నారు.

# గిరిజన చట్టాల అమలుకు పోరాటమే..

**జీవో.. 3, 1/ 70 చట్ట పరిస్థతపై ప్రభుత్వం చెప్పాలి..**

**కమిటీలతో కాలయాపన వద్దు... గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రామారావు**







**రాజవొమ్మంగి, ఆగస్టు 09, ప్రభాతవార్త** గిరిజన చట్టాల అమలు కు పోరాటం చేయక తప్పదని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అన్నారు. ఆదివారం రాజవొమ్మంగి మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆర్ అండ్. బి గెస్ట్ హౌస్ ఆవరణలో ఆదివాసీ జెండాను లోతా రామారావు, వంతు బాలకృష్ణ, వజ్రపు అప్పారావు ఎగురవేశారు. అంబేద్కర్ విగ్రహానికి అప్పారావు, సింగిరెడ్డి అచ్చారావు పూలమాలలు వేశారు.. అల్లూరి విగ్రహానికి లోతా లక్ష్మణరావు, గొల్లపూడి పెద్దిరాజు, సుంద్రు లోవలక్ష్మి పూలమాలలు వేశారు. అనంతరం ఆర్. అండ్ గెస్టు హౌస్ నుండి అల్లూరి జంక్షన్ వరకూ ర్యాలీ సాగింది. జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. తదుపరి రాజవొమ్మంగి ఆర్ అండ్ బి. గెస్ట్ హౌస్ ఆవరణలో ఆదివాసీ దినోత్సవ సభ తాము సూరిబాబు, కానేం శ్రీను అధ్యక్షతన జరిగింది. హక్కులు కోసం అందరూ పోరాటం చేయాలని పెద్దిరాజు, వెంకటలక్ష్మి, మురళీకృష్ణ అన్నారు. లోతా రామారావు మాట్లాడుతూ మన ఆచారాలు, సాంప్రదాయాలు, సంస్కృతి కాపాడు కొంటూ కొనసాగించి నప్పుడే ఆదివాసీయులం అవుతామన్నారు. 1975 సం. గిరిజనులు అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఏ వలన నేటికీ ఒరిగిందేమి లేదన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ఆదివాసీయులు నష్టపోతున్న జీవో లపై నివేదికను వెల్లడి చేయాలన్నారు. 31 సం. గా ఆదివాసీ దినోత్సవాలను చేసుకొంటున్నామన్నారు. గిరిజనులకు రక్షణ కవచమైన చట్టాలు ఒక్కొక్కటిగా కనుమరుగు అవుతున్నాయన్నారు. జీవో నెంబర్ 3 పై ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ అమలు చేయకుండా కమిటీలు పేరుతో జాప్యం చేస్తున్నారని రామారావు ఆరోపించారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న గిరిజన ప్రజాప్రతినిధులు గిరిజన చట్టాలు పరిరక్షణతో బాటు అమలుకి మీ పార్టీ జెండాలతో వచ్చినా ఆహ్వానిస్తామన్నారు. లేకపోతే అందరూ ఆదివాసీ జెండాతో పోరాటం చేద్దామని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో ఏ.పి. ఆర్ పాఠశాల, కళాశాల, ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు గిరిజన సంస్కృతిని ప్రతిభింబించే కార్యక్రమాలను ప్రదర్శించారు. అమ్మిరేకుల, కిమ్మలగడ్డ గ్రామాల వారు గంగచెల్లి, వివిధ కార్యక్రమాలను చేశారు. ఈకార్యక్రమంలో వంతు బాలకృష్ణ, గోము వెంకటలక్ష్మి, చీడి శివ, గొల్లపూడి పెద్దిరాజు, గంపా నాగరాజు, లోతా లక్ష్మణరావు, కొండ్ల సూరిబాబు, సింగిరెడ్డి అచ్చారావు , వజ్రపు అప్పారావు ,గంపా నాగరాజు ,కొంగర మురళికృష్ణ ,కుంజం జగన్నాథం , సవిరాల చంద్రుడు, సుంద్రు లోవలక్ష్మి ,ఆవూరి సుబ్బలక్ష్మి, బోదారపు కృష్ణ , ఎల్లం రాంబాబు, జుర్రా జాన్ బాబు, తూము సూరయ్యరెడ్డి ,కినపర్తి రాజబాబు, కనిగిరి వీరబాబు, రెడ్డి వెంకటరెడ్డి ,చోడి నరేష్ కుమార్, గొలగాని శ్రీను, మిరియాల రమేష్ , దాసరి పైడిమల్లి ,నాదెళ్ల కన్నబాబు, బీరబోయిన రామకృష్ణ ,ఈక శ్రీనుబాబు , గుమ్మడి లోవప్రసాద్, సవిరాల చంద్రుడు, ప్రిన్సిపాల్స్ సత్యవేణి, షీలా, బారీగా ఆదివాసీయులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ హాస్టల్స్ నందు దోమ తెరలు పంపిణి.



**గోకవరం : ఆగష్టు 9 ప్రభాత వార్త** గోకవరం మండలం నందుగల సాంఘిక సంక్షేమ హాస్టల్స్ నందు దోమతెరల పంపిణీ కార్యక్రమం జరిగినట్లు జి. కొత్తపల్లి పి. హెచ్. సి వైద్యులు డా. తిరన్ తెలిపారు.మండలం లో గోకవరం సంఘీక సంక్షేమ హాస్టల్ సంజీవయ్యానగర్, ఎస్. టి. పోస్టుమెట్రిక్ బాలుర మరియు బాలికల హాస్టల్, వీరలంకపల్లి నందుగల డా. బి. ఆర్.అంబేద్కర్ గురుకుల వసతిగృహము, కామరాజుపేట సాంఘీక సంక్షేమ బాలికల హాస్టల్, మరియు భూపతిపాలెం గురుకుల వసతి గృహము మల్లవరం నకు దోమతెరల పంపిణీ జరిగినట్లు ఆయన తెలిపారు.హాస్టల్స్ నందు విద్యార్థినీ విద్యార్థులు ఈ దోమతెరలు వాడుట వల్ల దోమకాటు బారిన పడకుండా రక్షిశీనుచకొనవచ్చునని తద్వారా సీజనల్ జ్వరాలైన మలేరియా డెంగ్యూ బారిన పడకుండా రక్షణ కల్పించుకొనుటకు ఉపయోగపడునని తెలిపారు.స్థానిక సంజీవయ్య నగర్ నందు గల సాంఘిక సంక్షేమ హాస్టల్ నందు పిల్లలకు ఏవిధంగా తెరలు వాడాలో వైద్య సిబ్బంది డిమాన్ స్ట్రేషన్ చేసి చూపించారు. ఈ పంపిణీ కార్యక్రమం లో ఎమ్. పి. హెచ్. ఏ లు పవన్, రమణ, ఆచారి, నాగేశ్వరావు లు పాల్గొన్నారు.

# శ్రీ గోవిందమాంబ అమ్మవారికి ఘనంగా ఆడపడుచు సారె



**కడియం, ఆగస్టు 9: (ప్రభాతవార్త)** మండల కేంద్రం కడియం బస్‌స్టేషన్ సమీపంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి ధర్మపత్ని శ్రీ గోవిందమాంబ అమ్మవారికి ఆడపడుచు సారె సమర్పణ మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ, విశ్వబ్రాహ్మణ సంఘం కడియం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా ఆడపడుచు సారెను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సహస్రనామార్చనను భక్తిపూర్వకంగా నిర్వహించారు. వేదమంత్రాలు, భక్తుల నామస్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని శ్రీ గోవిందమాంబ అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా విశ్వ కడియం మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మురమళ్ళ వీరభద్రరావు మాట్లాడుతూ.. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని, మానవతా విలువలను సమాజానికి బోధించిన మహనీయుడని అన్నారు. సమాజంలో మూఢనమ్మకాలను తొలగించి, జ్ఞానం, భక్తి, ధర్మం వైపు ప్రజలను నడిపించిన మహోన్నత వ్యక్తిగా వీరబ్రహ్మేంద్ర స్వామివారు చిరస్మరణీయులని పేర్కొన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆధ్యాత్మిక జీవితంలో ధర్మపత్ని శ్రీ గోవిందమాంబ అమ్మవారి పాత్ర ఎంతో విశిష్టమైనదని ఆయన తెలిపారు. భర్తకు ఆధ్యాత్మిక సహచరిగా, ధర్మపత్ని గా గోవిందమాంబ అమ్మవారు చూపిన భక్తి, సహనం, త్యాగం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామివారి ధర్మబోధనలకు, ఆధ్యాత్మిక సేవలకు గోవిందమాంబ అమ్మవారి సహకారం, అంకితభావం ఎంతో గొప్పదని వివరించారు. ఆడపడుచు సారె సమర్పణ వంటి సంప్రదాయ కార్యక్రమాల ద్వారా మన సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వం భావితరాలకు అందుతుందని వీరభద్రరావు అన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారు, శ్రీ గోవిందమాంబ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చిన మహాలక్ష్మి అమ్మవారు.

**కూరగాయలు, ఆకుకూరలతో విశేషాలంకరణ**

**ఆలయానికి పోటెత్తిన భక్తులు**



**పిఠాపురం, ఆగస్టు 9 ( ప్రభాతవార్త )** పిఠాపురం పట్టణ పరిధిలో గల చింతా వారి వీధిలో వేంచేసియున్న శ్రీ మహాలక్ష్మి గణపతి సహిత శ్రీ సీతారామాంజనేయ ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు ఆదివారం భక్తులకు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. ప్రతి ఆషాడ మాసంలో ఆలయ కమిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శాకంబరీ మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది కూడా అమ్మవారికి విశేష పూజలు అలంకరణలు చేశారు. వివిధ రకాల కూర గా యలు, ఆకుకూరలు పండ్లతో అద్భుతంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం అంతా పచ్చటి ఆకుకూరల శోభతో కనువిందు చేసింది. వృక్ష సంపదను రక్షించి క రువును నశింపజేసి ప్రజలకు అన్నపానాలు ప్రసాదించే ఆదిపరాశక్తిని ఆషాడ మాసంలో ఈ రూపంలో పూజించటం ఆనవాయితీగా వస్తున్నట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్తపల్లి పద్మ బుజ్జి తెలిపారు. శాకంబరీ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తులు దృఢవిశ్వాసాన్ని ప్రదర్శిస్తారు. సాక్షాత్తు ప్రకృతి మాతగా హరిత వర్ణ రూపిణి గా దర్శనం ఇవ్వగా ఈ దివ్య రూపాన్ని తిలకించడానికి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. దర్శనం అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. అమ్మవారి కృపతో పట్టణం చుట్టుపక్కల ప్రాంతాలు సుభిక్షంగా ఉండాలని ఆలయ నిర్వహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చింతా వెంకటేశ్వరరావు,కొత్తపల్లి వీరరాఘవ, వంగలపూడి సత్యనారాయణ,దూలి పూడి భీమేశ్వరరావు,ఆలేటి అమ్మ యమ్మ,కోరుమిల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్ళరాదు : కాకినాడ పోలీసులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి ఆగస్టు 9 (ప్రభాతవార్త)** కాకినాడ ట్రాఫిక్ ట్రాఫిక్ రూల్స్ పై అవగాహనలో భాగంగా



బుధవారం కాకినాడ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పరిమితికి మించి ఎక్కువ మంది ఆటో లలో ప్రయాణించడం వలన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వెనుకవైపు, మరియు డ్రైవర్ కి ఇరువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టుకుని ప్రయాణించరాదని, పెద్దవారిని (పాసెంజర్లను) ఆటోలు (3+1) పరిమితికి మించి తీసుకుని వెళ్ళరాదని, స్కూల్ పిల్లలను (6+1) మించి ఆటోల లో ఎక్కించికుని తీసుకు వెళ్ళరాదని, ఆటోడ్రైవర్ కు కుడివైపు ఉన్న డోర్ భాగమును ఎల్లప్పుడు క్లోజ్ చేసి ఉంచాలని, ఆటో డ్రైవర్ కి ఇరువైపులా బ్యాక్ సైడ్ మిర్రర్ కలిగి ఉండాలని వాహనములను అతి వేగముగా నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, పైన తెలిపిన సూచనలు పాటించని యెడల ఆటో డ్రైవర్స్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని, కాకినాడ పోలీసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 సి ఐఎన్ . రమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం.. ప్రజా సమస్యలపై రచ్చబండ

**తంటికొండలో జ్యోతుల నెహ్రూ పర్యటన --**
**ప్రజలతో మమేకమై సమస్యలపై ఆరా.**



**గోకవరం ఆగస్టు 9.ప్రభాత వార్త** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ గోకవరం మండలం తంటికొండ గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలనుఅడిగితెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుధ్యంతదితరసమస్యలను ప్రజలుఎమ్మెల్యేదృష్టికితీసుకువచ్చారు. ప్రజలు తెలిపిన సమస్యలను ఓపికగా విన్న జ్యోతుల నెహ్రూ, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైనసౌకర్యాలుకల్పించేందుకుప్రభుత్వంకృషిచేస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని, అందుకే ఇంటింటికీ తెలుగుదేశం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గాజింగం సత్తిబాబు, కన్నబాబు, పిల్లా చంటిబాబు, అడపా భరత్ బాబు, బదిరెడ్డి అచ్చన్న దొర, దాసరి సీతారామకృష్ణ, సిరి, నాగం వెంకటపతి కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే తమ గ్రామానికి వచ్చి సమస్యలను నేరుగా తెలుసుకోవడంపై గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# తాళ్ళరేవు వాసవీ క్లబ్ సేవలు భేష్.

**210 ఎ జిల్లా గవర్నర్ కృష్ణమోహన్**






**తాళ్లరేవు, ఆగష్టు9( ప్రభాతవార్త):** తాళ్లరేవు వాసవి క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను స్ఫూర్తి గా తీసుకుని జిల్లాలోని క్లబ్బులు తమ కార్యక్రమాలు మరింత విస్తరించాలని వాసవి క్లబ్ 210ఎ జిల్లా గవర్నర్ సమయమంతుల కృష్ణమోహన్ అన్నారు. తాళ్ళరేవు వాసవి క్లబ్ కపుల్స్ ను ఆయన ఆదివారం అఫీషియల్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తాళ్ళరేవు క్లబ్ క్రమం తప్పకుండా అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వాసవి అమ్మవారిని శాకాంబరి అలంకరణ చేసి అమ్మవారి కి సారి సమర్పణ చేసి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కోరంగి ప్రాథమిక పాఠశాలకు వాటర్ ట్యాంక్ బహుకరించి, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కోరంగి వృద్ధ ఆశ్రమంలోని గోశాలకు తవుడు, ఆశ్రమములో వృద్దులకు, అనాధ పిల్లలకు భోజనాలు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమం లో డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ చిట్టూరి సత్యనారాయణ, ఐపీసీ పేకేటి సర్వేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఇంచార్జి అద్దేపల్లి సత్తిరాజు, రీజియన్ చైర్మన్ చింతలపూడి సర్వలక్ష్మి, క్లబ్ ప్రెసిడెంట్ గుండు సీత, సెక్రటరీ కొమ్మూరి రత్నమాల, ట్రెజరర్ సామా పూర్ణ, సామా నరేష్ , కొమ్మూరి వాసు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps